

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

బుధవారం | 2-1-2019 | పేజీలు: 14 + 20 | వెల: రూ. 6.50 | సంపుటి: 15 సంచిక: 177


శ్రీవిళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి రా. 2.10 తదుపరి త్రయోదశి; నక్షత్రం: విశాఖ ఉ. 9.40 తదుపరి అనూరాధ; వర్జ్యం: మ. 1.54-3.35; దుర్ముహూర్తం: ఉ. 11.58-12.42; అమృతఘడియలు: రా. 12.03-1.45; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 5.49 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai



సంగ్రామం ప్రారంభం

పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల





విడత	పంచాయతీలు	వార్డులు	నామినేషన్లు	గడువు	పోలింగ్/లెక్కింపు
తొలి విడత	4,480	39,832	జనవరి 7	జనవరి 9	జనవరి 21
రెండో విడత	4,137	36,620	జనవరి 11	జనవరి 13	జనవరి 25
మూడో విడత	4,115	36,718	జనవరి 16	జనవరి 18	జనవరి 30

1.49 కోట్లు మొత్తం ఓటర్లు

12,732 మొత్తం సర్పంచులు

- మూడు విడతల్లో ఎన్నికలు.. ఈ నెల 7, 11, 16 తేదీల్లో నోటిఫికేషన్లు
- ప్రచారం సాయంత్రం 6 గంటల వరకే.. 21, 25, 30 తేదీల్లో పోలింగ్
- పోలింగ్ రోజునే లెక్కింపు, ఫలితాలు.. ఆ వెంటనే ఉప సర్పంచ్ ఎన్నిక

మంత్రివర్గ విస్తరణ మరింత లేటు? 12

పంచాయతీ ఎన్నికలపై పూర్తి వివరాలు లోపలి పేజీల్లో



అమల్లోకి ఎన్నికల 'కోడ్' 11

కొత్త పథకాలు, శంకుస్థాపనలకు బ్రేక్

ఎన్నడూ లేనిది ఊరి బొడ్రాయి కాడ జోరుగా మాటలు ఇనిపిస్తున్నయి!! యాల పొద్దుగాల్నే శివారుకు ఎడ్లను తోలుకు పోతున్న ఎల్లన్న.. బర్లకు పచ్చిమ్యాత కోసేందుకు బోరుకాడికి తర్లిన బీరప్ప.. ఇంకా శానామంది అక్కడ ఆగి ముచ్చట్లు పెట్టిన్రు! మన ఊర్ల సర్పంచ్ ఎన్నికలు ఎప్పుడే? రిజర్వేషన్ గిన ఒచ్చిందా? ఈ మారు సర్పంచ్ కోసం పోటీల ఉండేటోల్లు ఎవరున్నరు? ఇలా ముచ్చట్లు సాగినయ్!! ఊర్లల్ల సర్పంచ్ ఎన్నికల ఉడుకు ఇంకా పెరిగింది. గ్రామ పంచాయతీ ఎన్నికలకు నగారా మోగింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 21, 25, 30 తేదీల్లో మూడు విడతల్లో ఎన్నికలు జరుగనున్నాయి.

ముందే మోగిన నగారా!

కోర్టు కేసు దృష్ట్యా సెలవు రోజున నోటిఫికేషన్

ఏమిటీ నిర్లక్ష్యం?

కరకట్టల నిర్మాణం ఇంకెప్పుడు.. మేడిగడ్డలో సీఎం సూటి ప్రశ్న



కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ వద్ద పనుల పురోగతిని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

- నిధుల కొరత లేదు.. రాత్రింబవళ్లూ చేస్తున్నారు
- అయినా, పనులు ముందుకు కదలడం లేదేం!?
- జూన్‌కల్లా గోదావరి నీళ్లు రైతులకు ఇవ్వాల్సిందే
- పనులన్నీ ఏప్రిల్ 15వ తేదీలోగా పూర్తి చేయండి
- ఎన్నికల్లో ప్రజలు భారీ మెజారిటీ కట్టబెట్టారు
- ప్రాజెక్టులు పూర్తి చేసి చిత్తశుద్ధి చాటుకుంటాం
- 10 రోజులకోసారి సీఎంవో పర్యవేక్షణ: కేసీఆర్
- మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌస్‌ల పరిశీలన
- నేడు అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టుల వద్దకు సీఎం

మేడిగడ్డ బ్యారేజీ పనులు అనుకున్నంత స్థాయిలో ముందుకు సాగడం లేదని సీఎం కేసీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కాళేశ్వరం పనులన్నీ ఏప్రిల్ 15నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మంగళవారం మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌస్ పనులను పరిశీలించిన ఆయన పునాస నాటికి కాళేశ్వరం నీళ్లు.. పొలాల్లో పారాలని స్పష్టం చేశారు.

భూపాలపల్లి/హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): బ్యారేజీ పనుల్లో నిర్లక్ష్యం కనబడుతోందని, ఇకముందు ఇలాంటి ధోరణికి స్వస్తి పలికి ఏప్రిల్ 15వ తేదీలోగా మేడిగడ్డ బ్యారేజీ పనులన్నీ పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, నీటిపారుదల శాఖ అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. మార్చి నెలాఖరుకు పనులన్నీ పూర్తి చేసి, ఏప్రిల్, మేల్లో ఇతర సమస్యలు పరిష్కరించుకుని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఖరీఫ్ నాటికి కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లను రైతుల పొలాల్లో పారించాలని స్పష్టం చేశారు. గోదావరిలో తెలంగాణ వాటా నీళ్లను వీలైనంత త్వరగా ఉపయోగించుకోవాలంటే, పంప్‌హౌస్‌ల నిర్మాణం, మోటార్ల బిగింపు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని గోదావరిపై

మిగతా 12వ పేజీలో...



రాజ్‌భవన్‌లో మంగళవారం తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ రాధాకృష్ణన్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న గవర్నర్ నరసింహన్. చిత్రంలో సీఎం కేసీఆర్

తెలంగాణ జస్టిస్

మన హైకోర్టు మన సీజే

తెలంగాణ ఉన్నత న్యాయస్థానం అవతరణ

- రాష్ట్రం ఏర్పడిన నాలుగున్నరేళ్లకు ఆవిర్భావం
- తొలి చీఫ్ జస్టిస్‌గా రాధాకృష్ణన్ బాధ్యతలు
- రాజ్‌భవన్‌లో భగవంతుడి సాక్షిగా ప్రమాణం
- అనంతరం 12 మంది జడ్జిల ప్రమాణ స్వీకారం
- తొలిసారి హైకోర్టుకు వెళ్లిన సీఎం కేసీఆర్
- ఆంధ్రప్రదేశ్‌లోనూ కొత్త హైకోర్టుకు శ్రీకారం
- సీజే ప్రవీణ్, 13 మంది జడ్జిలతో ప్రమాణం

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నాలుగున్నరేళ్ల కల సాకారమైంది. తెలంగాణ హైకోర్టు అవతరించింది. తొలి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ తొట్టతిల్ భాస్కరన్ నాయర్ రాధాకృష్ణన్ బాధ్యతలు చేపట్టారు. రాజ్‌భవన్‌లో మంగళవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ నరసింహన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. 'రాధాకృష్ణన్ అనే నేను రాజ్యాంగాన్ని, దేశ సమగ్రతను కాపాడతానని, రాగద్వేషాలకు అతీతంగా.. భయం.. పక్షపాతం లేకుండా విధులు నిర్వర్తిస్తానని భగవంతుడి సాక్షిగా దేవుడి మీద ప్రమాణం చేసి చెబుతున్నా' అంటూ ప్రమాణ స్వీకారం చేశారు. అంతకు ముందు.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ప్రత్యేక హైకోర్టులు ఏర్పడినందున తెలంగాణ హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్‌ను

మిగతా 2వ పేజీలో...

43 శాతం ఐఆర్ ఇవ్వాలి: యూటీఎఫ్ 2





నాతోనే జనం.. నాదే ప్రభంజనం

"కేసీఆర్ చొరవతో కూటమి ఒకటి ఏర్పడిందనీ, ఏర్పడుతోందని నాకు తెలియదు. ఆ విషయం నా దృష్టికే రాలేదు. నేను మరీ అంత అజ్ఞానంలో ఉన్నానని అనుకోవడం లేదు. చంద్రబాబు ఆరోపణలన్నీ ఆక్రోశంతో చేస్తున్నవే. ఆయనకు తెలంగాణపై ఎంత ద్వేషభావం ఉందో, తెలంగాణ ఎన్నికల్లో ఆయన ఆశలు ఎలా అడియాసలయ్యాయో అందరికీ తెలుసు. ఆ బాధతో ఏదో అంటే నేనేమీ చేయలేను" -మోదీ

2019 ఎన్నికలు 'కూటమి-ప్రజల' మధ్యే


- ఆకాంక్షలు నెరవేర్చేవారి వెంటే ప్రజలు
- ఎవరేమన్నా రాఫెల్‌పై ముందుకే!
- భారత దేశ భద్రతే నాకు ముఖ్యం
- కాంగ్రెస్ ప్రథమ కుటుంబం బెయిల్‌పై!
- అయోధ్య తీర్పునకు ఆ పార్టీ అడ్డంకులు
- కోర్టు తేల్చిన తర్వాతే ప్రభుత్వ బాధ్యత
- సర్జికల్ స్ట్రైక్స్ అతి పెద్ద రిస్క్ అని తెలుసు
- సూర్యోదయంలోపే వచ్చేయాలని చెప్పా
- నోట్ల రద్దు దెబ్బకే నీరవ్‌మోదీ, చోక్సీ పరారీ
- దోచేసిన సొమ్ము ప్రతిపైసా కక్కిస్తాం
- రుణమాఫీతో రైతుల కష్టాలు తీరవు
- ఎన్నికలు ఒక కోణం మాత్రమే!

ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ ఉద్ఘాటన

న్యూఢిల్లీ, జనవరి 1: "మోదీ ప్రభంజనం ముగిసింది' అనేవారు ఎప్పుడూ ఉంటారు. కానీ.. ప్రజలు నాతోనే ఉన్నారు' అని ప్రధాని నరేంద్ర మోదీ తేల్చిచెప్పారు. 2019 ఎన్నికలను ప్రజలకు, మహాకూటమికి మధ్య జరగనున్న పోరుగా అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ తనపై బురదజల్లినా సరే రాఫెల్ యుద్ధవిమానాలపై ముందుకే వెళ్దామని స్పష్టం చేశారు. రాఫెల్ డీల్‌పై గగ్గోలు పెట్టేవారు దేశ రక్షణ దళాలను బలహీనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామమందిరంపై

మిగతా 13వ పేజీలో...





ఫెడరల్ ఫ్రంట్ ఎక్కడుంది?

- మమత, నవీన్ చేరతారని బీజేపీకెవరు చెప్పారు?
- నాలుగున్నరేళ్ల పాలనపై నాతో చర్చకు మోదీ సిద్ధమా?
- టీఆర్ఎస్ గెలిస్తే ప్రధానమంత్రికి ఎందుకు ఆనందం
- ఏపీలో సామంత రాజులుండాలని కేసీఆర్ భావన
- ఇక్కడ బలహీన సర్కారుంటే అక్కడ గొప్పలు చెప్పొచ్చు
- పత్రికల్లో ప్రకటనలిచ్చి అవమానిస్తున్నారు: చంద్రబాబు

13

మహా కూటమి.. మహా ఓటమి!



- అదో విఫల ప్రయోగం.. తెలంగాణలో రుజువైంది
- కేంద్రంలోనూ అంతే.. కేసీఆర్ ఫ్రంట్‌లోనే మమత
- ప్రధానిగా మోదీ కావాలా? వద్దా?: అరుణ్ జైట్లీ

3



పరంజ్యోతి

శుద్ధి-సిద్ధి



సదాశివుడు బోధించిన లక్షా ఇరవై ఐదు వేల రకాల లయయోగాలలో నాదానుసంధాన సమాధియోగమే ఉత్తమమైనది. ప్రాణాయామం వలన సర్వనాడీ శుద్ధి జరిగి, హృదయంలో రకరకాల ధ్వనులతో అనాహత నాదమనే పేరుతో నాదం పుడుతుంది. పరమతత్వం చేరటానికి నాదానుసంధానమే సాధనం. దాని అనుగ్రహముంటే ప్రాణవాయువును, మనసును హృదయంలో లీనం చేయొచ్చు. మూలంలో మూలబంధనం, ఉదరంలో ఓడ్యాణ బంధనం, కంఠంలో జాలంధర బంధనంగా నాడులన్నీ బిగించి, మరణ భయాన్ని దూరం చేసుకోవచ్చు. మూడు బంధాలను సాధిస్తే, మూలాధారంలోనే కుండలినీ శక్తి మేల్కొని, ప్రాణవాయువు సుషుమ్నానాడిలో ప్రవేశిస్తుంది. ప్రాణం నిశ్చలమవుతుంది. బంధత్రయాభ్యాసం వలన ప్రాణవాయువు సుషుమ్నా నాడిని దాటి సహస్రారంలోని చంద్రకళను తాకుతుంది. బంధయాత్రయాభ్యాసం పూర్ణమై, రేచక, పూరకాలు ఆగుతయ్. మనసులోని విషయవృత్తులు పోగా, కుంభకం మిగులుతుంది. అదే కేవల కుంభక యోగం. మనసు అనాహత చక్రంలో ఏకాగ్రంగా నిలిపితే, శ్వాసతో పాటు మనోసంచారమూ ఆగిపోతుంది. ఇది తిరుగులేని యోగం. హఠయోగంలో ఎన్ని కుంభక యోగాలున్నా, కేవలకుంభకమే ఉన్నతమైనది. కేవలకుంభకంలో ఉంటూ, మనసును అనాహతం నుండీ అజ్ఞాచక్రం వరకు తెచ్చి, స్తంభింపజేస్తే, ప్రాణవాయువు ఆజ్ఞాచక్రంలో ఉన్న శూన్యంలో లయిస్తుంది. ప్రత్యేక ప్రయత్నం లేకుండానే జరిగే ఈ కేవల కుంభకం.. నాదానుసంధానం కంటే భిన్నమైనది, సహజమైనది. కేవలకుంభకంలో మనసును తత్త్వజ్ఞానమయం చేయాలి. అప్పుడు ఇంద్రియవృత్తులన్నీ శూన్యమై పూర్తిగా వాయులీనం జరుగుతుంది. శుద్ధ జ్ఞాన మూర్తులకే ఇది సాధ్యం. లక్ష్యం, ఏకాగ్రం, మనోస్తంభన, దేశ కాల నియమాలు అక్కరలేని, ప్రాణాయామ, ధారణా, ధ్యానాలు అవసరం లేని ఉత్తమయోగాన్ని రాజయోగంగా పిలుచుకోవాలి. రాజయోగ స్థితిలో కనురెప్పల కదలికలుండవు. ప్రాణవాయువు తీసుకోవడం, వదలడం ఉండదు. మనసుకు సంకల్ప వికల్పాలుండవు. అదే మనోన్మని. అంటే ఉన్నత మనస్సు. ఆ స్థితిలో శ్వాస గమనం, మనోగమనం ఆగిపోయి, శరీరం గాలిలో వెలగే నిశ్చల దీపం అవుతుంది. ప్రపంచాన్ని పట్టించుకోకుండా, మనస్సులో పుట్టే సంకల్పాలను నిర్మూలించగలిగితే, అదే ఉన్మనీ స్థితి. ఉచ్ఛ్వాస నిశ్వాసలు తగ్గి, శరీరం నిటారుగా నిలిచి, కళ్లు అర్ధనిమీలితమైనపుడు ఆ స్థితి అమనస్క ముద్ర అవుతుంది. ఈ ముద్రలో అహంకార మమకారాలు కుప్పకూలుతాయి. భావమూ మనసును దాటి శూన్యంగా ఉండిపోతుంది. ఈ సహజ అమనస్క స్థితిలో ఇంద్రియాలు మరలి, పరమాత్మతో యోగం తరలి వస్తుంది. పూర్వ వాసనలన్నీ నశించి, ప్రపంచం గురించిన ఆలోచనలు వదలిపోగా, జడత్వమూ ఉండదు. ఆ స్థితే యోగనిద్ర. అవస్థాత్రయాన్ని దాటి, తురీయమనే శయ్యపై జ్ఞానమయమైన నిద్రను, వికల్పరహిత స్థితిలో ఎప్పుడూ నిద్రించగల యోగం లభించాలి. ఆత్మవిద్యను అనుభవంలోకి తెచ్చుకోవటానికి కావలసిన దివ్య సాధనం.. యోగశాస్త్రం. ఈ రెండింటినీ అభేద స్థాయిలో అనుష్ఠానం చేసుకోగలిగితే సాధకుడి జన్మ ధన్యం.

- వి.ఎస్.ఆర్.మూర్తి, ఆధ్యాత్మిక శాస్త్రవేత్త

లోకం తీరు





హైదరాబాద్‌లో మంగళవారం తెలంగాణ హైకోర్టు జడ్జిలుగా ప్రమాణస్వీకారం అనంతరం గ్రూపు ఫొటో (కుడి నుంచి ఎడమకు) జస్టిస్ అభినంద్ కుమార్ షావ్లీ, జస్టిస్ షమీమ్ అఖ్తర్, జస్టిస్ చల్లా కోదండరామ్ రెడ్డి, జస్టిస్ ఏ రాజశేఖర్‌రెడ్డి, జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్, జస్టిస్ రాఘువేంద్ర సింగ్ చౌహాన్, సీజే జస్టిస్ టీబీటీ రాధాకృష్ణన్, జస్టిస్ వీ రామ సుబ్రమణ్యన్, జస్టిస్ ఎమ్ఎస్ రామ చంద్ర రావు, జస్టిస్ పీవీ నవీన్‌రావు, జస్టిస్ బీ శివశంకర్ రావు, జస్టిస్ పీ కేశవరావు, జస్టిస్ టీ అమర్‌నాథ్ గౌడ్



ప్రారంభోత్సవ కార్యక్రమంలో జస్టిస్ రమణ, జస్టిస్ ప్రవీణ్ కుమార్, చంద్రబాబు, ఇతర న్యాయమూర్తులు

ఏపీలో హైకోర్టుకు శ్రీకారం

» కొలువుతీరిన ఉన్నత న్యాయస్థానం

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం విజయవాడలో జనవరి ఒకటి నుంచి ప్రారంభమైంది. చీఫ్ జస్టిస్‌గా ప్రవీణ్‌కుమార్‌తోపాటు మరో 13 మంది న్యాయమూర్తులుగా ప్రమాణ స్వీకారం చేయడంతో లాంఛనంగా ఏపీ హైకోర్టు అందుబాటులోకి వచ్చింది. విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో గవర్నర్ నరసింహన్ మంగళవారం తొలుత చీఫ్ జస్టిస్‌గా ప్రవీణ్‌కుమార్‌తో.. అనంతరం న్యాయమూర్తులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

తాత్కాలిక హైకోర్టు భవనాలు ప్రారంభం

నవ్యాంధ్రలో హైకోర్టు తాత్కాలిక భవనాలు ప్రారంభమయ్యాయి. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని, సీఎంతో కలిసి భవనాలను ప్రారంభించారు. యాక్టింగ్ సీజే జస్టిస్ ప్రవీణ్‌కుమార్ రిబ్బన్ కట్ చేశారు. భవనం లోపల కోర్టు బెంచ్‌ను పరిశీలించారు. అనంతరం కోర్టు భవనాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద న్యాయమూర్తులు, సీఎం ప్రసంగించారు.

ప్రమాణం చేసిన న్యాయమూర్తులు

జస్టిస్ ఎస్వీ భట్, జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ ఎం.సీతారామమూర్తి, జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ తాళ్లూరి సునీల్ చౌదరి, జస్టిస్ మల్లవోలు సత్యనారాయణమూర్తి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్, జస్టిస్ జె.ఉమాదేవి, జస్టిస్ ఎన్.బాలయోగి, జస్టిస్ తేలప్రోలు రజని, జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ కొంగర విజయలక్ష్మి, జస్టిస్ మంతోజు గంగారావు.

విభజన సంపూర్ణం

» హైకోర్టు రాకతో సకలం వచ్చాయి

» బాధ.. ఆనందం కలిసిన సన్నివేశం: ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు రాకతో రాష్ట్ర విభజన సంపూర్ణమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆర్థిక వ్యవహారాలు తప్ప ఇక విభజన జరగాల్సినవి ఏవీ లేవని పేర్కొన్నారు. బెజవాడ హైకోర్టు భవనాలను ప్రారంభించిన అనంతరం.. ఆయన న్యాయమూర్తులు, న్యాయవాదులను ఉద్దేశించి మాట్లాడారు. న్యాయవాదులతో విజయవాడ కళకళలాడుతోందన్నారు. హైకోర్టు విభజన కొంత బాధ, కొంత ఆనందం కలిగించిందని చెప్పారు. ఇదో చారిత్రక అంశం అన్నారు. హైదరాబాద్‌లో 60ఏళ్లు ఉన్నామని, 62ఏళ్ల తర్వాత సొంత ప్రాంతంలో న్యాయ పరిపాలనకు శ్రీకారం చుట్టామని చెప్పారు. కొత్త రాష్ట్రం కాబట్టి కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, వీలైనంతమేర ఇబ్బందుల్లేకుండా చూస్తామని న్యాయమూర్తులు, న్యాయవాదులకు తెలిపారు. తక్కువ సమయం ఉన్నప్పటికీ కార్యక్రమానికి ఇబ్బందుల్లేకుండా చూడాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. ఇదే విషయం ఫోన్‌చేసి సీజేకు చెప్పానని, తాము కూడా మానసికంగా వాటికి సిద్ధపడ్డామని ఆయన అన్నారని తెలిపారు. అందరి సహకారంతో అమరావతిని చారిత్రక నగరంగా నిర్మిస్తామన్నారు. కొత్త రాష్ట్రానికి తాను తొలి ముఖ్యమంత్రినని, నరసింహన్ తొలి గవర్నర్ అని, తొలి సీజే ప్రవీణ్‌కుమార్ అని అన్నారు. ఇది అత్యంత తక్కువ వయసు కలిగిన హైకోర్టు అని, కానీ దేశంలోనే ఎక్కువ పేరుప్రఖ్యాతులు సాధించేలా అందరం కలిసి కృషి చేద్దామని కోరారు. జనవరి 1న ఏర్పడిన హైకోర్టు ఇదేనని, తేదీ గుర్తుంచుకోవడం కూడా సులభం అని సరదాగా అన్నారు. చరిత్రలో నూతన మలుపునకు ఇది నాంది అని పేర్కొన్నారు.

కొత్త చరిత్ర ఆరంభం..

» పరిమిత వనరులతోనే పనిచేస్తాం.. ఇబ్బందులూ ఉంటాయి

» అవన్నీ అధిగమించేందుకు సిద్ధం: యాక్టింగ్ సీజే ప్రవీణ్‌కుమార్

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హైకోర్టు ఏర్పాటుతో కొత్త చరిత్ర ప్రారంభమైందని హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ప్రస్తుతం పరిమిత వనరులే ఉన్నాయని, ప్రారంభంలో ఇబ్బందులూ ఉంటాయని, అయినా వాటిని ఎదుర్కొని పనిచేయడానికి సిద్ధపడ్డామని తెలిపారు. తన సహచర న్యాయమూర్తులతో కలిసి హైకోర్టు ఔన్నత్యాన్ని కాపాడేలా ముందుకు సాగుతానని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉన్నతస్థానానికి చేరుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. రాష్ట్ర కొత్త రాజధానిని 16 వేల గ్రామాల నుంచి పవిత్ర జలాలు, మట్టితో ప్రారంభించారన్నారు. రాజధాని ఎకో ఫ్రెండ్లీగా నిర్మితమవుతోందన్నారు. సీఎం చంద్రబాబు 28 సంవత్సరాలకే మంత్రి అయ్యారని, ఆయన డైనమిక్ విజన్ అందర్నీ ముందుకు సాగేలా చేస్తుందని వ్యాఖ్యానించారు. అనంతరం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గగోయ్ సందేశాన్ని ఆయన చదివి వినిపించారు. ఆ తరువాత ఉండవల్లి ప్రజావేదికలో న్యాయమూర్తులు, న్యాయవాదులకు చంద్రబాబు విందు ఇచ్చారు.

మన హైకోర్టు.. మన సీజే

(మొదటిపేజీ తరువాయి)

నియమిస్తూ కేంద్ర న్యాయ శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌పై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోద ముద్ర వేశారని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వెల్లడించారు. ఆ ఉత్తర్వులను అనుసరించి రాధాకృష్ణన్‌తో గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో సీఎం కేసీఆర్, స్పీకర్ మధుసూదనాచారి, మండలి చైర్మన్ స్వామిగౌడ్, హైకోర్టు న్యాయమూర్తులు, కాంగ్రెస్ ఎమ్మెల్సీ షబ్బీర్ అలీ, టీడీపీ-టీఎస్ అధ్యక్షుడు ఎల్.రమణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, సీఎస్ ఎస్‌కే జోషి, డీజీపీ మహేందర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఆరు నెలల్లోనే రెండోసారి

తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా గత ఏడాది జూలై 7న ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ రాధాకృష్ణన్.. ఆరు నెలల్లోనే రెండోసారి ప్రమాణ స్వీకారం చేశారు. ఉమ్మడి హైకోర్టును విభజించడంతోపాటు రాధాకృష్ణన్‌ను తెలంగాణ హైకోర్టుకు కేటాయించిన విషయం తెలిసిందే. దాంతో ఆయన మరోసారి ప్రమాణ స్వీకారం చేయాల్సి వచ్చింది. ఈ కార్యక్రమం కేవలం ఆరు నిమిషాల్లో ముగిసింది. అనంతరం గవర్నర్ తేనీటి విందు ఇచ్చారు. వెనువెంటనే బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకొని.. హెలికాప్టర్లో అమరావతికి వెళ్లారు.

న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం

తెలంగాణ హైకోర్టుకు కేటాయించిన 12 మంది న్యాయమూర్తులు హైకోర్టు ప్రాంగణంలో మంగళవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. వారితో ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు. వారికి ముఖ్యమంత్రి కేసీఆర్ పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు. రాజ్‌భవన్లో చీఫ్ జస్టిస్ ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నేరుగా తెలంగాణ హైకోర్టు ప్రాంగణానికి వెళ్లారు. రాష్ట్రం ఏర్పడిన నాలుగున్నరేళ్ల తర్వాత హైకోర్టుకు సీఎం రావడం ఇదే తొలిసారి. ఈ కార్యక్రమంలో కేసీఆర్‌తోపాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.సుభాష్ రెడ్డి, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పెద్ద సంఖ్యలో హైకోర్టు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారానికి హాజరైన ముఖ్యమంత్రి కేసీఆర్

న్యాయవాదుల కుటుంబం నుంచే..

కేరళలోని కొల్లాంలో న్యాయవాదుల కుటుంబంలో 1959లో జన్మించిన జస్టిస్ రాధాకృష్ణన్ బెంగళూర్ వర్సిటీ నుంచి న్యాయ శాస్త్రంలో పట్టా పొందారు. 1983లో తిరువనంతపురంలో జూనియర్ అడ్వకేట్‌గా ప్రాక్టీస్ ప్రారంభించారు. 2004లో కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం, ఛత్తీస్‌గఢ్, తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు సీజేగా పనిచేశారు.

ప్రమాణ స్వీకారం చేసిన న్యాయమూర్తులు వీరే!

జస్టిస్ వి.రామసుబ్రమణ్యన్, జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ పులిగోరు వెంకట సంజయ్‌కుమార్, జస్టిస్ పొనుగోటి నవీన్‌రావు, జస్టిస్ చల్లా కోదండరాం చౌదరి, జస్టిస్ బులుసు శివశంకర్‌రావు, జస్టిస్ డాక్టర్ షమీమ్ అఖ్తర్, జస్టిస్ పొట్లపల్లి కేశవరావు, జస్టిస్ అభినంద్ కుమార్ షావ్లీ, జస్టిస్ తోడుపునూరి అమర్నాథ్ గౌడ్, జస్టిస్ ఎ.రాజశేఖర రెడ్డి, జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు

కొందరి అతి విశ్వాసం వల్లే ఓటమిపాలయ్యాం

భాగస్వామ్య పక్షాలు నా మాట వినలేదు

'లోక్‌సభ'కు పోటీపై నిర్ణయం తీసుకోలేదు

బాబు, కేసీఆర్.. ఏం గిఫ్టు ఇచ్చుకుంటారో?

ఫెడరల్ ఫ్రంట్.. పనికిరాని పని: కోదండరాం



హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రజాఫ్రంట్‌లోని కొందరు నేతల అతివిశ్వాసం వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం ఎదుర్కోవాల్సి వచ్చిందని తెలంగాణ జన సమితి(టీజేఎస్) అధ్యక్షుడు కోదండరాం అన్నారు. తమ ఓటమికి ఈవీఎంలు కూడా కారణమన్నారు. అయితే నెపాన్ని పూర్తిగా ఈవీఎంలపైనే నెట్టివేసి.. అసలు కారణాలను సమీక్షించకుండా ఉత్తుత్తి విశ్లేషణలతో లాభం ఉండదన్నారు. ఓట్ల తొలగింపుపై పోరాటం చేస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రచారాన్ని కాంగ్రెస్ బాగా ఆలస్యం చేసిందన్నారు. 'కేసీఆర్ ప్రచార శైలి మీకు తెలియడం లేదు. ఆయన ప్రచార శైలి, వ్యూహాలను దగ్గరుండి చూశాన'ని హెచ్చరించినా భాగస్వామ్యపక్షాలు తన మాట వినలేదన్నారు. సభలు, సమావేశాలతోనే ప్రచారాన్ని ముగించామని, గడపగడపకూ చేరుకోలేకపోయామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినా విశ్వాసాన్ని కోల్పోబోమని, గెలుపోటములు సహజమని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని కోదండరాం స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి తాను రాజ్యసభకు వెళ్లే అవకాశం ఉందన్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. పార్లమెంటు ఎన్నికల్లోనూ ప్రజాఫ్రంట్ కొనసాగుతుందని భావిస్తున్నానన్నారు. ప్రత్యామ్నాయ కూటమి ఏర్పాటు జాతీయ స్థాయిలో రెండుసార్లే సాధ్యమైందని, ప్రస్తుతం ఫెడరల్ ఫ్రంట్‌కు అవకాశం లేదని కోదండరాం స్పష్టం చేశారు. ఆ ఫ్రంట్ ఎవరి కోసమో కేసీఆర్‌కే తెలియాలన్నారు. ఏపీ సీఎం చంద్రబాబుపై తెలంగాణ సీఎం కేసీఆర్‌కు ఎంత ప్రేమ ఉందో.. వాళ్ల మధ్యలో ఎలాంటి సంబంధాలున్నాయో తనకు తెలియదని కోదండరాం అన్నారు. అయితే వాళ్లు ఏం గిఫ్టు ఇచ్చుకుంటారో చూడాలన్నారు.

'తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టు పాత్ర'కు డాక్టరేట్



హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జర్నలిజం విభాగంలో యాకేష్ దైదకు తెలుగు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. 'తుది దశ తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర'పై ఆయన చేసిన పరిశోధనకుగానూ ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు యూనివర్సిటీ తెలిపింది. పలు న్యూస్ చానెళ్లలో పని చేసిన యాకేష్.. ప్రస్తుతం అంబేద్కర్ యూనివర్సిటీలో పని చేస్తున్నారు. తెలంగాణ అంశంపై అనేక పరిశోధనలు జరిగినప్పటికీ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్రపై ఎవరూ దృష్టి సారించలేదని, జర్నలిస్టులకు ఉపయోగకరంగా ఉండాలని ఈ అంశాన్ని సవాలు తీసుకుని పూర్తి చేసినట్లు తెలిపారు.

43 శాతం ఐఆర్ ప్రకటించాలి

» యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి రవి డిమాండ్

» ఖమ్మంలో ముగిసిన యూటీఎఫ్ మహాసభలు

» 135 మందితో రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక

» అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రాములు, రవి



చావా రవి (ప్రధాన కార్యదర్శి), సీహెచ్.రాములు (అధ్యక్షుడు)

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 1: రాష్ట్రంలో ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు 43 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. ఖమ్మంలో మూడు రోజుల పాటు జరిగిన టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర తృతీయ మహాసభలు మంగళవారం ముగిశాయి. చివరి రోజున సంఘం నివేదికలు, తీర్మానాలపై చర్చించి ఆమోదించారు. పాఠశాల విద్యారంగంలో సానుకూల సంస్కరణల అమలుకు తల్లిదండ్రుల భాగస్వామ్యంతో గ్రామీణ విద్యా సదస్సులు నిర్వహించాలని తీర్మానించారు. పాఠ్య పుస్తకాలు, సిలబస్, సీసీఈ తదితర అంశాలను అధ్యయనం చేసి లోపాల సవరణకు కృషి చేయాలని మరో తీర్మానం చేశారు. సంఘం అధ్యక్షుడు సీహెచ్.రాములు, కన్వీనర్ వెంకట్ పలు నివేదికలను ప్రవేశపెట్టారు. ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. మహాసభలకు హాజరైన ప్రతినిధుల్లో 25 శాతం మహిళలు ఉండడం విశేషం. ప్రతినిధుల్లో 90 శాతం మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ తరగతులకు చెందిన వారు ఉన్నారు. సావిత్రి బాయి పూలే జయంతి అయిన జనవరి 3వ తేదీని జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుర్గా భవానీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బలహీనతలను అధిగమిస్తూ సంఘం బలం పెంచుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకుడు బి.వెంకట్ సూచించారు. ప్రతినిధుల సభ అనంతరం యూటీఎఫ్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని 135 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా సీహెచ్. రాములు, చావా రవి తిరిగి ఎన్నికయ్యారు.

చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
అదిలాబాద్	5.2	27.3
సంగారెడ్డి	6.3	26.0
హైదరాబాద్	9.3	28.8
వరంగల్	9.5	28.5
ఖమ్మం	13.0	28.0

చలి గుప్పిట్లో రాష్ట్రం

చలిగాలులు రాష్ట్రాన్ని వణికిస్తున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు అడుగు బయట పెట్టేందుకు జంకుతున్నారు. వారం రోజులుగా చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగిపోయింది. ఉత్తరాది నుంచి చలిగాలుల తీవ్రత పెరిగిన నేపథ్యంలో చలి అధికంగా ఉంటోందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. మరో వారం ఇలాగే ఉంటుందని చెబుతున్నారు. చలి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని వాతావరణ శాఖ నాలుగు రోజుల పాటు హెచ్చరికలు జారీచేసింది. ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఏజెన్సీ మండలాలు చలికి వణికిపోతున్నాయి. మంగళవారం తిర్యాణి మండలంలో 3.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, జైనూరులో 5.2, ఆసిఫాబాద్‌లో 5, కెరమెరిలో 4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



కాంగ్రెస్ ఆలోచనలు ఇటలీ మహిళ కోసమే..!

కాంగ్రెస్ ఆలోచనలు ఇటలీ మహిళ కోసమే... హిందూ ముస్లిం మహిళల అవసరాలు వారికి పట్టవు. త్రిపుల్ తలాక్ బిల్లు సెలక్ట్ కమిటీకి ఎందుకు పంపించాలి? ఇప్పటికే దీనిపై సభల్లో వాదనలు చాలు.. యావత్ దేశమంతా దీనిపై వాదనలు చేస్తోంది.

- బీజేపీ నేత సుబ్రహ్మణ్యస్వామి



ముందు నా కులం.. తర్వాతే సమాజం


నేను మీకు హామీ ఇస్తున్నా. మిమ్మల్ని విడిచిపెట్టను. నా కులస్థుల అభివృద్ధికి పాటుపడ్డమే నా ప్రథమ కర్తవ్యం. విశాలమైన సమాజ హితం కోసం పనిచేయడమనేది తర్వాతి అంశం.. నేను ప్రతి ఒక్కరి కోసం పనిచేస్తాను.

- రాజస్థాన్ శిశు సంక్షేమశాఖ మంత్రి మమతా భూపేష్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.73.01	పాత ధర 68.32
కొత్త ధర రూ.73.01	కొత్త ధర 68.32

మార్పులేదు



మూర్ఛకు బ్రెయిన్ పేస్‌మేకర్!

లాస్‌ఏంజెలిస్, జనవరి 1: మూర్ఛ, పార్కిన్‌సన్స్‌తో బాధపడే రోగుల కోసం బ్రెయిన్ పేస్‌మేకర్‌ను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. వైర్‌లెస్‌గా పనిచేసే ఈ పరికరం తనలోని విద్యుత్ శక్తితో మెదడును చైతన్యంగా ఉంచడంతోపాటు, చికిత్సకు మెరుగ్గా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ పేస్‌మేకర్‌కు 'వాండ్' అనే పేరు పెట్టారు. మెదడు పనితీరులో ఏ మాత్రం తేడా వచ్చినా వెంటనే అక్కడ సమస్యను సరిదిద్దేందుకు ఇది ఉపకరిస్తుందని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ పరిశోధనా వివరాలను నేచర్ బయోమెడికల్ ఇంజనీరింగ్ అనే జర్నల్‌లో ప్రచురించారు. ఇందులోని 128 చానల్స్ ద్వారా మెదడు పనితీరును గ్రహిస్తుందని తెలిపారు.

చంద్రయాన్-2 మళ్లీ వాయిదా

బెంగళూరు, జనవరి 1: చంద్రయాన్-2 ప్రయోగం మళ్లీ వాయిదా పడింది. ముందుగా ప్రకటించినట్లు దీనిని ఈ నెల 3వ తేదీన చేపట్టడం లేదని ఇస్రో ప్రకటించింది. 10 లేదా 12 రోజుల్లో దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటామని ఇస్రో చైర్మన్ డాక్టర్ కె.శివన్ విలేకరులకు తెలిపారు.

● ఫోన్ మాట్లాడుతూ జారిపడి..

నోయిడా, జనవరి 1: నోయిడాలోని ఓ అపార్ట్‌మెంటు ఐదో అంతస్థులో ఉండే వివేక్ ప్రేమ్ తన స్నేహితులు, బంధువులకు ఫోన్లు చేస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూనే ఉన్నాడు. బాల్కనీలో తిరుగుతూ తెల్లవారుజామున 3 గంటలకు అనుకోకుండా జారిపడి ప్రాణాలు కోల్పోయాడు.

● ఐఫోన్ కోసం కిడ్నీ అమ్మేసిన యువకుడు

బీజింగ్, జనవరి 1: ఐఫోన్ కోసం ఏకంగా కిడ్నీనే అమ్మేశాడు చైనాలోని 17 ఏళ్ల కుర్రాడు జియావో వాంగ్. అయితే, ఆపరేషన్ ఫెయిలై ఇటీవల మరణించాడు. 2011లో యాపిల్ కంపెనీ విడుదల చేసిన ఐఫోన్ 4 కోసం వాంగ్ ఓ ముఠాకు తన కిడ్నీని 3200 డాలర్లకు అమ్మేశాడు. ఆ ముఠా ఆపరేషన్ సరిగ్గా చేయకపోవడంతో రెండో కిడ్నీకి ఇన్ఫెక్షన్ సోకి డిసెంబరులో చనిపోయాడు.

● యునెస్కోకు అమెరికా, ఇజ్రాయెల్ టాటా!

పారిస్, జనవరి 1: ఐక్యరాజ్యసమితిలోని విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ యునెస్కో నుంచి అమెరికా, ఇజ్రాయెల్ నిష్క్రమించాయి. పాలస్తీనా సాంస్కృతిక వారసత్వాన్ని ఇజ్రాయెల్ ఆక్రమించిందని, తూర్పు జెరూసలేం ప్రాంతం పాలస్తీనాకు చెందినదేనని యునెస్కో వ్యాఖ్యలు చేయడం ఈ దేశాలకు ఆగ్రహం తెప్పించింది. యునెస్కో నుంచి నిష్క్రమిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నోటీసులు పంపారు.

● సుప్రీంకోర్టులో నేటి నుంచి కొత్త బెంచిలు

న్యూఢిల్లీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టులో నూతన సంవత్సరం నుంచి కొత్త ధర్మాసనాలు ఏర్పడనున్నాయి. జస్టిస్ కురియన్ జోసెఫ్‌తోపాటు జస్టిస్ ఎంబీ లోకూర్ రిటైర్ కావడంతో ఈ మార్పులు చోటు చేసుకున్నాయి. జడ్జిల ఎంపికకు సిఫారసు చేసే కొలీజియంలో గత నెలలోనే జస్టిస్ ఎన్వీ రమణకు చోటు దక్కింది. ఇప్పుడు జస్టిస్ అరుణ్‌మిశ్రా కూడా కొలీజియంలో భాగమయ్యారు. జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలో ఇప్పటికే ధర్మాసనం నడుస్తుండగా, తాజాగా మరో తెలుగు జడ్జి జస్టిస్ లావు నాగేశ్వరరావు కూడా మరో బెంచికి నేతృత్వం వహించనున్నారు.

● 'మెడికల్, ఇంజనీరింగ్ పరీక్షల తేదీలు మార్చండి'

న్యూఢిల్లీ, జనవరి 1: ఈ నెల రెండో వారంలో దేశవ్యాప్తంగా జరిగే మెడికల్, ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షల తేదీలు మార్చాలంటూ కేంద్ర మానవవనరుల శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్‌కు వర్తక సంఘాలు లేఖ రాశాయి. దేశవ్యాప్తంగా 8, 9 తేదీల్లో తాము సమ్మె చేస్తున్నామని, ఆ సమయంలో పరీక్షలు నిర్వహిస్తే విద్యార్థులు ఇబ్బందులు పడతారని లేఖలో వారు పేర్కొన్నారు.

● జనవరి 1న.. 69,444 జననాలు

పుట్టినరోజు అందరికీపండగే! జనవరి 1న పుట్టడమంటే మరింత స్పెషల్!! అలాంటి ప్రత్యేకమైన రోజున ఈసారి మనదేశంలో 69,444 మంది శిశువులు జన్మిస్తారని యునిసెఫ్ వెల్లడించింది. మన తర్వాత చైనాలో ఈ ఏడాది జనవరి 1న 44,940 మంది శిశువులు జన్మిస్తారని పేర్కొంది. మొత్తంగా ప్రపంచవ్యాప్తంగా 3,95,072 మంది శిశువులు ఆంగ్ల సంవత్సరాదిన పుడ్తారని యునిసెఫ్ అంచనా. మనదేశంలో మంగళవారంనాడు నిజంగానే 69,444 మంది పుట్టారా.. గణాంకాలు వెల్లడయ్యాకే అసలు విషయం తెలుస్తుంది.

● మాంచెస్టర్‌లో టెర్రరిస్టు స్వైరవిహారం

▸▸ పోలీసు సహా ముగ్గురికి కత్తిపోట్లు

మాంచెస్టర్, జనవరి 1: కొత్త సంవత్సర వేడుకల నేపథ్యంలో.. రద్దీగా ఉండే మాంచెస్టర్ విక్టోరియా రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులపై ఓ టెర్రరిస్టు కత్తితో విరుచుకుపడ్డాడు. ఈ దాడిలో ఓ పోలీసు సహా.. యాభై ఏళ్ల వయసున్న ఓ మహిళ, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. నిందితుడిని మెట్రోస్టేషన్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు బ్రిటిష్ ట్రాన్స్‌పోర్టు, గ్రేటర్ మాంచెస్టర్ పోలీసులు తెలిపారు. అతణ్ని ఉగ్రవాద నిరోధక దళానికి అప్పగించామని వెల్లడించారు.



నాలుగు నెలల తర్వాత కార్యాలయానికి పారికర్

గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ నాలుగు నెలల తర్వాత మంగళవారం పనాజీలోని తన కార్యాలయానికి విచ్చేశారు. గత ఆగస్టు నుంచి ఆయన కార్యాలయానికి రావడం లేదు. ముంబయి, యూఎ‌స్‌లో చికిత్స పొందిన తర్వాత తొలిసారిగా మళ్లీ కార్యాలయానికి విచ్చేసిన ఆయనకు పెద్దసంఖ్యలో బీజేపీ శ్రేణులు స్వాగతం పలికాయి.

మహాకూటమి.. మహా భయం!

అదో విఫల ప్రయోగం.. తెలంగాణ ఎన్నికల్లో రుజువైంది

▸▸ కేంద్రంలోనూ అదే ఫలితం..!

▸▸ ప్రధానిగా మోదీ కావాలా? వద్దా?

▸▸ లోక్‌సభ ఎన్నికల్లో ఇదే రెఫరెండం

▸▸ కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ



న్యూఢిల్లీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీని ఎదుర్కొనేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి ఏర్పాటు చేయతలపెట్టిన మహాకూటమి 'ప్రయత్నించి, పరీక్షించి, తిరస్కరించినది' అని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. మహాకూటమి ఆలోచన దేశాన్ని భయపెట్టేదన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికలు 'ప్రధానిగా మళ్లీ మోదీ కావాలా? వద్దా?' అన్న ఒక్క విషయంపైనే రెఫరెండంగా ఉంటాయని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో మోదీ, 'ఎవరో ప్రతిపాదిస్తున్న అస్పష్టమైన ఆలోచన'ల మధ్య పోరు ఉంటుందని తెలిపారు. తెలంగాణలో లాగానే జాతీయ స్థాయిలోనూ మహాకూటమి విఫల ప్రయోగం అవుతుందని జైట్లీ చెప్పారు. దేశంలో కూటములపై ప్రయోగాలు జరిగాయని, విఫలమయ్యాయని, అదో తిరస్కరించిన ఆలోచన అని మంగళవారం ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. అధ్యక్ష ఎన్నికల తరహాలో లోక్‌సభ ఎన్నికల పోటీ కూడా మోదీ, రాహుల్ గాంధీ మధ్యే ఉంటే సంతోషమన్నారు.

ఆర్థిక పరిపుష్టి ఉంటే రుణమాఫీకి ఓకే..

ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా ఆర్థికంగా బలంగా ఉండి రైతులకు రుణమాఫీ చేస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదని జైట్లీ స్పష్టం చేశారు. పంజాబ్, కర్ణాటక రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో రుణమాఫీ 'ప్రకటన'గానే మిగిలిపోయిందన్నారు. ఇలాంటి సమయాల్లో రైతులు తీసుకున్న రుణాలను చెల్లించరని, దీంతో నిరర్థక ఆస్తులు పెరిగిపోతాయని తెలిపారు. ఫలితంగా వచ్చే పంటకు రుణం ఇచ్చే సామర్థ్యం బ్యాంకులకు ఉండదని వివరించారు. తెలంగాణ, యూపీ, మహారాష్ట్ర మాత్రమే రుణమాఫీ హామీని నెరవేర్చాయని చెప్పారు.

టీడీపీ కాంగ్రెస్‌తో.. తృణమూల్‌తో టీఆర్ఎస్

జాతీయ స్థాయిలో ఏర్పాటు చేయతలపెట్టిన కూటమిలోనే విభిన్న ఆలోచనలు ఉన్నాయని జైట్లీ ఎద్దేవా చేశారు. మహాకూటమి ఆలోచనే రెండు భిన్న సిద్ధాంతాలుగా విడిపోయిందని గుర్తుచేశారు. కాంగ్రెస్, డీఎంకే, కొన్ని కమ్యూనిస్టు పార్టీలు, టీడీపీ కలిసి కూటమి ఏర్పాటుకు ప్రయత్నిస్తుండగా తెలంగాణ సీఎం కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ మరో కూటమికి యత్నించడమే దీనికి నిదర్శనమన్నారు. కేసీఆర్ టీఎంసీ అధ్యక్షురాలు మమత, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్‌లతో చర్చలు జరుపుతున్నారన్నారు.

రాజకీయ-పోలీస్ లింక్ నిజం కాదు

▸▸ కుమ్మక్కైనట్లు ఆధారాల్లేవ్.. సొహ్రాబ్ కేసులో జడ్జి వ్యాఖ్యలు

ముంబై, జనవరి 1: గ్యాంగ్‌స్టర్ సొహ్రాబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసులో పోలీసులు రాజకీయ నేతలు కుమ్మక్కైనట్లు చెప్పే సాక్ష్యాధారాలేవీ లేవని ఈ కేసుపై తీర్పు వెలువరించిన సీబీఐ ప్రత్యేక కోర్టు తేల్చింది. వారి లాలూచీని నిరూపించే ఆధారాలను సేకరించడంలో సీబీఐ విఫలమైనట్లు తీర్పు వెలువరించిన జడ్జి ఎస్‌జే శర్మ పేర్కొన్నారు. మొత్తం 22 మంది నిందితులనూ నిర్దోషులుగా విడుదల చేస్తూ కోర్టు డిసెంబరు 21న తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ 22 మందిలో 21 మంది పోలీసులే. వారు రాజకీయ నేతలను కాపాడే ప్రయత్నం చేసినట్లు ఆధారాల్లేవు అని జడ్జి వివరించారు.

షాని ఇరికించేందుకు సోనియా కుట్ర: స్మృతి

న్యూఢిల్లీ, జనవరి 1: గ్యాంగ్‌స్టర్ సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసులో బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాని ఇరికించేందుకు కాంగ్రెస్ నేత సోనియా కుట్ర పన్నారని, దీనికి ఆధారాలు కూడా ఉన్నాయని కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ అన్నారు. మంగళవారంనాడిక్కడ ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. "తమ అధికారానికి అడ్డుపడే వారిని కాంగ్రెస్ ఎంతమాత్రం ఉపేక్షించదని మేము ప్రజలకు చెప్పదలుచుకున్నాము" అని ఇరానీ పేర్కొన్నారు.

మాయా హెచ్చరికా.. మజాకా..!

▸▸ దిగొచ్చిన రాజస్థాన్, ఎంపీ ప్రభుత్వాలు

లఖ్‌నవూ, జనవరి 1: గత ఏడాది ఏప్రిల్ 2న భారత్‌బంద్ సందర్భంగా అమాయకులు, నిర్దోషులపై పెట్టిన అన్ని కేసులను ఉపసంహరించాలని, లేదంటే ప్రభుత్వాలకు మద్దతు ఉపసంహరిస్తామని మాయావతి సోమవారం మధ్యప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలను హెచ్చరించారు. దీనికి స్పందించిన మధ్యప్రదేశ్‌లోని కమల్‌నాథ్ సర్కారు.. గతంలో బీజేపీ ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతో అమాయకులపై పెట్టిన కేసులను, 15 ఏళ్ల బీజేపీ పాలనలో రాజకీయ కోణంలో పెట్టిన కేసులన్నీ ఎత్తివేస్తామని ఎంపీ న్యాయశాఖ మంత్రి పీసీ శర్మ తెలిపారు. ఇక రాజస్థాన్‌లో మాత్రం భారత్ బంద్ సందర్భంగా నమోదైన కేసులు పరిశీలించిన తర్వాతే ఉపసంహరిస్తామని సీఎం అశోక్ గెహ్లాట్ తెలిపారు.

యూపీలో 100 అడుగుల దళిత నేత విగ్రహం!



లఖ్‌నవూ, జనవరి 1: ఉత్తరప్రదేశ్‌లో దళితుల ఓట్లను బీఎస్పీ నుంచి తమ వైపునకు తిప్పుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. 1857లో లఖ్‌నవూలో ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా పోరాడిన యోధురాలు, పాశీ సామాజిక వర్గానికి చెందిన ఉడాదేవి 100 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం భావిస్తోంది.

రాజకీయాల్లోకి ప్రకాశ్‌రాజ్!

బెంగళూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగనున్నట్లు ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మంగళవారం ప్రకటించారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని భావిస్తున్నానని, ఏ నియోజకవర్గం అనేది నిర్ణయించుకోలేదన్నారు.

బీజేపీ 'దళిత' కిచిడీ..

న్యూఢిల్లీ, జనవరి 1: దళిత ఓటర్లకు గాలం వేసేందుకు బీజేపీ సరికొత్త ప్రయోగాలు చేస్తోంది. వీటిలో భాగంగా ఆదివారం ఇక్కడి రామ్‌లీలా మైదానంలో నిర్వహించే భీమ్ మహాసంగమ్ ర్యాలీలో మూడు వేల కేజీల కిచిడీ వండనుంది. ఈ కిచిడీ తయారీలో వాడే వస్తువులన్నింటినీ దళితుల వద్ద నుంచే సేకరించనున్నారు. ఈ 'సమరసతా కిచిడీ' గిన్నిస్ రికార్డు సృష్టిస్తుందని బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మోహన్‌లాల్ గిహారా పేర్కొన్నారు.

వచ్చే ఎన్నికల ప్రచారాస్త్రం 'అగస్టా': జైరాం ఠాకూర్

సిమ్లా, జనవరి 1: లోక్‌సభ ఎన్నికల్లో అగస్టా కుంభకోణం ప్రచార అస్త్రంగా మారుతుందని హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి జైరాం ఠాకూర్ అభిప్రాయపడ్డారు. రూ.3,700 కోట్ల అగస్టా డీల్‌పై ప్రజల్లో చర్చ నడుస్తోందన్నారు. దీనిపై ప్రజలకు కాంగ్రెస్ పార్టీ సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వృద్ధాప్యంలో అండకోసమే

▸▸ తిరుమలలో వీరేశ్ కిడ్నాప్ చేసిన తెలంగాణ వాసి

▸▸ పట్టిచ్చిన సోషల్ మీడియా.. తల్లిదండ్రుల చెంతకు చిన్నారి

తిరుపతి (నేరవిభాగం), జనవరి 1: పిల్లలు లేని తనకు వృద్ధాప్యంలో తోడెవరుంటారనే బెంగతో అతడు తిరుమలలో ఓ చిన్నారిని అపహరించాడు. చివరికి పోలీసులకు చిక్కాడు. నిందితుడిని తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా గుండాలకు చెందిన విశ్వంభర్ (43)గా పోలీసులు గుర్తించారు. తిరుపతి అర్బన్ ఎస్పీ అన్బురాజన్ మంగళవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన ప్రశాంత్‌జీ, స్నేహ దంపతులు బిడ్డతో సహా మాధవనిలయం ఎదురుగా ఉన్న మండపంలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి చిన్నారి వీరేశ్‌ను విశ్వంభర్ అపహరించాడు. ఆ విషయం ఫొటోతో సహా.. వాట్సాప్, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. మహారాష్ట్రకు చెందిన ఓ పోలీస్ కానిస్టేబుల్ అక్కడి మహోర్ పట్టణంలో వీరేశ్‌ను గుర్తించారు. సమాచారం అందుకున్న తిరుపతి పట్టణ పోలీసులు మహోర్ చేరుకున్నారు. నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి, తిరుపతికి తీసుకువచ్చారు. వృద్ధాప్యంలో ఓ తోడు కోసమే ఆ బాలుడిని అపహరించినట్లు విశ్వంభర్ వాంగ్మూలమిచ్చాడని ఎస్పీ వివరించారు. సోషల్ మీడియా వల్లే బాలుడి ఆచూకీని 2 రోజుల్లో కనుక్కోగలిగామని తెలిపారు.



వీరేశ్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న తిరుపతి ఎస్పీ అన్బురాజన్

ఆలయాలు కిటకిట

దైవదర్శనానికి బారులు తీరిన భక్తులు





భక్తులతో కిక్కిరిసిన ఆలయ తిరువీధులు; లక్ష పుష్పార్చనలతో కొలువుదీరిన లక్ష్మీనృసింహుడు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్: నూతన సంవత్సర ప్రారంభం సందర్భంగా మంగళవారం రాష్ట్రంలోని ప్రసిద్ధ ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. అర్చకుల మంత్రోచ్చరణలు, భక్తుల సంకీర్తనలతో మార్మోగిపోయాయి. యాదాద్రి, కీసరగుట్ట, అనంతగిరి, చిలుకూరు బాలాజీ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. యాదాద్రిలో లక్షపుష్పార్చన పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువజామునే స్వయంభువులను పూజించిన ఆచార్యులు బాలాలయంలో అలంకారమూర్తులకు హారతి నివేదించారు. కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి గర్భాలయంలో స్వామివారికి శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులు శ్రీ లక్ష్మీనరసింహస్వామి, శివపంచాయతనం, శ్రీ సీతారామచంద్ర స్వామి, శ్రీ మారుతి కాశీ విశ్వేశ్వర స్వామివార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే, చీర్యాల లక్ష్మీనరసింహ స్వామి, వికారాబాద్ జిల్లా అనంతగిరి అనంతపద్మనాభ స్వామి ఆలయాల్లోనూ భక్తులు సామూహిక వ్రతాలు ఆచరించారు. చిలుకూరు బాలాజీ దేవాలయంలో గోవిందన నామ స్మరణలు, అన్నమయ కీర్తనలు. రామనామ సంకీర్తనలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. స్వామివారికి ప్రత్యేక పూజ లు చేశారు. నక్షత్ర హారతి, కుంభహారతి, కర్పూర నీరాజనం హారతులతో పూజలు నిర్వహించారు.

వేడుక మిగిల్చిన విషాదం!

▸▸ ప్రమాదంలో ఇద్దరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

▸▸ వనపర్తిలో యువకుడి హత్య

బాన్సువాడ/వనపర్తి క్రైం, జనవరి 1 : నూతన సంవత్సర వేడుకలు ముగించుకొని వెళ్తున్న ఆ యువకులను మృత్యువు వెంటాడింది. ప్రమాదం రూపంలో ఇద్దరిని బలిగొంది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం కోనాపూర్ గ్రామ శివారులో మంగళవారం తెల్లవారు జామున జరిగింది. గ్రామానికి చెందిన జెట్టి అజయ్ స్నేహితులతో తన గెస్ట్ హౌస్‌లో సోమవారం రాత్రి న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నారు. తెల్లవారుజామున 3 గంటలకు అజయ్ తన స్నేహితులైన శ్రీకాంత్ (20), దిగంబర్ (18), హేమకాంత్‌లతో ద్విచక్ర వాహనాలపై బయలుదేరారు. గ్రామ శివారులోని మూల మలుపు వద్ద ద్విచక్ర వాహనం కల్వర్టును ఢీకొని శ్రీకాంత్, దిగంబర్‌లు అక్కడికక్కడే మృతి చెందారు. ఇదిలావుండగా, నూతన సంవత్సర వేడుకల్లో వనపర్తిలో ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. మద్యం తాగి యువకులు శుభాకాంక్షలు తెలుపుకునే సందర్భంలో మాటమాటా పెరిగి ఘర్షణకు దిగారు. ఇందులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన పుష్పేందర్ యాదవ్ (28) వారి చేతిలో ప్రాణాలు కోల్పోయాడు.



తాత్కాలిక వసతి సదుపాయాలను పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఎయిమ్స్ వైద్య కళాశాలకు సన్నాహాలు

▸▸ తాత్కాలిక వసతికి ప్రైవేట్ భవనం ప్రతిపాదన

యాదాద్రి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎయిమ్స్ వైద్య కళాశాల రాబోయే విద్యాసంవత్సరం (2019-20)లో ప్రారంభం కానుంది. రాబోయే విద్యా సంవత్సరానికి ఎయిమ్స్ ప్రవేశ పరీక్షల్లో ర్యాంకుల ఆధారంగా ఈ కళాశాలలో ప్రవేశాలు కల్పించనున్నారు. అయితే ఎయిమ్స్ ప్రతిపాదిత క్యాంపస్‌లో భవన నిర్మాణాలు పూర్తయ్యే వరకు తాత్కాలిక భవనంలో కళాశాల నిర్వహించనున్నారు. ఇందుకు బీబీనగర్-భువనగిరి పరిసరాల్లో తాత్కాలిక భవనాలను ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కలెక్టర్ అనితా రామచంద్రన్ పరిశీలించారు.

పాస్‌పోర్టుల జారీలో ముందంజ

▸▸ రీజినల్ పాస్‌పోర్టు అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి

యాదాద్రి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పాస్‌పోర్టుల జారీలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందని ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో పాస్‌పోర్టు సేవా కేంద్రాన్ని ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రీజనల్ పాస్‌పోర్టు అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడారు. భువనగిరిలో ప్రారంభిస్తున్న పాస్‌పోర్టు సేవాకేంద్రం రాష్ట్రంలో ఎనిమిదో కేంద్రమన్నారు. పాస్‌పోర్టు పొందడం పౌరుల హక్కు అని, దానిని సులభతరంగా పొందడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. దేశంలో సగటున పాస్‌పోర్టు జారీకి 30 రోజుల గడువు పడుతుందని, కానీ తెలంగాణ రాష్ట్రంలో సగటు వ్యవధి కేవలం 10 రోజులే అన్నారు. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 60వేల మంది పౌరులకు పాస్‌పోర్టులు జారీ చేశామన్నారు. పాస్‌పోర్టుల జారీని మరింత వేగవంతం చేయడానికే అందుబాటులో కార్యాలయాలు ప్రారంభిస్తున్నామని తెలిపారు.

ప్రగతి కోసం ప్రార్థించా

▸▸ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

తిరుమల, జనవరి 1: ఎన్నికల సమయంలో టీఆర్ఎస్ నేతలు, ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలని శ్రీవారిని ప్రార్థించినట్టు తెలంగాణ కాంగ్రెస్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. నూతన ఏడాది సందర్భంగా మంగళవారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మార్చిలో రెండు సినిమాలు

▸▸ నిర్మాత దిల్‌రాజు

తిరుమల : ఈ ఏడాది మార్చినెలలో మరో రెండు సినిమాలు ప్రారంభం కానున్నాయని సినీ నిర్మాత దిల్‌రాజు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆయన మంగళవారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ఎదుట మీడియాతో మాట్లాడుతూ జనవరిలో ఎఫ్-2, ఏప్రిల్‌లో మహేశ్‌బాబు హీరోగా నటించిన మహర్షి విడుదల కానున్నట్టు తెలిపారు. దర్శనానికి ముందు దిల్‌రాజు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

పట్టువీడని ప్రేమ

▸▸ ప్రియుడి కోసం 41 రోజుల దీక్ష

▸▸ ఎట్టకేలకు ఒక్కటైన జంట

ఎల్కతుర్తి, జనవరి 1: ఏళ్ల తరబడి ప్రేమించుకుని తీరా పెళ్లి ప్రస్తావన వచ్చేసరికి ప్రియుడు ముఖం చాటేయడంతో ప్రియురాలు అతని ఇంటి ఎదుట 41 రోజులు దీక్ష చేసి అనుకున్నది సాధించుకుంది. వరంగల్ అర్బన్ జిల్లా ఎల్కతుర్తికి చెందిన శ్రీపతి శ్వేత అదే మండలం సూరారానికి చెందిన సట్ల సుధీర్‌గౌడ్ కొన్ని సంవత్సరాలు ప్రేమించుకున్నారు. ఇరు కుటుంబాలు పెళ్లి కుదుర్చుకునే సమయంలో సుధీర్ ప్లేటుఫిరాయించాడు. దీంతో శ్వేత ప్రియుడి ఇంటివద్ద బైఠాయించింది. ఒక దశలో ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో మనసు మార్చుకున్న సుధీర్ పెళ్లికి అంగీకరించడంతో మంగళవారం కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మత్స్యగిరీంద్ర స్వామి గుడిలో ఆమెను వివాహం చేసుకున్నారు.



వివాహం చేసుకుంటున్న ప్రేమికులు

వెండితెరపై సామాజిక వ్యాఖ్యాత

ప్రపంచ సినిమా యవనికపై భారతీయులందరినీ తలెత్తుకొనేలా చేసిన బెంగాలీ దిగ్దర్శక మూర్తి త్రయంలో మూడోరూపం కనుమరుగై పోయింది. సత్యజిత్ రే, రిత్విక్ ఘటక్ తరువాత భారతీయ సినిమా ఖ్యాతిని అంతర్జాతీయంగా విస్తరింపజేసిన బెంగాలీ సినీస్వర్ణయుగపు చివరి దర్శకుడు మృణాల్‌సేన్ ఆదివారం కన్నుమూశారు. జీవితంలోనూ, సినిమాలోనూ, జీవనంకోసం వ్యవస్థతోనూ చివరి వరకూ రాజీపడని అతి కొద్దిమంది దర్శకులలో ఒకరు మృణాల్‌సేన్. భద్రలోక జీవిత ప్రతిబింబమైన సినిమాలకు భిన్నంగా సామాజిక అంతరాల్ని చూపెడుతూ, చిత్రమైన కెమెరా కదలికలు, ఎడిటింగ్ విధానాలతో బెంగాలీ సినిమాకు కొత్త రూపురేఖలు దిద్దిన ఘనత ఆయనది. మధ్యతరగతి జీవితం నుంచి మార్క్సిస్టు సిద్ధాంతాల అంతర్లీన చిత్రీకరణ దాకా సామాన్యుడి ఆవేదనకూ, సామాజిక వాస్తవాలపై ఆలోచనాత్మక ఆక్రోశానికీ ఆయన సినిమాలు ప్రతిరూపాలు. ఎనిమిది పదుల వయసులోనూ 'ఆమార్ భుబొన్' (2002) లాంటి అందమైన సినిమా అందించిన క్రియాయోగి. గ్యాబ్రియల్ గార్షియా మార్క్వెజ్, గ్రెగరీ పెక్ లాంటి ప్రముఖుల సరసన అంతర్జాతీయ సినిమా జ్యూరీల్లో పనిచేసే అరుదైన అవకాశం అందుకున్న వ్యక్తి.

అజ్ఞాత స్వాతంత్ర్య విప్లవ వీరులకు ఆశ్రయం కల్పించడానికే సంపాదనంతా వెచ్చించిన వకీలు గారి పన్నెండుమంది సంతానంలో మృణాల్ ఒకరు. పెరిగిన వాతావరణం, కలిగిన కమ్యూనిస్టు పార్టీ సాంగత్యం, తిరిగిన ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) అనుభవం, జరిగిన 1946 ఆగస్టు నాటి బెంగాల్ అల్లర్లు... ఇలా ఆయనను దర్శకుడిగా మలిచిన ఉలులెన్నో! ఇరవయ్యేళ్ళ వయసులో చూసిన బెంగాల్ కరవు, యాభై లక్షల మంది ఆకలి కేకలు, కళ్ళెదుటే ఆకలి చావులు యువ మృణాల్‌ను జీవితాంతం వెంటాడాయి. ఆ ప్రభావం ఆయన మూడో చిత్రం 'బైషే శ్రావణ్' (1960)లో అధికంగా కనిపిస్తుంది. మూడు దశల సినీ ప్రయాణం ఆయనది. తొలి చిత్రాలన్నీ కథాకథనం విషయంలో సంప్రదాయ ధోరణిలో సాగిపోతాయి. సున్నితమైన సామాజిక వ్యంగ్యానికి ప్రతీకగా నిలిచే 'భువన్ శోమ్' (1969) హిందీలో ఆయన తొలి చిత్రం, తొలి దశలో ఆఖరి చిత్రం. భారతీయ నవ్య సినిమా ఉద్యమానికి ఆగమ గీతికా అదే! 'ఇంటర్వ్యూ' (1971) నుంచి 'కలకత్తా 71', 'పదాతిక్', 'కోరస్' లాంటి ఉద్యమచిత్రాలు మృణాల్ వామపక్ష భావజాలానికి అద్దంపట్టాయి. కటువైన నిజాలను చూపెట్టాయి. రాడికల్ దృక్పథం, రాజకీయ స్వభావం నిండిన ఆ శక్తిమంతమైన చిత్రాలు మృణాల్ రెండో దశ. 'ఏక్ దిన్ ప్రతిదిన్' (1979), 'ఖారిజ్' (1982) లాంటివన్నీ పట్టణ మధ్యతరగతి జీవుల అనుభవాలకు ప్రతిరూపంగా, ఆత్మపరిశీలన ధోరణిలో తీసిన మూడో దశ సినిమాలు. ఆయన సినిమాలు ఈ మూడు దశల్లోనూ మేధావులను ఆకర్షించాయి. జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్నాయి. ఎలాంటి కథతో ఏ సినిమా తీసినా, తత్కాలపు ఆలోచనకూ, ఆవేశానికీ తగ్గట్టు శిల్పాన్నీ, శైలినీ మలుచుకుంటూ పోవడం మృణాల్ అంతర్లక్షణం. ఆయన సినిమాలకు బౌండు స్క్రిప్టులు ఉండేవి కావంటారు. అప్పటికప్పుడు సెట్స్‌పై సన్నివేశాలు, సంభాషణలు అల్లుకుంటూ ఆయన చేసిన సృజన విహారం పేపరు, పెన్నుల పరిధిని మించినది.

ఆ స్వేచ్ఛాప్రియత్వం, ప్రవాహశీలత మృణాల్‌ను బెంగాలీ నుంచి హిందీ, ఒరియా, తెలుగు భాషలకూ తీసుకెళ్ళాయి. సినిమాల నుంచి సీరియల్స్‌కూ డాక్యుమెంటరీలకూ ప్రతిభా పరిమళం విస్తరించింది. తెలుగులో వాస్తవిక చిత్రోద్యమానికి శ్రీకారం చుట్టిన సినిమా కూడా మృణాల్‌దే (ఒక ఊరి కథ–1977). మున్షీ ప్రేమ్‌చంద్ కథ 'కఫన్' ఆధారంగా తీసిన ఈ సినిమా రూపకల్పన తన జీవితకాలంలోని అత్యంత ఉద్విగ్న అనుభవాల్లో ఒకటని మృణాల్ చెప్పుకున్నారు. కథలోని కీలకఘట్టం సినిమాలో లేనందుకు కొన్ని విమర్శలకూ గురైంది. ఆ తరువాత 'అనుగ్రహం', 'మా భూమి' లాంటి మరికొన్ని వాస్తవిక చిత్రాలు తెలుగులో రావడానికి ప్రేరణ అయింది. కాళ్ళు చాపుకొని కుర్చీలో తాపీగా కూర్చున్న ప్రేక్షకులను తెర మీది వాస్తవికతతో అస్థిమితంగా మార్చడం, ఆలోచనలోకీ, ఆత్మపరిశీలనలోకీ నెట్టడం మృణాల్ సినిమాల తత్త్వం. వయసు సహకరించకున్నా, మానసికోత్సాహంతో ఎప్పుడూ ఓ కొత్త కథనో, ఆలోచననో తెరకెక్కించడానికి ఉరకలు వేయడం చివరి దాకా సాగిన ఆయన జీవలక్షణం. సాహిత్యాన్ని సినిమాగా అనుసృజించడానికి మొగ్గుచూపిన ఈయన తీసిన సినిమాల కన్నా, రాసుకొని అర్ధంతరంగా ఆపేసిన స్క్రిప్టులే ఎక్కువ. ఓ ప్రసిద్ధ నక్సలైట్ నాయకుడి జీవితానికి తెర రూపమివ్వాలన్న కోరిక కూడా అలా తీరకుండా మిగిలిపోయినదే!

పద్మభూషణ్ బిరుదం, ఫాల్కే పురస్కారం, ఫ్రాన్స్, రష్యా ప్రభుత్వాల గౌరవం, రాజ్యసభ సభ్యత్వం లాంటివి ఎన్నో వచ్చినా, సినీప్రియుల ప్రేమాస్పద గౌరవమే మృణాల్ సేన్‌కు ఇప్పటికీ అతి పెద్ద గుర్తింపు. అమితాబ్ బచ్చన్ ('భువన్ శోమ్'లో నేపథ్య గాత్రధారిగా), మిథున్ చక్రవర్తి ('మృగయా'లో నటుడిగా) లాంటి అభినయ విశారదుల్ని పరిచయం చేయడం ఆయనకున్న మరో పాస్‌పోర్ట్. సత్యజిత్ రే మరణం తరువాత భారతీయ సినీ విరాణ్మూర్తిగా నిన్నటి దాకా మిగిలింది మృణాల్ సేనే. కానీ, ఇటీవలి ప్రభుత్వాలు, మీడియా ఆయనను అంతగా పట్టించుకున్నట్టు కనిపించదు. ఇప్పుడిక ఆయన కృషి మాత్రం మిగిలింది. కానీ, 'ఒక ఊరి కథ' సహా ఆయన తొలి చిత్రాలు అనేకం ఇప్పటికీ అందుబాటులో లేకపోవడం సినీప్రియులకు మృణాల్ మరణాన్ని మించిన విషాదం!

ఇదెక్కడి న్యాయం?

షెడ్యూలు ప్రాంతాలు, 100 శాతం గిరిజన గ్రామాలంటూ అడ్డగోలు నిబంధనలతో కొత్తగా రూపొందించిన తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం వలన బడుగులకు జరిగిన న్యాయమేమిటి? పాలకులు వివరణ ఇవ్వాలి. తెలంగాణ జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బలహీన వర్గాలకు తెలంగాణ రాష్ట్ర స్థానిక సంస్థలలో రిజర్వేషన్ కింద దక్కబోతున్న స్థానాలు కేవలం 18 శాతం మాత్రమే! అదే సమయంలో ఆశ్చర్యకరంగా తెలంగాణ జనాభాలో కేవలం 9 శాతం మాత్రమే ఉన్న గిరిజన బిడ్డలు దాదాపు 25 శాతం పంచాయితీ స్థానాలను స్వాయత్తం చేసుకోబోతున్నారు.

పోనీ ఈ వ్యవహారంలో దళితులకు ఏమైనా న్యాయం జరిగిందా అంటే అదీ లేదు. జనాభాలో సుమారు 18 శాతంగా ఉన్న దళితులకు స్థానిక ఎన్నికలలో రిజర్వేషన్ కింద దక్కబోతున్న స్థానాలు కేవలం 16.5 శాతం మాత్రమే. తెలంగాణా రాష్ట్రంలోని మొత్తం 12,751 గ్రామ పంచాయితీలలోని 3146 స్థానాలలో రిజర్వేషన్‌లు పొందిన గిరిజనపుత్రులు ఆనందోత్సాహాలలో ఉంటే కేవలం 2345 స్థానాలతోనే సర్దుకు పోవాలా అంటూ బలహీన వర్గాల వారు ఉసూరుమంటున్నారు.

ఆశ్చర్యకరంగా తెలంగాణ జనాభాలో 3 నుంచి 4 శాతం ఉన్న లంబాడా సోదరులు 1177 కనీస స్థానాలతో కలిపి 10 నుంచి 14 శాతం సర్పంచ్ స్థానాలను పొందబోతున్నారు. తెలంగాణ స్థానికసంస్థల ఎన్నికలలో రిజర్వేషన్ లను ఏ సామాజిక న్యాయ సూత్రం ఆధారంగా నిర్ణయించారో ఏలినవారే తెలియజేయాలి. 100శాతం గిరిజన ప్రాంతాలంటూ కొత్తగా పంచాయితీలను నిర్ణయించి షెడ్యూలు ప్రాంతాలను వీటిని ఒకే గాటకు కట్టి తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టంలో సెక్షన్9, 17లలో పొందుపరచిన నిబంధనలే ఈ మొత్తం గందరగోళానికి అసలు కారణం. తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేయడం మంచిదే అయినప్పటికీ వాటికి ప్రత్యేక హోదా కల్పించడం ఎంతవరకు సబబన్నది ఇక్కడ ప్రధాన ప్రశ్న.



> **లంబాడా తండాలను ప్రత్యేక ప్రాంతాలుగా గుర్తించి రిజర్వేషన్‌లు వర్తింపచేయడం వలన భవిష్యత్తులో తలెత్తబోయే సమస్యలనేకం. 3 నుండి 4 శాతం ఉన్న ప్రజలు 10 నుండి 14 శాతం పదవులు పొందటం ఇతర వర్గాలలో అసంతృప్తికి ఆజ్యం పోస్తుంది. రాష్ట్రాన్ని యూనిట్‌గా నిర్ణయించాల్సిన రిజర్వేషన్‌లలో పార్లమెంటు ప్రమేయం లేని నిబంధనలు ఎంతవరకు రాజ్యాంగబద్ధమో భవిష్యత్తులో కోర్టులే నిర్ణయించాలి.**

వందలు, వేల సంవత్సరాల నుంచి ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలతో విలసిల్లిన గిరిజన ప్రాంతాలను ప్రత్యేక ఏజెన్సీలుగా గుర్తించి ఆయా జాతులను రక్షించే క్రమంలో రిజర్వేషన్స్ ప్రకటించడం, కేవలం 50 నుండి 150 సంవత్సరాల క్రితం మాత్రమే ఏర్పడిన తండాలను ప్రత్యేక ప్రాంతాలుగా గుర్తించి షెడ్యూలు ప్రాంతాలతో ముడిపెట్టడం ఎంతమాత్రం సబబు కాదు. వంద నుంచి రెండు వందల సంవత్సరాలు వెనక్కి వెళితే నేటి తండాలలో చాలామటుకు ఉనికిలోనే లేవన్నది వాస్తవం. సాటి భారతీయులుగా వారిని గౌరవించి ఆదరించడంలో తప్పులేక పోయినప్పటికీ ఇతర గిరిజన బిడ్డల్లాగా లంబాడాలు దోపిడీకి, అణచివేతకు గురైన వర్గం మాత్రం ఎంతమాత్రం కాదు.

లంబాడా తండాలను ప్రత్యేక ప్రాంతాలుగా గుర్తించి రిజర్వేషన్‌లు వర్తింపచేయడం వలన భవిష్యత్తులో తలెత్తబోయే సమస్యలనేకం. 25 శాతం ఓట్లతో రేపటిరోజు శాసనమండలి, స్థానిక సంస్థల కోటా ఎన్నికల్లో గిరిపుత్రులు తమ వర్గ సమీకరణకు విరుద్ధంగా ఆదిపత్యం చెలాయించబోతున్నారు. 3 నుండి 4 శాతం ఉన్న ప్రజలు 10 నుండి 14 శాతం పదవులు పొందటం ఇతర వర్గాలలో అసంతృప్తికి ఆజ్యంపోస్తుంది. 100 శాతం నిబంధన కారణంగా రేపటిరోజు లంబాడా తండాల్లో ఇతర సామాజిక వర్గాల ప్రజలకు నివాస యోగ్యత, ఓటుహక్కు ఇచ్చే అవకాశాలు సన్నగిల్లుతాయి. భారత పౌరుల ప్రాథమిక హక్కు 'ఎక్కడైనా జీవించవచ్చు, ఓటు వినియోగించుకోవచ్చు' అనేది రేపటి రోజు తిరస్కరణకు గురయ్యే ప్రమాదమున్నది. చివరికి తండాల్లోని ఉద్యోగులు, ఇతర సబ్బండ వర్గాలకు, ఆయా శివారులలో వ్యవసాయ భూములున్న రైతులకు కూడా ఇది ప్రతిబంధకం కావచ్చు. కశ్మీర్ మొదలు ఈశాన్య రాష్ట్రాలలోని పరిస్థితులను చూసైనా మనం మేల్కొనాల్సిన అవసరమున్నది. రాష్ట్రాన్ని యూనిట్‌గా నిర్ణయించాల్సిన రిజర్వేషన్‌లలో పార్లమెంటు ప్రమేయం లేని ఇటువంటి నిబంధనలు ఎంతవరకు రాజ్యాంగబద్ధమో భవిష్యత్తులో కోర్టులే నిర్ణయించాలి. ఏది ఏమైనా తాత్కాలికమైన ప్రయోజనాల కోసం కాకుండా దీర్ఘకాలిక ఆలోచనలతో ముందుకు నడిస్తేనే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. వ్యక్తులకన్నా వ్యవస్థే ముఖ్యమనుకోవడం తోనే సమ సమాజం సాధ్యపడుతుంది.

■ చందుపట్ల రమణ కుమార్ రెడ్డి,
న్యాయవాది

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు 70, జుబిలీ హిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

ఎన్నికల్లో నల్లధనం మాటేమిటి?

ఇండియాగేట్



■ ఎ. కృష్ణారావు

పార్లమెంట్ సెంట్రల్‌హాలులో చాలా మంది ఎంపీలు ఇటీవల చాలా దిగులుగా కనపడుతున్నారు. మళ్లీ ఎన్నికలు వస్తాయని, మళ్లీ కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తుందని బాధ వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ పదవికి పోటీ చేయడం కన్నా ఎమ్మెల్యే సీటుకు పోటీచేస్తే ప్రయోజనం ఎక్కువుంటుందని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. ఈ మధ్య జరిగిన అసెంబ్లీల ఎన్నికల్లో అధికారంలో ఉన్న పార్టీలు తిరిగి అధికారంలోకి రావడానికి భారీ ఎత్తున ఖర్చుపెట్టాయి. అధికారంలో లేని పార్టీలే భారీ ఎత్తున డబ్బులు ఖర్చులు పెడుతున్నప్పుడు అధికారంలో ఉన్న పార్టీ భారీ ఎత్తున ఖర్చుపెట్టడంలో ఆశ్చర్యం ఏముంది? అని ఎంపిలు చర్చించుకుంటున్నారు. ఎన్నికలంటూ జరిగిన తర్వాత అధికారంలో ఉన్నా, లేకపోయినా పార్టీలు, అభ్యర్థులు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు పెట్టాల్సి వస్తుంది. పొరుగు రాష్ట్రాల నుంచి, కార్పొరేట్ల నుంచి కూడా నిధులు ప్రవహిస్తాయి. ఫలానా రాష్ట్రంలో ఫలానా ప్రభుత్వం ఉండడం వల్ల ఫలానా వారికి ప్రయోజనం ఉంటుందనే చర్చ ప్రతి ఎన్నికల్లోనూ జరుగుతుంది. కర్ణాటక ఎన్నికల సమయంలో కూడా బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పెద్ద ఎత్తున రంగంలోకి దిగారు. వారు ఏమీ ఉత్తి చేతులతో రారు కదా. అదే సమయంలో కాంగ్రెస్‌కు సహాయం చేయకుండా అనేక కార్పొరేట్ సంస్థలపై, వ్యక్తులపై ఆదాయపన్ను దాడులు జరిగాయి. ఏది ఏమైనా ఎమ్మెల్యేగా పోటీ చేయడం వల్ల అటు వ్యక్తిగతంగానూ, ఇటు రాజకీయంగానూ లాభం ఉంటుందని ఎంపీలు అనుకోవడంలో ఆశ్చర్యం లేదు. తమ పార్టీ గెలిస్తే మంత్రిపదవులు, పైరవీలు. తమ పార్టీ ఓడిపోయి తాము ఎమ్మెల్యేలుగా మిగిలితే అధికార పార్టీతో కుమ్మక్కయ్యే అవకాశాలు. లేదా తాము ఎమ్మెల్యేగా ఓడిపోయినా ఎన్నికలకోసం వచ్చిన డబ్బుల్లో ఎంతో కొంత మిగుల్చుకునే అవకాశాలు ఎలాగూ ఉంటాయి.

'మమ్మల్ని ఎవరు పట్టించుకుంటారు.. ఎమ్మెల్యేకున్న విలువ మాకేమున్నది.?' అని బాధపడే ఎంపీలు చాలా మంది ఉన్నారు. 'ఈ సారి నేను ఎమ్మెల్యే సీటుకు పోటీ చేయాలనుకుంటున్నాను' అని ఒకరంటే 'మనకు టికెట్ ఇస్తారంటారా' అని మరొకరు ప్రశ్నిస్తున్నారు. క్లుప్తంగా చెప్పాలంటే ఎంపిలు చాలా మంది ఎమ్మెల్యేల పట్ల ఈర్ష్య పడుతున్నారు. అనేక కార్పొరేట్ సంస్థలకు యజమాని అయి, ఎంపీగా ఉన్న ఒక నేత కూడా 'అసలు ఎమ్మెల్యేల వద్ద ఇంత డబ్బెలా వస్తున్నది!' అని ఆశ్చర్యపోతున్నారు. ఒకప్పుడు తన సహాయంతో గెలిచిన ఒక ఎమ్మెల్యే ఇప్పుడు రోడ్డుకు అటూఇటూ వైపు ఉన్న భూములన్నీ తనవేనని చెప్పుకుంటున్నారని ఆయన వెల్లడించారు. ఎంపీలు డబ్బులు సంపాదించడం లేదని కాదు, ఎమ్మెల్యేల అంత సంపాదించలేకపోతున్నామనే వారి బాధ.

అసలు ఇంత డబ్బు సంపాదించడం అవసరమా అన్నది కీలకమైన ప్రశ్న. 'రాజకీయాల్లో ప్రవేశించిన ప్రతి వాడూ అత్యంత ధనికుడుగా మరణించడం అవసరమా?' అని ఒక మాజీ ఎంపి ప్రశ్నించారు. ఇవాళ రాజకీయాల్లో ఉన్న వారు అత్యంత ధనికులుగా మరణించాలనుకుంటున్నారు కాని, ఉన్నత వ్యక్తిత్వంతోనో, గొప్ప ప్రజాసేవకుడుగానో మరణించాలనుకోవడంలేదని ఆయన చెప్పారు. ఎన్నికల్లో ప్రజాప్రతినిధులయ్యేవారిలో చాలామంది ఎడా పెడా ఆర్జించేందుకు అవసరమైన పరిస్థితులను ప్రభుత్వాలే కల్పిస్తున్నందువల్ల ఎవర్ని తప్పుపట్టాలో అర్థం కావడం లేదని ఆయన అభిప్రాయపడ్డారు.

ఎన్నికల్లో డబ్బులు ఎలా ఖర్చుపెడతారు? అన్న ప్రశ్న అమాయకమైనది. ప్రజలను సానుకూలంగా మార్చుకునేందుకు ఏ స్థాయిల్లో ఎప్పుడు ఎంతమేరకు ఖర్చు పెట్టాలన్నది ఒక శాస్త్రీయమైన కళ. బూత్ కమిటీలు, శక్తి కేంద్రాలు, పన్నా ప్రముఖ్‌లు, ఐటి కేంద్రాలు, కన్సల్టంట్లు, సోషల్ మీడియా ప్రచారాలు, ప్రకటనలు, బ్యానర్లు, కటౌట్లు, పరిశీలకులు, పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తల్ని దించడం, ఇంటింటికీ ప్రచారం, సర్వేలు, ఇవన్నీ పైకి కనపడే ఖర్చుతో కూడుకున్న వ్యవహారాలు. మద్యం, నోట్ల పంపిణీ మాత్రమే కాదు అన్ని స్థాయిల్లో అనేక యంత్రాంగాల్ని, వ్యక్తుల్నీ తిప్పుకోవడం మరో ఎత్తు. శతకోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలు ఉన్నట్లు– గుజరాత్‌లో డిజిటల్ లావాదేవీల ద్వారా కూడా డబ్బులు బదిలీ అయ్యాయని ఆ తర్వాతి కాలంలో తెలిసింది. 'నా పదవీ కాలంలో ఎదుర్కొన్న అత్యంత కీలకమైన సవాలు– రాష్ట్రాల ఎన్నికల్లో డబ్బు ప్రభావాన్ని అరికట్టడం. ఇది రోజురోజుకూ పెరిగిపోతున్నది' అని ఇటీవల పదవీవిరమణ చేసిన ప్రధాన ఎన్నికల కమిషనర్ ఓపీ రావత్ అన్నారు. విచిత్రమేమంటే– రోజుకు పదివేల రూపాయల కంటే, మొత్తం ఎన్నికల్లో రూ.28 లక్షల కంటే ఎక్కువ అభ్యర్థి ఖర్చు పెట్టకూడదని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. డబ్బు మంచినీళ్లలా కళ్లముందే ప్రవహిస్తున్న ఈ రోజుల్లో ఎన్నికల కమిషన్ ప్రకటన విన్నవారికి నవ్వు రాకమానదు. అసలు పార్టీలు పెట్టే ఎన్నికల ఖర్చుకు పరిమితి లేదన్న విషయం చాలా మందికి తెలియదు. అసలు ఎన్నికల కమిషన్ అనుమతించిన దానికంటే పోలీసులు స్వాధీనం చేసుకున్న మొత్తం ఎన్నో రెట్లు ఎక్కువ ఉంటుంది. కర్ణాటక ఎన్నికల్లో రూ.5600 కోట్ల మేరకు ఖర్చయిందని క్రింది స్థాయిలో పనిచేసే కన్సల్టంట్లు చెప్పినట్లు ఒక వార్తాకథనం ప్రచురితమైంది.



> **ఎన్నికల సంస్కరణల విషయమై 1990లో గోస్వామి కమిటీ నుంచి 2008లో రెండవ పరిపాలనా సంస్కరణల కమిషన్ వరకు ఎన్నో సూచనలు చేశాయి. కేంద్రంలో ఉన్న ఏ ప్రభుత్వమూ వీటిని అమలు చేసేందుకు చిత్తశుద్ధి చూపలేదు. నల్లధనాన్ని అరికడతానని హంగామా చేసి అధికారంలోకి వచ్చిన మోదీ హయాంలో ఎన్నికల వ్యవస్థలో నల్లధనం పాత్ర పెరిగిన దాఖలాలే కాని తగ్గిన సూచనలు చేవు.**

భారత దేశంలో ఎక్కడా ఎన్నికల్లో సామాన్యుడు పోటీ చేసే పరిస్థితి లేదని అనే వారు చాలా మంది ఉన్నారు. అధికార పార్టీ అండతోనో, మరో వెన్నుదన్నుతోనో పోటీ చేసిన సామాన్యులు కూడా అనతికాలంలోనే సంపన్నులు అయిపోతున్నారు. రాజస్థాన్ ఎన్నికల్లో ఇటీవల గెలిచిన ఎమ్మెల్యేలలో 73 శాతం మంది కోట్లకు పడగెత్తిన వారు. అసలు రాజస్థాన్ నుంచి పోటీ చేసిన బిజెపి అభ్యర్థుల్లో 81 శాతంమంది కోటీశ్వరులు. మధ్యప్రదేశ్‌లో 656 మంది కోటీశ్వరులు పోటీ చేయగా వారిలో 161 మంది గెలిచారు. ఛత్తీస్‌గఢ్ ఎన్నికల్లో కూడా 42మంది కోటీశ్వరులు పోటీ చేశారు.

అసలీ డబ్బులు ఎలా వస్తున్నాయి? అధికారంలో ఉన్న పార్టీలు ఎంత ఆర్జిస్తే ఇంత భారీ ఎత్తున డబ్బులు ఖర్చు పెట్టగలుగుతాయి? అసలు రాజకీయ పార్టీలకు ఏఏ పారిశ్రామిక సంస్థలు, రియల్ ఎస్టేట్ సంస్థలు సహాయపడుతున్నాయి? ఎందుకు సహాయపడుతున్నాయి? ఈ ప్రశ్నలను సామాన్యులెవరూ అడగడం లేదు. ఎన్నికల నిధుల వెనుక పరిశ్రమలు, రియల్ ఎస్టేట్ సంస్థల హస్తం ఉన్నదని అనేక అధ్యయనాల్లో తేలింది. ఈ డబ్బంతా లెక్కలు చెప్పలేని నల్లధనం అనడంలో కూడా అతిశయోక్తి లేదు. మరి ఈ దేశంలో నల్లధనాన్ని నిర్మూలిస్తానని పెద్దఎత్తున వాగ్దానాలు చేసిన నరేందమోదీ ఏమి సాధించారు? మన కళ్లముందు ఎన్నికల సమయంలో ప్రవహిస్తున్న నల్లధనాన్ని అరికట్టలేని వారు దేశంలో నల్లధనాన్ని మొత్తంగా ఎలా నిర్మూలించగలరు? నల్లధనాన్ని అరికట్టేందుకు పెద్ద నోట్ల రద్దుతో సహా అనేక చర్యల్ని మోదీ ప్రభుత్వం తీసుకోలేదని చెప్పలేం కాని దాని వల్ల ఏం ప్రయోజనం కలిగింది? పెద్ద నోట్ల రద్దు మూలంగా ఏ ఫలితమూ రాలేదని రద్దయిన నోట్ల విలువ దాదాపూ తిరిగి వచ్చిందని రిజర్వు బ్యాంకు వార్షిక నివేదికే చెప్పింది. మహా అయితే ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు తీసుకున్న ఈ చర్య వల్ల బిఎస్‌పి, ఎస్‌పి లాంటి పార్టీలకు కొంత చెప్పుకోలేని ఇబ్బందులు ఎదురయి ఉండవచ్చు. స్థూలంగా చూస్తే పెద్ద నోట్ల రద్దు కేవలం రాజకీయ ప్రయోజనాలకోసం తీసుకున్న చర్య మాత్రమే కాని నల్లధనాన్ని అరికట్టేందుకు నిజాయితీతో చేపట్టిన చర్య కాదని అర్థమవుతోంది. ఇక ఆదాయ ప్రకటన పథకం, బినామీ నిషేధ చట్టం, ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన, ఆదాయపన్ను దాడులన్నిటితోనూ కలిపితే లక్షా 15వేల కోట్ల రూపాయలు స్వాధీనం చేసుకున్నామని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయినప్పటికీ అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో వేల కోట్ల నల్లధనం ఎలా ప్రవహించింది? నరేంద్ర మోదీ చెప్పగలరా?

విచిత్రమేమంటే విదేశాల్లో ఉన్న నల్లధనం గురించి దేవుడెరుగు. స్వదేశంలో ఉన్న నల్లధనాన్ని అరికట్టడంలో మన దర్యాప్తు సంస్థలు విఫలమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎన్నో చట్టాలు చేయగలదు. ఎన్నో దర్యాప్తు సంస్థలు కేంద్రం చేతుల్లో ఉన్నాయి. రాష్ట్రాల చేతుల్లో కూడా ఎన్నో సంస్థలు ఉన్నాయి. ఈ సంస్థలన్నీ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా నడుచుకోవడం వల్ల, ఆ సంస్థలకు, వాటిపై అజమాయిషీ చలాయించే వారు కుమ్మక్కు కావడం వల్ల ఎవరూ ఏమి చేయలేకపోతున్నారు. అధికార పార్టీ నాయకులపై, వారికి సహాయం చేసే పారిశ్రామిక సంస్థలు, వ్యక్తులపై, ప్రాంతీయ కుబేరులపై దాడులు జరిగిన సందర్భాలు ఎక్కడన్నా ఉన్నాయా? 2014లో 500 కోట్ల డాలర్ల మేరకు ఎన్నికల్లో ఖర్చయిందని ఒక అధ్యయన సంస్థ పేర్కొంది. 2012లో జరిగిన అమెరికా అధ్యక్ష పదవి ప్రచారంలో జరిగిన ఖర్చు కంటే ఇది కొంచెం తక్కువ. 2019లో జరిగే లోక్ సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరపున చేసే ప్రచారంలో భారీ ఎత్తున డబ్బు ఖర్చు పెట్టబోమని నరేంద్రమోదీ గుండెలమీద చేయి వేసుకుని చెప్పగలరా? ఆయన పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రులు, బిజెపి నేతలు, కార్యకర్తలు తిరిగే హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాలు, కార్లు, పాల్గొనే బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్ షోలకు, అభ్యర్థుల ప్రచారానికి, జనాలను సమీకరించేందుకు అయ్యే ఖర్చంతా తెల్లధనమేనని వారు స్పష్టీకరించగలరా?

'ఎన్ అన్ డాక్యుమెంటెడ్ వండర్, మేకింగ్ ఆఫ్ ద గ్రేట్ ఇండియన్ ఎలెక్షన్' అనే పుస్తకంలో మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్.వై.ఖురేషీ ఎన్నికల సమయంలో డబ్బు ఎంత క్షుద్రంగా ప్రవహిస్తుందో వివరించారు. ఎన్నికల సంస్కరణల విషయమై 1990లో గోస్వామి కమిటీ నుంచి 2008లో రెండవ పరిపాలనా సంస్కరణల కమిషన్ వరకు ఎన్నో సూచనలు చేశాయి. కేంద్రంలో ఉన్న ఏ ప్రభుత్వమూ వీటిని అమలు చేసేందుకు చిత్తశుద్ధి చూపలేదు. నల్లధనాన్ని అరికడతానని హంగామా చేసి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ హయాంలో ఎన్నికల వ్యవస్థలో నల్లధనం పాత్ర పెరిగిన దాఖలాలే కాని తగ్గిన సూచనలు లేవు.

భారత దేశంలో అధర్మాలు పెరిగిపోతున్నాయని, దేశభక్తిని బాగా ప్రజల్లో పెంచాల్సిన అవసరం ఉన్నదని వాదించే వారితో విభేదించనక్కర్లేదు. కాని దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రాణాధారమైన ఎన్నికల వ్యవస్థలో నల్లధనం ప్రమేయాన్ని అరికట్టి సరైన ప్రజాప్రతినిధులను ఎన్నుకోగలిగినప్పుడే దేశభక్తి అనే పదానికి సార్థకత ఏర్పడుతుంది. మోదీ ఎజెండాలో ఇలాంటి కర్తవ్యాలు లేకపోవడంలో ఆశ్చర్యం లేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)


ఓడిపోతే ఇడియట్‌లా?

> **టిఆర్ఎస్ 2009లో మహా కూటమి కట్టి కాంగ్రెస్ మీద పోటీ చేసింది. 45 సీట్లలో పోటీ చేస్తే కేవలం 10 సీట్లు మాత్రమే గెలిచింది. 3.99 శాతం ఓట్లను పొందింది. నాలుగు పార్టీలు ఏకమై పోటీ చేసినా పది సీట్లు దాటలేని టిఆర్ఎస్‌ను అప్పుడు ఇడియట్ పార్టీ అని అనాలా?**

తెలంగాణ ముఖ్యమంత్రిగా, నాలుగు కోట్ల ప్రజలకు ప్రతినిధిగా ఉన్న కేసీఆర్ ఇటీవల ప్రగతి భవన్‌లో జరిగిన పత్రికా విలేఖరుల సమావేశంలో అందునా ప్రత్యక్ష ప్రసారంలో మాట్లాడిన తీరు సబబుగా లేదు. ఆయన ఉపయోగించిన భాష; ప్రతిపక్షాలు, సహచర ముఖ్యమంత్రి, ఏకంగా ప్రధానమంత్రి, మీడియాపైన ఆయన చేసిన వ్యాఖ్యలతో తెలంగాణ అంటే దేశంలో ఒక పలుచన భావం ఏర్పడే పరిస్థితి నెలకొంది. తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా చేయడంలో జరుగుతున్న జాప్యమో, ప్రజల ఆకాంక్షలను బలంగా వినిపించే ఉద్దేశమో, ప్రజలను ఉద్యమం వైపు మరింత బలంగా తీసుకుపోవాలనే తపనతోనో, తెలంగాణకు అడ్డుపడుతున్న వారిపై ఆక్రోశంతోనో కేసీఆర్ కొంత పరుష పదజాలం ఉపయోగించినా దాన్ని సమాజం స్వీకరించింది. అప్పట్లో ఉన్న పరిస్థితులను బట్టి ప్రజలు, అప్పటి ప్రభుత్వాలు కూడా తెలంగాణ గుండె మంటను అర్థం చేసుకున్నాయి. కానీ నేడు కేసీఆర్ ముఖ్యమంత్రి. ఆరు సార్లు ఎమ్మెల్యేగా, మూడు సార్లు ఎంపీగా, ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా, కేంద్ర మంత్రిగా, ఒక ప్రాంతీయ పార్టీ అధ్యక్షులుగా, రెండోసారి ముఖ్యమంత్రిగా పనిచేస్తున్న వ్యక్తి, మంచి రాజకీయ అనుభవశాలి– ఒక పరిణత నేతగా ఎదగాల్సిన సమయంలో ఇలాంటి మాటలు మాట్లాడటం యావత్తు తెలంగాణ సమాజాన్ని ప్రపంచం ముందు తలదించుకునేలా చేస్తున్నాయి.

బీసీల రిజర్వేషన్ల గురించి మొదలుపెట్టి అనేక అంశాలపైన కేసీఆర్ ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. బీసీల అంశంపైన, రిజర్వేషన్లపైన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లు 22 శాతం ఇచ్చారు. గతంలో ఇచ్చిన 34శాతం కంటే దాదాపు 12శాతం తగ్గడం ఎలా సమర్థనీయం? ఇది హైకోర్టు ఆదేశం కనుక అమలు చేయకుండా ఎలా ఉంటామని అంటున్నారు. మరి పార్లమెంటరీ సెక్రటరీల విషయంలో ప్రభుత్వం రీ పిటిషన్ వేసి తిరిగి ఆ పదవులను పొందేందుకు ప్రయత్నాలు చేయడం లేదా? బీసీ రిజర్వేషన్ల విషయంలో ఎబిసిడిఇ ప్రకారం కుల గణనచేసి ఎన్నికలు నిర్వహించాలని కోర్టు చెప్పింది. మరి ఆ ఆదేశాలను ఎందుకు అమలు చేయడంలేదు? లక్షా 20వేల పదవులున్నాయి, రిజర్వేషన్లను ఎలా అమలు చేస్తాం, ఐదేళ్ళు అవుతుందని కేసీఆర్ అంటున్నారు, అంటే అది హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరించినట్టు కాదా? ఒక్క రోజులోనే 4కోట్లమంది చేత సమగ్ర కుటుంబ సర్వే చేయించగలిగిన కేసీఆర్ ఇంత పెద్ద వ్యవస్థలో లక్షా 20 వేల పదవులకు రిజర్వేషన్ల కేటగిరి చేయలేరా? ఇవన్నీ ఆయనకు ఇష్టం లేని పనులు. ఇక ఎవరో ఒక సర్పంచ్ కోర్టుకు పోతే అది కాంగ్రెస్ చేసిన కుట్రగా కేసీఆర్ చెబుతున్నారు; సర్పంచ్ పదవులకు రాజకీయ పార్టీల గుర్తులు ఉంటాయా? ఒక గ్రామ సర్పంచ్ కేసు వేస్తే దాన్ని తప్పించడానికి ఇంత పెద్ద వ్యవస్థ ఏమీ చేయలేదా? చిత్తశుద్ధి ఉంటే చేయలేరా? మరి ఇవన్నీ కాంగ్రెస్ మీద నెపం పెట్టి తప్పించుకోవడం ఇడియట్ పనులు కావా?

కాంగ్రెస్ విషయంలోను, అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి విషయంలో ఇడియట్‌లు అని కేసీఆర్ మాట్లాడారు. ఓడిపోతే ప్రశ్నించవద్దా? ఓడిపోతే ఇడియట్‌లు అయిపోతారా? ఈ అసెంబ్లీ ఎన్నికలలో ఇవిఎంల పనితీరుపైన అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఓటర్ల తొలగింపు, ఓటర్ల నమోదు ప్రక్రియలో లోపాలు, అవకతవకలు, దాదాపు 22 లక్షల మంది ఓటర్లను తొలగించడం, దాదాపు లక్ష మంది ఓటర్లు ఆన్‌లైన్‌లో ఉన్నా ఓటు వేసే అవకాశం లేకుండా పోవడం లాంటి అనేక తప్పులు మనకు కళ్ళకు కట్టినట్టు కనిపించాయి. ఈ విషయంలో ఎన్నికల కమిషనర్ రజత్ కుమార్ స్వయంగా క్షమాపణ చెప్పారు. పోలింగ్ రోజున వేలాది ఇవిఎంలు సాంకేతిక లోపాలతో పనిచేయకుండా పోయాయి. ఎన్నికల తరువాత దాదాపు 38 నియోజకవర్గాలలో పోలింగ్ ఓట్లకు, కౌంటింగ్ ఓట్లకు తేడాలున్నాయని స్వయంగా ఎన్నికల సంఘమే ఒప్పుకుంది. కేసీఆర్, కేటీఆర్ చెప్పినట్టుగానే ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. కేసీఆర్ చెప్పినట్టుగానే ఆయనకు సీట్లు వచ్చాయి. తెరాస అభ్యర్థులు ఎన్ని ఓట్ల మెజారిటీతో గెలుస్తారో ముందుగానే చెప్పారు. కాంగ్రెస్‌లో ఉన్న ప్రముఖులు ఎవరెవరు ఓడిపోతారో ముందుగానే చెప్పారు. ఇవన్నీ అనుమానాలకు తావిచ్చేలా ఉన్నాయి. వాటిని ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నిస్తే అదేదో పెద్దతప్పులా ఇడియట్‌లు అని మాట్లాడడం ఏమి సంస్కారం? టిఆర్ఎస్ 2009లో మహా కూటమి కట్టి కాంగ్రెస్ మీద పోటీ చేసింది. 45 సీట్లలో పోటీ చేస్తే కేవలం 10 సీట్లు మాత్రమే గెలిచింది. 3.99 శాతం ఓట్లను పొందింది. నాలుగు పార్టీలు ఏకమై పోటీ చేసినా పది దాటలేని టిఆర్ఎస్‌ను అప్పుడు ఇడియట్ పార్టీ అని అనాలా?



సహచర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురించి చాలా రకాలుగా మాట్లాడారు. ఆయన ప్రధాని మోదీ సంక ఎక్కాడని, దేశంలోనే డర్టీ పొలిటికల్ లీడర్ అని అన్నారు. ఏకంగా దేశ ప్రధానిని సన్నాసి అని మాట్లాడారు. నాలుగు కోట్ల జనాభా ఉన్న ఒక రాష్టానికి రెండోసారి ముఖ్యమంత్రిగా ఉండి కూడా ఇలాంటి బాషను ఉపయోగిస్తే ఖచ్చితంగా తెలంగాణ పైన దేశ ప్రజలకు ఒక చులకన భావం ఏర్పడుతుంది. నందమూరి తారక రామారావు 1989లో నేషనల్ ఫ్రంట్ పేరుతో, చంద్రబాబు నాయుడు 1996లో యునైటెడ్ ఫ్రంట్ పేరుతో దేశ రాజకీయాలలో క్రియాశీల పాత్ర పోషించారు. ఆ రెండు సమయాలలో కేసీఆర్ ఆ పార్టీలోనే ఉన్నారు కదా. రెండు దశాబ్దాల క్రితమే దేశంలో కీలక పాత్ర పోషించిన తెలుగు నాయకుల గురించే మనం పలుచన చేసుకునే విధంగా మాట్లాడడం భావ్యమా? సైద్ధాంతిక, రాజకీయ విభేదాలుంటే వాటిని సాధారణ బాషలో వ్యతిరేకించడం కానీ, ఖండించడం కానీ చేయలేమా? చంద్రబాబు ఇక్కడ రాజకీయాలు చేశారనే ఆగ్రహం కేసీఆర్‌కు ఉండడం సహజమే కానీ రాజకీయాలు ఎప్పుడు ఎటు వైపు మలుపు తిప్పుతాయో తెలియదన్న విషయం మూడున్నర దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న కేసీఆర్‌కు తెలియదా? ఒకప్పుడు 2009లో చంద్రబాబుతో పొత్తు పెట్టుకున్న సమయంలో చంద్రబాబు అపర రాజకీయ పరిజ్ఞానం ఉన్న నేత అని, రాజకీయంగా ఎంతో ముందు చూపు ఉందని, గొర్రె బెత్తెడు ఉన్న బడ్జెట్‌ను 60 వేల కోట్లకు పెంచి సంపదను సృష్టించిన మహానేత అని, ఐ.టి.కి పునాదులు వేసింది బాబేనని కేసీఆర్ అన్న వీడియోలు ఇంకా యుట్యూబ్‌లో ఉన్న విషయం కేసిఆర్‌కు తెలియదా? చంద్రబాబు ఒకసారి రాహుల్ గాంధీని, ఒకసారి మోదీని నిందించారని కేసిఆర్ ఆగ్రహించారు. మరి అనేక సార్లు మాట మార్చి ప్రసంగాలు చేసిన కేసీఆర్ గురించి కూడా జనం అలాగే అనుకోవాలా? గజ్వేల్‌లో మిషన్ భగీరథ ప్రారంభించడానికి ప్రధాన మంత్రి వస్తే మీ హృదయంలో స్థానం ఉంటే చాలు మాకేమి వద్దు అని కేసిఆర్ ప్రసంగించలేదా? మరి మొన్నపోయి 16 రకాల డిమాండ్లతో వినతిపత్రం ఇచ్చారు కదా. ఇప్పుడు గుండెల్లో స్థానం వద్దా మరి ?

కేసీఆర్ ఇచ్చిన మాటలు అన్నీ నిలబెట్టుకున్నారా? గత ఎన్నికలలో దళితుడిని ముఖ్యమంత్రి చేయకపోతే తల నరుక్కుంటా అన్న విషయం వాస్తవం కాదా? దళితులకు గిరిజనులకు కుటుంబానికి మూడు ఎకరాల భూమి ఇస్తామన్నది; గిరిజనులకు, ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తామన్నది; లక్ష ఉద్యోగాలు ఇస్తామన్నది; ఏడాదిలో రెండు లక్షల డబుల్ బెడ్ రూమ్‌లు కడతామన్నది నిజం కాదా? మరి కేసీఆర్ ఆ మాటలన్నీ నెరవేర్చారా? మాట తప్పలేదా? దళితులను, ముస్లింలను, గిరిజనులను, నిరుద్యోగులను, పేదలను అందరినీ మోసం చేసింది నిజం కాదా. మరోసారి గెలిస్తే అవన్నీ మాఫీ అయిపోనట్టేనా?

విజయవాడ వార్తలు మాకు అవసరమా.. పొద్దున్నే ఆ దరిద్రమంతా మాకెందుకు అని కేసీఆర్ ఆంధ్రా పట్ల అవమానకరంగా మాట్లాడారు. సాంకేతికంగా పరిధులు విస్తరించిన తరువాత ప్రపంచంలో జరుగుతన్న అంశాలను సెకన్లలో మనం చూస్తున్నాము. విజయవాడ వార్తలు తప్పెలా అవుతాయి? అక్కడ కూడా తెలుగు వారే ఉన్నారు. అనేక మంది ఆంధ్రా ప్రాంతం వాళ్ళు ఇక్కడ జీవిస్తున్నారు. ఇంకా చాలా వరకు మీడియా సంస్థలు హైదరాబాద్ నుంచే తమ పనులను నడిపిస్తున్నాయి. అలాంటప్పుడు అక్కడి వార్తలు ఇక్కడ ప్రచురిస్తే తప్పెలా అవుతుంది? ఎన్నికల సమయంలో ఆంధ్రావాళ్ళ కాలుకు ముల్లు గుచ్చుకుంటే తన పంటితో తీస్తానన్న కేసీఆర్ ఇలా ఎలా మాట్లాడారు? గతంలో సెటిలర్‌లు అని ఆంధ్రాప్రాంతవారిని అవమానపరచవద్దు అన్నారు. ఇక్కడ ఉన్నవారంతా అన్నదమ్ముల్లా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రాంతాలుగా విడిపోదాం.. అన్నదమ్ముల్లా కలిసుందామన్న కేసీఆర్ ఇప్పుడెందుకు ఇలా మాట్లాడుతున్నారు? మొన్న ఎన్నికల ముందు కూడా కేసీఆర్ ఆంధ్రా ఓట్ల కోసం ఎలా ప్రాధేయపడ్డారో మనం చూశాము. ఆంధ్రాలో ఉన్న విజయవాడ కనకదుర్గమ్మ మొక్కు, తిరుపతి వెంకన్న మొక్కు, విశాఖలో యాగాలు, చంద్రబాబు ఇంట్లో భోజనాలు, పరిటాల రవి ఇంట్లో విందులకు హాజరైన కేసీఆర్‌కు విజయవాడ వార్తలు అంటేనే ఎందుకు అంత అసహ్యం వచ్చింది? ఇందులో ఉన్న మతలబు ఏమిటి? ఇలా చెప్పుకుంటూ అనేక అంశాలలో కేసీఆర్ తన నోటికి పనిపెట్టడం తెలంగాణను ప్రపంచం ముందు పలుచన చేసినట్టు అవుతుంది. తెలంగాణ అంటే దేశంలో ఒక ప్రత్యేకత ఉంది. ఆ ప్రత్యేకత కొంత కేసిఆర్ వల్ల కూడా వచ్చింది. దాన్ని కాపాడుకునే ప్రయత్నం చేయాలి. కేవలం నోటికి పనిపెట్టడం వల్ల, రాజకీయ పరిణతి కోల్పోయి మాట్లాడడం వల్ల తెలంగాణకే కాకుండా కేసిఆర్‌కు కూడా వ్యక్తిగతంగా చెడ్డపేరు వస్తుంది. అది తెలంగాణకు తెలంగాణ ముఖ్యమంత్రికి మంచిది కాదు. రాజకీయాలు అంటే కేవలం పదవులు పొందడమే కాదు, ప్రజాసేవ కూడా. రాజకీయాలు అనేక సార్లు తిరగబడ్డాయి. అవన్నీ కేసిఆర్‌కు తెలియనవి కావు. ప్రధాన ప్రతిపక్షం లేకుండా పాలన చేయడమంటే ఉప్పు కారం లేని కూడు తిన్నట్టు అని ఒక రాజకీయ విశ్లేషకుడు ప్రస్తావించారు. మరి ప్రతిపక్షం లేకుండా చేయడం ద్వారా ప్రశ్నించే వారు లేకుండా పాలన చేయాలనుకుంటే కేసీఆర్‌కు కూడా రుచి లేని తిండి లానే ఉంటుంది. ఇది గమనించి ప్రతిపక్షాన్ని గౌరవించుకుంటే మంచిది.

■ కప్పర హరి ప్రసాద్ రావు
ముఖ్య ప్రజా సంబంధాల అధికారి
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ



హాంకాంగ్‌లో నివాసముండే తెలుగు కుటుంబాలకు ఏ అవసరం వచ్చినా ఆదుకుంటారు.. ఆ దేశం మీదుగా, ఇతర దేశాలకు రాకపోకలు సాగించే తెలుగువాళ్లకు హాంకాంగ్‌లో ఏ ఆపద వచ్చినా ఆపన్నహస్తం అందిస్తారు. 'హాంకాంగ్ తెలుగు సమాఖ్య' ఏర్పాటు చేసి దాని అధ్యక్షురాలుగా ఉన్న **జయ పీసపాటి** అక్కడ 'తెలుగు' సేవ చేస్తున్నారు. ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన ఆమెను 'నవ్య' పలుకరిస్తే...

హాంకాంగ్‌లో 'తెలుగు' సేవ!

మాది విజయవాడ దగ్గర యద్దనపూడి. నాన్న యద్దనపూడి నాగేశ్వరరావు రైల్వేలో ఉన్నతోద్యోగి కావడంతో నా బాల్యమంతా మహారాష్ట్ర, గుజరాత్, రాజస్తాన్‌లో సాగింది. నేను ఐదో తరగతిలో ఉన్నప్పుడు హైదరాబాద్‌కు వచ్చాం. ఇక్కడి రైల్వే స్కూల్‌లో తెలుగు మీడియంలో చేరడానికి అడ్మిషన్ అడిగితే తెలుగు రాయడం, చదవడం రావాలన్నారు. కానీ నాకు తెలుగు వచ్చేది కాదు. పది రోజులు టైమిచ్చారు. ఏదోవిధంగా కొంత నేర్చుకుని రైల్వే స్కూల్‌లో అడ్మిషన్ పొందాను. ఆ తర్వాత కష్టపడి తెలుగులో పట్టు సాధించాను.

2002లో హాంకాంగ్ వెళ్లాం..

నా భర్త పేరు రవిశంకర్ పీసపాటి. మర్చంట్ నేవీలో మెరైన్ ఇంజనీర్. రవాణా నౌకల సాంకేతిక సమస్యలను చూస్తుంటారు. ముంబయి, గోవాలో పని చేశారు. ఆయన ఉద్యోగరీత్యా 2002లో హాంకాంగ్‌కు వెళ్లి, అక్కడే స్థిరపడ్డాం. మాకు ఇద్దరు పిల్లలు. హాంకాంగ్‌కు వెళ్ళిన కొత్తలో అక్కడ మాకు ఎవరూ తెలియదు. దేశం కానీ దేశంలో మన అనుకునే తెలుగువాళ్లు కనిపిస్తే ఎంతో ధైర్యం వస్తుంది. మావారు డ్యూటీకి వెళితే రెండు నెలలైనా గానీ రారు. ఇంట్లో ఒక్కదాన్నే ఉండలేక అక్కడ తెలుగువారి కోసం వెదకడం మొదలెట్టాను. అప్పట్లో ఒక్క అసోసియేషన్ కూడా లేదు. ఏడాదిపాటు వెతకగా, చివరకు యూనివర్సిటీ ప్రొఫెసర్ కేపీ రావు పరిచయం అయ్యారు. ఇండియన్ ఎంబసీ నుంచి తెలుగువారి సమాచారం తీసుకుని ఆయన వారికి లేఖలు రాసి వనభోజనాలకు ఆహ్వానించేవారు. ఆ విధంగా నాకు కూడా వచ్చిన లేఖతో వనభోజనాలకు వెళ్ళి హాంకాంగ్‌లో తెలుగువారిని కలిశాను. అయితే ఈ లేఖలతో సమాచారం చేరడం కష్టమని, మెయిల్స్, మొబైల్ మెసేజ్‌ల ద్వారా తెలుగువారిని ఒకే తాటిపైకి తీసుకోస్తే బాగుంటుందని కేపీరావుకు సూచించాను. ఆయన ఆ పని నాతోనే చేయించారు.



ఫ్యామిలీతో..

'తెలుగు సమాఖ్య' ఏర్పాటు...

హాంకాంగ్‌లో తెలుగువారి వివరాలు తీసుకుని మెయిల్స్, మెసేజ్‌ల ద్వారా పరిచయం పెంచుకున్నాను. ఆ విధంగా నేను అక్కడికి వెళ్లిన నాలుగేళ్లకు అంటే 2006లో 'ది హాంకాంగ్ తెలుగు సమాఖ్యను' ఏర్పాటు చేశాం. ఆ సమాఖ్యకు వ్యవస్థాపక అధ్యక్షురాలిగా ఇప్పటికీ కొనసాగుతున్నాను. అప్పట్లో కేవలం నలుగురితోనే గవర్నింగ్ బాడీ ఉండేది. 40కుటుంబాలు మాత్రమే ఉండేవి. సమాఖ్య తరపున అందరి ఆలోచనల మేరకు ప్రతీ ఏడాది అక్కడ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తుంటాం. మన సంస్కృతిలో భాగంగా ఉగాది పండుగతో పాటు వనభోజనాలు, సంక్రాంతి, సత్యనారాయణ వ్రతాలు, నవరాత్రోత్సవాలు... ఇలా అన్నీ తెలుగు పండుగలు చేస్తుంటాం. క్రిస్మస్, న్యూ ఇయర్ సంబరాలను కూడా ఘనంగా జరుపుకుంటాం. ప్రస్తుతం తెలుగు సమాఖ్యలో 250 కుటుంబాలున్నాయి. తెలుగువారికి ఏలాంటి సహకారం కావాలన్నా సమాఖ్య ముందుంటుంది.



అక్కడి ప్రభుత్వం, ఇండియన్ ఎంబసీలు మంచి సహకారాన్ని అందిస్తున్నాయి.



తెలుగువారు అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాలకు వెళ్తూ ఆరోగ్య సమస్యలతో హాంకాంగ్ ఎయిర్‌పోర్ట్‌లో నిలిచినవారికి మా తెలుగు సమాఖ్య అండగా నిలిచింది. ఆస్పత్రిలో చేరిన పలువురు తెలుగువాళ్లను కలవగానే వారి బాధంత చెబుతారు. ఆస్పత్రిలో వారి కుటుంబీకులు చికిత్స పొందే సమయంలో అక్కడ ఉండే అవకాశం లేకపోవడంతో చాలామందికి మా ఇళ్లలో ఆశ్రయం కల్పించాం. వారికి అండగా నిలిచాం.

స్కూల్ టీచర్‌గా..

నేను హాంకాంగ్‌లోని ఉడ్‌ల్యాండ్ ఇంటర్నేషనల్ ప్రీ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్నా. అక్కడంతా ఇంగ్లీష్, చైనీస్ భాషలోనే విద్యా బోధన ఉంటుంది. తెలుగు కుటుంబాల పిల్లలకు నేను తెలుగు బోధిస్తున్నాను. తెలుగు క్లాసులకు చైనీస్ పిల్లలు కూడా వస్తుంటారు. చైనీయులు తెలుగు నేర్చుకోవడానికి కారణమేమిటంటే.. అక్కడ కొంతమంది చైనీయులు కూచిపూడి డ్యాన్స్ నేర్చుకుని ప్రదర్శనలు ఇస్తుంటారు. తెలుగు భాషను నేర్చుకుని భావాలకు అనుగుణంగా నాట్య ప్రదర్శనలు చేస్తున్నారు. అలా ఈ మధ్య కూచిపూడి నేర్చుకున్న డ్యాన్సర్ ఇండియాకు రావడానికి ఇండియన్ ఎంబసీ వీసా నిరాకరించింది. ఈ విషయం తెలిసి ఎంబసీ డైరెక్టర్ జనరల్‌తో మాట్లాడి వీసాను ఇప్పించాం. అలాగే తెలుగువారెవరైనా హాంకాంగ్ వస్తే వారి ఉపాధి వివరాలు తెలుసుకుని వారికి ఉండేందుకు ఇల్లు, పిల్లలకు స్కూలు విషయాల్లో సలహాలిస్తుంటాం. హాంకాంగ్‌లోని ఇండియన్ ఎంబసీలో తెలుగు సమాఖ్య వివరాలున్నాయి.

> అమెరికాలో ఉద్యోగం చేస్తున్న అవినాష్, ఆరు నెలల గర్భవతి అయిన తన భార్య రిషికను (పేర్లు మార్చాం) అమెరికా తీసుకెళ్తున్నారు. అనుకోకుండా రిషికకు నొప్పులు ప్రారంభమయ్యాయి. వెంటనే విమానాన్ని హాంకాంగ్ ఎయిర్‌పోర్ట్‌లో దించి ఆస్పత్రికి తరలించారు. నెలలు నిండకుండానే పసిగుడ్డుకు రిషిక జన్మనిచ్చింది. ఐదో నెలలో పుట్టిన పసిబిడ్డను తొమ్మిది నెలలు నిండే వరకు ఆస్పత్రిలోనే ఉంచాలని వైద్యులు సూచించారు. చేసేదేమి లేక భార్యతో కలిసి అవినాష్ అక్కడే ఉన్నారు. దేశం కాని దేశంలో తనకు సాయపడేవారు లేరా! అని ఎదురుచూస్తుండగా 'హాంకాంగ్ తెలుగు సమాఖ్య' ప్రతినిధులు నాలుగున్నర నెలల పాటు వారికి అవసరమైన సహకారం అందించారు.

> **హాంకాంగ్‌లో మెదక్ జిల్లాకు చెందిన వ్యక్తి ప్రమాదానికి గురవ్వగా, అక్కడి ఆస్పత్రిలో వైద్య సేవల నుంచి, అతడిని ఇండియాకు పంపడం దాకా 'హాంకాంగ్ తెలుగు సమాఖ్యే' బాధ్యత తీసుకుంది.**

రేడియో జాకీగా..

హాంకాంగ్‌లో నిర్వహించే పలు కార్యక్రమాలను తెలుగువన్.కామ్ వెబ్‌సైట్‌కు పంపేదాన్ని. ఆ సంస్థ తెలుగువన్ రేడియోకు కార్యక్రమాలను చేయమంది. దాంతో రేడియో జాకీగా మారాను. అలా 'హాయ్ హాంకాంగ్' పేరుతో ఇక్కడి తెలుగు వారి విశేషాలను చెప్పేదాన్ని. తెలుగువన్ రేడియోలో ప్రాచుర్యం పొందిన 'జైహింద్' కార్యక్రమాన్ని హాంకాంగ్ నుంచి నిర్వహిస్తున్నా. భారత జవాన్ల సాహసాలను, వారి త్యాగాలను, పోరాట పటిమను వివరించి వాటి ద్వారా యువత స్ఫూర్తి పొందాలనే ఆలోచనతో 'జైహింద్' కార్యక్రమాన్ని ప్రారంభించాను. పుట్టిన గడ్డకు, మాతృభాషకు ఏదో చేయాలనే తపనతోనే ఇదంతా చేస్తున్నా.

• **బయ్యు దామోదర్**

ఫొటోలు: **అశోకుడు**

తిరుప్పావై

లక్ష్యం, సాధనం.. రెండూ వారిద్దరే!

పద్దెనిమిదో పాశురం

ఉన్దు మదకళిత్త! నోడాద తోళ్వలియన్
నన్ద గోపాలన్ మరుమగళే! నప్పిన్నాయ్!
కన్దమ్ కమళుమ్ కుళలీ! కడై తిరవాయ్
వన్దెఙ్గుమ్ కోళి అళైత్తనకాణ్ మాదవి
ప్పన్దల్ మేల్ పల్ కాల్ కుయిలి నఙ్గల్ కూవినగాణ్
పన్దార్ విరలి! ఉన్ మైత్తునన్ పేర్పాడ
చెన్దామరైక్కైయాల్ శీరార్ వళై యొళిప్ప
వన్దు తిరువాయ్ మగిళిందేలో రెమ్బావాయ్!

ఈ దివ్య పాశురంలో ఆండాళ్ శ్రీవైష్ణవ ముఖ్య సిద్ధాంతం ఒకటి నిక్షిప్తం చేసింది. ఆ సిద్ధాంతం శ్రీదేవీ, భగవానుడూ అవిచ్ఛిన్నమైన శక్తులనీ (విడదీయ రానివారనీ), చేరవలసిన (ఉపేయం) పరమ లక్ష్యం, చేర్చే (ఉపాయం) సాధనం... రెండూ వారిద్దరేనని ప్రతిపాదించింది. ఈ మౌలిక సిద్ధాంతానికి 'ఏక శేషిత్వం' అని పేరు. ఇది దృష్టిలో పెట్టుకొని నప్పిన్నాయ్‌ని.. అంటే కృష్ణుని దేవేరిని ఆండాళ్ భక్తిపురస్సరంగా మేల్కొల్పుతోంది. నప్పిన్నాయ్ కృష్ణుని మేనమామ కుమార్తె. పోటెక్కిన కోడెలను అదుపు చేసి పందెంలో గెలిచి ఆమెను కృష్ణుడు పరిణయమాడాడు. ఆమె బాహువుల నడుమ సుఖనిద్రలో మునిగిన కృష్ణుణ్ణి మేలుకొలపాలంటే, ముందు నప్పిన్నాయ్ తన కౌగిలి సడలించవలసి ఉంది. కేవలం ఆమె అనుగ్రహిస్తేనే కృష్ణుడు లేవగలడు. అందుకని ఆమెను ప్రార్థించి లేపుతున్నది ఆండాళ్.

"మత్తగజాలను సైతం తన బాహుబలంతో అదుపు చెయ్యగల మహాబలశాలి నందగోపుని కోడలా! యుద్ధభూమిలో అపజయమన్నది ఎరుగని నందగోపుని వీరత్వమే ఆయన కుమారుడు కృష్ణుడు పుణికి పుచ్చుకున్నాడు కాబోలు! ప్రజా కంటకంగా సంచరిస్తున్న కోడెలను నిగ్రహించి నిన్ను గెలుచుకున్నాడు. అంతటి మహాబలశాలినీ, పరాక్రమవంతుడినీ నీ సున్నితమైన బాహుబంధంలో బంధించి ఉంచావు. ఈ గొల్లపిల్లల పట్ల దయతో నీ భర్తను వీడి నిద్దుర లేపవమ్మా!" అని ఆండాళ్ వేడుకుం టోంది.

మేలుకొలుపునకు మధ్యవర్తిత్వం

అలా ప్రాధేయపడినా నప్పిన్నాయ్ స్పందించలేదు. ఆమె అటు ఇటు కదిలింది కాబోలు... శిరస్సున ధరించిన పుష్పమాలలు విరజిమ్మిన పరిమళాలు మందిరం బయటకు ప్రసరించాయి. "అమ్మా! నప్పిన్నాయ్! నీ శిరోజాల పరిమళాలు బయటి దాకా ప్రసరించి నీ ఉనికిని తెలుపుతున్నాయి. కరుణించి కృష్ణుని మేల్కొలపవమ్మా! చూడు, తెల్లవారింది. ఎల్లెడలా కోళ్లు కూతలు పెడుతున్నాయి. నీవు పెంచిన మత్తకోకిలలు నీ రాక కోసం గురివింద పందిళ్ల మీద కూర్చొని కుహూ



చిత్రం: కేశవ్ https://www.facebook.com/keshav61/

మని మధురంగా కూస్తున్నాయి. నీ స్వామిని స్తోత్రం చేస్తున్న ఈ అమాయక గొల్లపడుచుల మీద దయతో లే! నీ ఎర్రకలువల వంటి చేతుల గాజులు సుమధురంగా గలగలమని ధ్వనిస్తుండగా తలుపు తియ్యి తల్లీ ! భోగోపకరణమైన బంతిని చేతుల్లో ధరించినదానా! అలసినావేమో, మా పట్ల దయ చూపి నీ భర్తను లేపి తలుపు తియ్యవమ్మా! అని జాలిగా ఆండాళ్ ప్రాధేయపడుతున్నది.

ఈ అద్భుత పాశురాన్నే 'తిరుప్పావై జీయర్' గా పేరుగాంచిన శ్రీ రామానుజాచార్యులు ఉంఛవృత్తి చేసుకుంటున్నప్పుడు అనుసంధించారట! ఆ ఆనందానుభవంలో తమ ఆచార్యుల కుమార్తె అత్తుళ్ళై తన గాజులు గలగలమంటుండగా భిక్ష సమర్పించానికి తలుపు తియ్యగానే, ఆమెను 'నప్పిన్నపిరాట్టి'గా భావించి బాహ్యస్మృతి కోల్పోయారని ఐతిహ్యం. తిరువారాధన క్రమంలో ఆచార్యుని, నిత్యసూరులైన (వైకుంఠంలో నారాయణుడికి సేవలు చేసేవారైన) అనంత-గరుడ-విష్వక్సేనులను సుప్రభాతసేవలో మేల్కొలిపి, ఆపైన భగవానుని దేవేరిని (పిరాట్టిని) మేల్కొల్పటం జరుగుతుంది. ఈ పాశురంలో నప్పిన్నపిరాట్టిని మేల్కొల్పడం ముగ్గురు నిత్యసూరులను మేల్కొల్పడమే!

కృష్ణావతారంలో కృష్ణుడు గోకులంలో నివసించినంత కాలం నప్పిన్నాయ్ ఆయన ప్రధాన దేవేరిగా, ప్రియతమురాలిగా పూజలందుకున్నది. నప్పిన్నాయ్‌ని నీళాదేవి అవతారంగా పండితులు సంభావించారు. అందువల్ల గోపికలు నప్పిన్నాయ్ పురుషకారాన్ని (మధ్యవర్తిత్వాన్ని) అర్థించారు. ఈ దివ్యపాశురం అపార కారుణ్యమూర్తి నప్పిన్నాయ్‌ని మేల్కొల్పుతూ గోపికలు పాడే మూడు పాశురాలలో రెండవది. భగవానుడిని 'పురుషునిగా' అంటే 'పూర్ణునిగా' తీర్చిదిద్దే తల్లి మహాలక్ష్మి. అందుకే ఆమె చేసే సాయాన్ని 'పురుషకారం' అని సంభావిస్తారు.

"ఉభయవిభూతి నాయకురాలా! నీ సంకల్పానికి ఎటువంటి అడ్డూ లేదు. అయినా మమ్ములను పట్టించుకోకున్నావు! మాకు, భగవానుడికి మధ్య ఏర్పడిన ఆటంకాలను తొలగించి మమ్ముల్ని కేశవుని ముందు నిలుపు మాతా! నీవు ఎక్కడికి వెళ్తే అక్కడ సారగ్రాహుల వలె (కోళ్ల వలె) ప్రపత్తి ఆచరిస్తున్నాం. దయ చూడు తల్లీ! వాల్మీకి, శుక శౌనకుల వంటి మహర్షులు వేదోపశాఖలపై కోకిలల్లా కూర్చొని నీ స్వామి కళ్యాణగుణ గానం చేస్తున్నారు. నీ స్వామి చేతిలో లీలోపకారణాల వంటి (ఆటవస్తువుల్లాంటి) మమ్మల్ని భోగోపకారణాలుగా (ఆనందం కలుగజేసేవిగా) మార్చు తల్లీ! నీ స్వామికి మా మీద ఉన్న కోపాన్ని నిగ్రహించి వాత్సల్యాన్ని కలుగజెయ్యి!" అని ఆండాళ్ ప్రార్థిస్తోంది.

ఆండాళ్ తిరువడిగళే శరణం!

• **శ్రీదేవీ మురళీధర్**

హెల్త్‌కేర్

నెయ్యి మనకు నేస్తమే!


నెయ్యితో కొవ్వు పెరిగిపోతుందని, ఆది ఆరోగ్యానికి హానికరమనే ఒక భావన చాలా మందిలో ఉంటుంది. నెయ్యిలో కొవ్వు ఉన్నది నిజమే కానీ, అది కరిగిపోయి శక్తినిస్తుందే తప్ప హానిచేయదు. మేధోశక్తినీ, జ్ఞాపకశక్తినీ పెంచడంలోనూ జీర్ణవ్యవస్థను చక్కదిద్దడంలోనూ నెయ్యి ఎంతో ఉపయోగపడుతుంది. గాయాలను మాన్పడంలోనూ, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలోనూ నెయ్యి పాత్ర కీలకమే. శరీరంలోని హానికారక ఫ్రీరాడికల్స్‌ను దెబ్బతీసే యాంటీ ఆక్సిడెంట్లు నెయ్యిలో సమృద్ధిగా ఉన్నాయి. పరిమితికి లోబడి తీసుకుంటే నెయ్యితో లాభాలు బోలెడు...



- బీటా కెరోటిన్లకు, ఎ,డి,కె విటమిన్లకు నెయ్యి ఒక నిధిలాంటిది. నెయ్యితో లభించే సహజసిద్ధమైన విటమిన్ ఏ, ఇతర వంటనూనెల్లో లభించేదాని కన్నా ఎంతో నాణ్యమైనది.
- నెయ్యిలో అంతకు ముందున్న పాల తాలూకు అంశాలు, లాక్టోస్, షుగర్లు ఉండవు కాబట్టి పాలు పడని వారు కూడా నెయ్యిని నిస్సందేహంగా తీసుకోవచ్చు.
- శరీరంలోని మలినాలను బయటికి పంపే శక్తి కూడా నెయ్యిలో ఉంది.
- పిల్లల ఎదుగుదలకు తోడ్పడటంతో పాటు నెయ్యి వారి ఏకాగ్రతను, జ్ఞాపకశక్తినీ పెంచుతుంది.
- కాలిన లేదా తెగిన గాయాల పైన నేరుగా కాస్తంత నెయ్యి పూస్తే చాలు మానిపోతాయి.
- నెయ్యిలో సమృద్ధిగా ఉండే యాంటీ ఆక్సిడెంట్లు జీవక్రియలను ఉత్తేజపరచడంతో పాటు, కొలెస్ట్రాల్‌నూ, శరీరం బరువునూ తగ్గిస్తాయి.
- కంటిపై నెయ్యి ఒత్తిడిని తగ్గిస్తుంది. గ్లూకోమా సమస్యను నియంత్రిస్తుంది.

తెలుసుకుందాం..

ప్రాణానికి రక్షణగా పాల దంతాలు




సాధారణంగా చాలామంది తల్లులు పిల్లల పాలదంతాలు ఊడిన తర్వాత కాటన్‌లో ఉంచి, గార్డెన్‌లో పూడ్చేస్తారు. అలాకాకుండా వాటిని జాగ్రత్తగా భద్రపరిస్తే, అవి పిల్లల ఆరోగ్యానికి సంజీవనిలా పనిచేస్తాయంటున్నారు పరిశోధకులు.


పళ్లలోని స్టెమ్‌సెల్స్‌ను సేకరించేందుకు ఊడిపోయిన పాల దంతాలు ఎంతో ఉపయోగపడతాయి. స్టెమ్‌సెల్స్‌తో పిల్లలు పెద్దయ్యాక వ్యాధుల బారిన పడకుండా చూసుకోవచ్చు అంటున్నారు. శరీరంలో దెబ్బతిన్న కణాలను భర్తీ చేయడం ఎంతో ముఖ్యం. స్టెమ్‌సెల్స్ వివిధ రకాల కణాలుగా రూపాంతరం చెందుతాయి. పాల దంతాల్లోని స్టెమ్‌సెల్స్‌ను ఉపయోగించి, కొత్త కణాలను ఉత్పత్తి చేయొచ్చు. ఇవి భవిష్యత్తులో ఎదురయ్యే, ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి. క్యాన్సర్ వ్యాధి నుంచి బయటపడేందుకు కూడా స్టెమ్‌సెల్స్ ఉపయోగపడతాయని అంటున్నారు పరిశోధకులు.

ముత్యాలముగ్గు

బి.లక్ష్మి
కూకట్‌పల్లి,
హైదరాబాద్



17 చుక్కలు
3 వరుసలు
3 వచ్చేవరకు



13 చుక్కలు
5 వరుసలు
5 నిలువు

కె.లక్ష్మీ తులసి
రైల్వేకోడూరు, కడప జిల్లా

ముగ్గులు పంపాల్సిన చిరునామా
నవ్య, ముత్యాలముగ్గు,
ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70,
హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.
ఈ-మెయిల్: navya@andhrajyothy.com

ట్రెండ్

స్టయిల్ మాస్టర్



"నీకు ఎవరితో డేటింగ్ చేయాలని ఉంది?" అని బాలీవుడ్ హీరో సైఫ్ అలీఖాన్ కుమార్తె సారా అలీ ఖాన్‌ను అడిగాడు కరణ్ జోహార్. తడుముకోకుండా సారా చెప్పిన సమాధానం విని అందరూ అవాక్కయ్యారు. సాధారణంగా అమ్మాయిలు రణ్‌బీర్ కపూర్, హృతిక్ రోషన్ పేర్లు చెప్పడం వింటూ ఉంటాం. కానీ సారా అలీఖాన్ 'కార్తీక్ ఆర్యన్' అంటూ ఓ వర్ధమాన హిందీ హీరో పేరు చెప్పింది. అయితే అతని సినీ కెరీర్ వయసు పట్టుమని పదేళ్లు కూడా లేదు. ఇప్పటి వరకూ చేసినవి ఏడు సినిమాలు మాత్రమే. 2011లో విడుదలైన 'ప్యార్ కా పంచనామా' చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టాడు. తాజాగా అతను నటించిన 'సోనూ కె టీటూ కీ స్వీటీ' మంచి విజయం సాధించడంతో మళ్లీ ఫోకస్‌లోకి వచ్చాడు. 'కాఫీ విత్ కరణ్ ' ఆరో సీజన్‌లో తండ్రితో కలిసి ఓ ఎపిసోడ్‌లో పాల్గొన్న సారా సడన్‌గా కార్తీక్ పేరు ఎత్తడం సంచలనంగా మారింది. అంతేకాదు అనుకోకుండా ఓ పెళ్లి వేడుకకు ఈ ఇద్దరూ హాజరయ్యారు. ఆ వేడుకలో పాల్గొన్న హీరో రణవీర్‌సింగ్ ఒకరినొకరికి పరిచయం చేశాడు. ఆ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. అందుకేనేమో కార్తీక్‌కు బాలీవుడ్‌లో ఉన్న క్రేజ్‌ను గమనించి 'కాఫీ విత్ కరణ్' షోకు ఆహ్వానించారు కరణ్ జోహార్. బాలీవుడ్ కథానాయిక కృతీసనన్ ('1 నేనొక్కడినే' ఫేమ్) కూడా అతిథిగా హాజరయ్యారు. ఇక ఆ షోలో పాల్గొన్న కార్తీక్ డ్రెస్సింగ్‌కు నెటిజన్లు ఫిదా అయ్యారు. ఎందుకంటే అతను ధరించిన వెల్వెట్ జాకెట్ ఖరీదుతో మనం నాలుగు సార్లు లండన్ నగరానికి వెళ్లి రావచ్చు. జపాన్‌కు చెందిన లగ్జరీ బ్రాండ్ 'మాస్టర్ మైండ్'కి ప్రపంచ వ్యాప్తంగా ఎంతో పేరు ఉంది. ప్రమాదానికి సంకేతమైన 'పుర్రె' బొమ్మ ఈ కంపెనీ లోగో. ఈ సింబల్ ఉంటే చాలు మాస్టర్‌మైండ్ అని టక్కున గుర్తుపట్టేస్తారు ఫ్యాషన్ ప్రియులు. ఇంతకీ కార్తీక్ ధరించిన జాకెట్ ధర సుమారు రూ.7 వేల డాలర్లు (రూ. 5 లక్షలు).

బెటర్ లైఫ్

ఎన్నేళ్లు గడిచినా ఇంతేనా?

నాకు 27 ఏళ్లు. ఎంబీఏ పూర్తయింది. ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నా. బతకడానికి అది తప్పనిసరి కావడం వల్ల తప్ప ఆ ఉద్యోగం పట్ల నాకు ఆసక్తి లేదు. ఎంతసేపూ అందులో నుంచి ఎప్పుడు బయటపడాలా అనే ఆలోచనే! అయితే, ప్రతి జనవరి ఫస్ట్‌న ఈ సంవత్సరం అద్భుతంగా ఏదో ఒకటి చేయాలనుకుంటాను. ఐదేళ్లుగా ఇలా అనుకుంటూనే ఉన్నా. కానీ, ఒక్క అడుగైనా ముందుకు పడలేదు. ఎప్పటికీ ఇంతేనా? అనే నైరాశ్యం వేధిస్తోంది. ఒక్క ఏడాదిలోనే ఎంతో ఎత్తుకు ఎదిగిన వాళ్లు నా కళ్లముందు ఎందరో ఉన్నారు. నా విషయంలో ఎందుకు అలా జరగడం లేదు?

- ఎన్.రాకేశ్, ఖమ్మం



ఇదేదో మీ ఒక్కరి పరిస్థితి అనుకోవద్దు. ఈ తరహా ఆవేదన సమాజంలోని అత్యధికుల్లో కనిపిస్తుంది. ఆలోచనకూ, ఆచరణకూ మధ్యన ఉండే అగాధమే అందుకు కారణం. కనీసం ఏదో ఒకటి చేయాలన్న తపనైనా మీలో ఉంది. అది అభినందనీయమే. కాకపోతే, ఎంతసేపూ ఆరాట పడటమే తప్ప, అసలు ఏం చేయాలనుకుంటున్నారో మీకు ఇంత వరకూ ఒక స్పష్టత ఉన్నట్లు లేదు. ఆ అస్పష్టతే మీ అడుగు ముందుకు పడకుండా చేస్తోంది. అనుకున్నది వాస్తవరూపం దాల్చడం ఒక సుదీర్ఘ ప్రక్రియ. పకడ్బందీ ప్రణాళిక వేసుకుని, దానికి అనుగుణంగా ముందుకు సాగాలి. ఫలానా పనిచేయాలని పక్కాగా అనుకోకపోవడం మీ సమస్య. అలాగని ఏదో ఒకటి అనేసుకుంటే సరిపోదు. దానికి సంబంధించిన వనరులు సమకూర్చుకొని, సామర్థ్యం పెంపొందించుకోవాలి. అప్పుడే అడుగులు ముందుకు పడతాయి. ఏడాదిలోనే ఎంతో ఎదిగిన వాళ్లు మీ కళ్లముందు ఉన్నారంటున్నారు. ఆ ఎదుగుదల బయటికి కనపడటం ఏడాది నుంచే కావచ్చు. కానీ, దానికి చాలా కాలం క్రితమే బీజం పడి ఉంటుంది. ఇదంతా విషయ పరిజ్ఞానం వల్ల సాధ్యమవుతుంది. ఆ జ్ఞానమే ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. అది మీ అడుగులు ముందుకు సాగేలా చేస్తుంది. ముందు మీరు ఏం చేయాలనుకుంటున్నారో స్పష్టతకు రండి. అప్పుడే కార్యాచరణ మొదలు పెట్టండి.

- డాక్టర్ ప్రవీణ్‌కుమార్ చింతపంటి
కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్, ట్రాంక్విల్ మైండ్ క్లినిక్, మాదాపూర్, హైదరాబాద్

navya@andhrajyothy.com

సర్వే సారం



'డ్రై' జనవరి!

కొత్త సంవత్సరం వచ్చిందంటే కొత్త ఉషస్సు, కొంగొత్త ఆలోచనలు! గడిచిపోయిన సంవత్సరంలో సాధించలేని పనులను ఈ ఏడాదిలో పూర్తిచేయాలనే పట్టుదలను పెంచి, ప్రేరణ ఇచ్చే ఎనర్జీ డ్రింక్ కూడా. ఆరోగ్యానికి హాని కలిగించే పాత అలవాట్లను మానేసి... కొత్త జీవితానికి శ్రీకారం చుట్టాలని భావిస్తారు చాలామంది. అలాంటి నిర్ణయాల్లో ముఖ్యమైనది మద్యానికి గుడ్‌బై చెప్పడం! ఈ మంచి ఆలోచనేదైనా మీకూ కలిగితే ఇంతకు మించిన సందర్భం మరొకటి ఉండదంటున్నారు 'సర్వే' జనులు. జనవరి మాసమంతా మద్యం ముట్టని వారు ఆ ఏడాదంతా ఇక దాని జోలికి వెళ్లరని అమెరికాకు చెందిన సస్సెక్స్ యూనివర్సిటీ పరిశోధక బృందం. '2018 డ్రై జనవరి ఛాలెంజ్'లో భాగంగా 800 మందిపై జరిపిన అధ్యయన ఫలితాలను వారు వెల్లడించారు. జనవరిలో మందుకు నో చెప్పడం వల్ల ఎక్కువ ఎనర్జీ, చక్కని నిద్రతో పాటు ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు కూడా అలవడతాయని తేల్చారు. జనవరిలో మద్యం సేవించనివారు... ఆగస్ట్ వరకూ మందు ఊసే ఎత్తలేదట! దీంతో చాలామందిలో డబ్బు ఆదాతో పాటు, కంటి నిండా నిద్ర, బరువు తగ్గడం వంటి మార్పులు కనిపించాయట. ఆశ్చర్యకరమైన విషయమేమంటే... నెలలో అన్ని రోజులూ మద్యం సేవించేవారు కూడా ఆల్కహాల్ తీసుకోలేదట.

వినూత్నం

ఇంజనీరింగ్, ఆ తరువాత పీజీ. మంచి ఉద్యోగం వచ్చింది. కొలువులో కూర్చుని పని మొదలు పెడితే కానీ తెలియలేదు... ప్రోగ్రామింగ్‌లో తామెంత వెనకబడి ఉన్నామో! చదువుకునే రోజుల్లో సబ్జెక్టు సరిగ్గా వంటబట్టించుకోకపోవడమే ఇందుకు కారణమని అర్థమైంది. తమ సమస్య నేటి విద్యార్థులకు రాకూడదని భావించిన ముగ్గురు యువకులు అంకుర సంస్థ 'క్యూటిపై'కి శ్రీకారం చుట్టారు. ఇప్పుడు వందల మంది చిన్నారులను రోబోటిక్స్‌తో మమేకం చేస్తున్న ఆ సంస్థ వెనక ఉన్న ముగ్గురిలో ఒకరైన తెలుగు యువకుడు ఆరె రఘునాథ్ మాటల్లోనే ఆ ప్రయాణం...





పిల్లల కోసం రోబోట్రిక్స్

మాది గుంటూరు జిల్లా కాకమాను మండలం అప్పాపురం. నేను గుంటూరులో ఇంటర్ చదువుతున్న రోజుల్లోనే నాన్న నాగేశ్వరరావు మరణించారు. అమ్మ భవాని గృహిణి. అన్నయ్య వ్యవసాయం చేపట్టి కుటుంబానికి అండగా నిలిచాడు. దాంతో బాపట్ల ఇంజనీరింగ్ కాలజీలో ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో బీటెక్ పూర్తి చేయగలిగాను. 'గేట్'లో మంచి ర్యాంకు రావడంతో బెంగుళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో చేరాను. అక్కడ ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో ఎంటెక్ చేశాను.

కొలువులో కొత్త ఆలోచనలు...

ఎంటెక్ తరువాత 'యాహూ'లో ఉద్యోగం వచ్చింది. అక్కడ కొంత కాలం పనిచేసి, మైక్రోసాఫ్ట్‌కు మారాను. ఇక్కడ ఓ విషయం చెప్పాలి... నేను ఎంటెక్ చదివినా ప్రోగ్రామింగ్ సరిగా చేయలేకపోతున్నా. ఉద్యోగంలో చేరాక కానీ అందులో వీక్‌గా ఉన్నానన్న విషయం నాకు అర్థం కాలేదు. నేనే కాదు... యాహూలో పరిచయమైన సహోద్యోగి జర్లిన్ పరిస్థితి కూడా అదే! పైపై చదువులు కాకుండా మూలాలు అర్థం చేసుకోవాలి. ఆ మూలాలు అర్థం కావాలంటే ప్రోగ్రామింగ్‌పై మంచి అవగాహన ఉండాలి. కానీ ఇప్పుడు ఎంతమందికి దానిపై అవగాహన ఉంది? అలాగే ఒక మంచి ఉత్పత్తి ఎంతోమందికి చేరువవుతుందని యాహూలో చేస్తున్నప్పుడే తెలిసింది. అక్కడ మేం అభివృద్ధి పరిచిన ఒక సెర్చ్ ఇంజినే అందుకు ఉదాహరణ. ఈ క్రమంలో మా ఫ్రెండ్ జర్లిన్ కజిన్ జేసిన్ కూడా మాతో జత కలిశాడు. మా ఆలోచనలు పంచుకున్నాడు.

అక్కడే అర్థమైంది...

ఉద్యోగం చేస్తున్న రోజుల్లో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల నైపుణ్యాలపై నివేదికలు చదివేవాళ్ళం. ఉద్యోగానికి అవసరమయ్యే నైపుణ్యం వారిలో చాలా తక్కువగా ఉందని ప్రతి నివేదికలోనూ చూశాం. ముఖ్యంగా కమ్యూనికేషన్, కంప్యుటేషన్ స్కిల్స్ అవసరమైన మేర లేవని తేలింది. మూడు మూళ్ళు తొమ్మిది అని చెప్పడం వెనక ఉన్న ప్రోగ్రామింగ్ తెలిస్తే లెక్కలు మరింత సులువు అవుతాయి. అసలు ఆ స్థాయి నుంచే ప్రతీది లోతుగా తెలుసుకునే విధంగా పిల్లలను ప్రోత్సహిస్తే ప్రోగ్రామింగ్, తద్వారా సృజనాత్మకత పెరుగుతుందనిపించింది. దాంతో ఆ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టాం.

ప్రోగ్రామింగ్‌పై అవగాహన...

ఆ తరువాత అపార్టుమెంట్లలో కొందరు పిల్లను కలిసి ప్రోగ్రామింగ్‌పై అవగాహన కల్పించే ప్రయత్నం చేశాం. అయితే ఆ అవసరాన్ని గుర్తించేలా చేయడం మావల్ల కాలేదు. ప్రత్యామ్నాయంపై చేస్తున్న ఆలోచనలో భాగంగా ఆటలతో పిల్లలను ఆకట్టుకోగలమనిపించింది. ఆ వయస్సులో పిల్లలకు ఆటలపైనే ఆసక్తి. ఆటతో మొదలుపెట్టి ప్రోగ్రామింగ్ దిశగా మరల్చాలని నిర్ణయించాం. కారును రూపొందించడం ఒక ఆట అనుకుంటే, అందుకు మెటీరియల్ ఏమిటి అన్న విషయమై తర్జనభర్జన చేశాం. మార్కెట్లో ఏదైనా మెటీరియల్ అవసరమైనది ఉందా అని వాకబు చేశాం. చాలా రకాలు సేకరించాం. అయితే అవన్నీ ఒక నిర్దేశిత మోడల్ ప్రకారం రూపొందించేందుకు ఉపకరించేవే కావడంతో నిరుత్సాహపడ్డాం.

బ్లాక్స్‌తో ప్రయోగం...

చివరకు ఏ వస్తువునైనా రూపొందించేందుకు అనువైన విధంగా బ్లాక్స్ రూపొందించాం. పద్నాలుగు బ్లాక్స్‌తో పిల్లలు తమ ఆలోచన మేరకు వస్తువులను రూపొందించుకోవచ్చనే విషయం గ్రహించాం. వస్తువు రూపొందుతుంది సరే... దాని కదలిక మాటేమిటి. కూర్చుకున్న కారు కదలాలంటే ప్రోగ్రామింగ్ అవసరం. అలా ప్రోగ్రామింగ్ వైపు పిల్లల మనసు మళ్లేలా చూడగలిగాం. కుడి, ఎడమ వైపు తిరగాలి, వేగం పెంచుకోవాలి. సడన్‌గా ఆపాలి. ఇలా అన్నింటికీ ప్రోగ్రామింగ్ అవసరం. సరైన ప్రోగ్రామింగ్ రాసుకుని, ఆండ్రాయిడ్ ఫోన్‌తో... తయారు చేసిన వస్తువులో కదలిక తేవచ్చు. ఇలా సక్సెస్ అయ్యాం. కర్ణాటకలో మొదలుపెట్టి ఇప్పుడిప్పుడే తెలుగు రాష్ట్రాల్లోకి వస్తున్నాం.

వెనకడుగు వేయలేదు...

మైక్రోసాఫ్ట్‌లో మంచి జీతం, అమెరికా ఛాన్సు వదులుకుని ఇదేం పని అని సహోద్యోగులు, స్నేహితులే కాదు... కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వద్దని వారించారు. కొందరైతే అవహేళనగా మాట్లాడారు. అయినా మేం వెనకడుగు వేయలేదు. మా ప్రొడక్ట్‌పై మాకు విశ్వాసం. మొదట్లో ఏడు వందల మందిని ఆకట్టుకోగలిగాం. ఇప్పుడు ఆ సంఖ్య ఏడు వేలకు చేరింది. అందుకు రెండున్నరేళ్లు పట్టింది. ఇప్పటికి లాభాలు కాదు కదా, జీతం కూడా తీసుకోవటం లేదు. అయినప్పటికీ సక్సెస్ మా ముందు కనిపిస్తోంది. రాబోయే రెండేళ్లలో మా ఉత్పత్తి 75వేల మందికి చేరువ కాగలదని భావిస్తున్నాం. ఒకప్పుడు వెబ్‌సైట్లకే పరిమితమైన ఈ వ్యవహారాన్ని ఆధునిక సాంకేతికత సహాయంతో పోర్టల్స్ మొదలుకుని పరికరాలతో వివిధ రూపాల్లో లెర్నింగ్ ప్రాసెస్‌ను పరిపుష్టం చేస్తున్నాం. ఆ క్రమంలో సరికొత్తగా ముందుకు వచ్చినదే రోబోటిక్స్ మెథడ్! కర్ణాటకలో మంత్రులు కూడా మా వర్క్‌పై ఆసక్తి కనబరుస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో...

కర్ణాటకలో పేరున్న పాఠశాలలకు మొదట దీన్ని పరిచయం చేశాం. ప్రస్తుతం ఏపీ, తెలంగాణలోని పాఠశాల్లోనూ ప్రవేశపెడుతున్నాం. ఏపీలో భాష్యం స్కూల్స్, హైదరాబాద్‌లో జూబ్లీ పబ్లిక్ స్కూల్ వంటివి దీన్ని అడాప్ట్ చేసుకున్నాయి. సైన్స్, మేథమెటిక్స్ పాఠాలను సులువుగా ఆకళింపు చేసుకునేందుకు ఈ విధానం ఉపయోగపడుతుంది. మేమే కొన్ని బృందాలను ఏర్పాటు చేసి, తర్ఫీదు ఇస్తున్నాం. ఇందుకోసం ఒక్కో విద్యార్థి నుంచి ఏటా రూ.2.200 వసూలు చేస్తున్నాం. మొత్తం కిట్ రూ.15వేలు. వ్యక్తిగతంగా కొనుగోలు చేసేవారికి పరిమిత పరికరాలతో రూ.6 వేలకు కిట్ అందిస్తున్నాం.

ఇదీ 'క్యూటిపై'...

'క్విక్ టు ప్రోటోటైప్ ఐడియా' (క్యూటీపీఐ/ క్యూటిపై) పేరిట ఏర్పాటైన అంకుర సంస్థ. రోబోటిక్స్‌తో సబ్జెక్టు అర్థమయ్యే విధానానికి శ్రీకారం చుట్టాం. పద్నాలుగు వేర్వేరు డిజైన్లతో అనుకున్న వస్తువును రూపొందించుకోవచ్చు. చేసిన వస్తువు పని చేసేందుకు ఎలక్ట్రానిక్ ప్రాసెసర్‌తో అనుసంధానం కూడా ఇందులో భాగమే. ఈ విధానంలో ప్రోటోటైప్ అంటే బేసిక్స్ మాత్రమే. ఉదాహరణకు కారునే తీసుకుంటే ప్రోటోటైప్ మాదిరిగానే కాకుండా విద్యార్థి తన ఆలోచనలకు దగ్గరకు మరొకటి రూపొందించవచ్చు. ఒంటబట్టించుకున్న పరిజ్ఞానంతో ప్రయోగాలు, మెరుగైన ఫలితాల సాధన లెర్నింగ్ ప్రాసెస్‌లో భాగం. దానికి అనుగుణంగా ప్రోగ్రామింగ్‌పై అవగాహన కల్పిస్తూ, ఆలోచనలకు రూపం ఇచ్చేలా తీసుకువచ్చిందే 'క్యూటిపై'. స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథ్స్) విధానంపై దృష్టిపెడుతూనే విశ్లేషణాత్మకంగా ఆలోచించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాం.

కొత్త బండి గురూ!

వేగానికి వేగం... లుక్‌కు లుక్... హైఎండ్ బైక్‌ల సొంతం. వీటిపై మనసు పారేసుకొనే కుర్రకారు జోష్‌ను ఈ కొత్త సంవత్సరంలో రెట్టింపు చేసేందుకు సిద్ధమైంది హోండా కంపెనీ. 2019లో తమ సీబీయూ (కంప్లీట్ బిల్డ్ యూనిట్)ను ఆవిష్కరించబోతోంది. ఈ సీబీయూ లైనప్‌లో సీబీ1000ఆర్+, గోల్డ్ వింగ్ టూర్ డీ డీసీటీ, సీబీఆర్ 1000ఆర్‌ఆర్ ఫైర్‌బ్లేడ్ ఉన్నాయి. ఇప్పటికే ఎక్స్‌క్లూజివ్ వింగ్ వరల్డ్ సేల్స్ అండ్ సర్వీస్ అవుట్‌లెట్స్ వద్ద బుకింగ్స్ ప్రారంభించింది. యువతరమే టార్గెట్‌గా వస్తున్న ఈ నవ తరం బైక్స్‌పై ఓ లుక్కేద్దాం రండి...

ఈ స్పీడ్‌కు బ్రేక్‌లు లేవు



హోండా సీబీఆర్ 1000ఆర్‌ఆర్ ఫైర్‌బ్లేడ్

హోండా సీబీఆర్1000 ఆర్‌ఆర్ ఫైర్‌బ్లేడ్‌లో 'వీలీ కంట్రోల్ సిస్టమ్' పరిచయం చేశారు. ఇది అత్యధిక భద్రత, యాక్సెలరేషన్ అందిస్తుంది. అంతేకాదు... ఎలక్ట్రిక్ నియంత్రణ తరువాత టైమ్ లాగ్‌ను సైతం గణనీయంగా తగ్గించడం వల్ల అత్యధిక వేగం వద్ద అత్యుత్తమ నియంత్రణ సైతం లభిస్తుంది. 1000 సీసీ ఇన్-లైన్ 4-సిలిండర్ ఇంజిన్ గరిష్ఠంగా 13వేల ఆర్‌పీఎం వద్ద 141 కిలోవాట్లు; 11వేల ఆర్‌పీఎం వద్ద 114ఎన్ఎం టార్క్‌ను అందిస్తుంది. ఇది సిక్స్ స్పీడ్ ట్రాన్స్‌మిషన్‌తో పనిచేస్తుంది. ఫుల్ కలర్ టీఎఫ్‌టీ లిక్విడ్ క్రిస్టల్ డాష్‌ను ఫైర్‌బ్లేడ్ ఉపయోగించుకోవడం వల్ల స్పష్టంగా సమాచారం రైడర్‌కు లభిస్తుంది. నూతన హోండా సీబీఆర్ 1000 ఆర్‌ఆర్ ఫైర్‌బ్లేడ్ రెండు రంగులు- గ్రాండ్ ప్రిక్స్ రెడ్, మాట్ బాలిస్టిక్ బ్లాక్ మెటాలిక్‌లో లభిస్తుంది. సీబీఆర్ 1000ఆర్‌ఆర్ ఫైర్‌బ్లేడ్ ధర రూ.16.43 లక్షలు. అలాగే ఇందులో మరో వెర్షన్ సీబీఆర్ 1000 ఆర్‌ఆర్ ఫైర్‌బ్లేడ్ ఎస్‌పీని కూడా హోండా తెస్తోంది. దీని ధర రూ.19.28 లక్షలు.

గోల్డ్ వింగ్ టూర్ డీ సీటీ

టూరింగ్ బైక్ అంటే ఇలానే ఉండాలనేలా హోండా గోల్డ్ వింగ్ రూపుదిద్దుకుంది. 2019 గోల్డ్ వింగ్ అథ్లెటిక్‌గా కనిపిస్తుంది. ఇందులో ఎలక్ట్రిక్ విండ్ స్క్రీన్ ఉంది. దీనిని ఎత్తు, యాంగిల్ కోసం మార్చుకొనే వీలుంది. దీంతోపాటు టూరింగ్ బైక్ ఫీచర్లను అందిస్తుంది. సాధారణంగా కార్లలో కనిపించే యాపిల్ కార్ ప్లే ఇంటిగ్రేషన్, యాంటీ లాక్ బ్రేక్స్ (ఏబీఎస్) స్టాండర్డ్ ఫీచర్లున్నాయి. ఈ ఫీచర్లు రైడర్లకు ప్రణాళిక చేసుకోవడానికి, అత్యంత సులభంగా సవారీ చేయడానికి అవకాశాన్ని కల్పిస్తాయి. సులభంగా వినియోగించే కంట్రోల్స్‌ను సెంట్రల్ కన్సోల్, హ్యాండిల్ బార్‌పై అమర్చింది. మారిన రోడ్డు పరిస్థితుల్లో కూడా సౌకర్యంగా సవారీ చేసే అవకాశం కల్పిస్తుందీ బైక్. దీనిలో 1833సీసీ ఫ్లాట్ 6-సిలిండర్ ఇంజిన్ గరిష్ఠంగా 92.7 కిలోవాట్ల శక్తిని 5500 ఆర్‌పీఎం వద్ద, 4500 ఆర్‌పీఎం వద్ద 170 ఎన్ఎం టార్క్‌ను అందిస్తుంది. 4-రైడ్ మోడ్స్ ఇంజిన్‌తో పాటు సస్పెన్షన్, కంబైన్డ్ బ్రేక్ సిస్టమ్ (సీబీఎస్) వంటివి ఎంచుకున్న మోడ్‌కు అనుగుణంగా మారుతుంటాయి. డీసీటీ (డ్యూయల్ క్లచ్ టెక్నాలజీ)లో 7-స్పీడ్స్, హిల్ స్టార్ట్ అసిస్ట్ (హెచ్ఎస్ఏ), ఐడల్ స్టాప్ వంటి ఫీచర్లూ ఉన్నాయి. రెడ్ కలర్‌లో లభిస్తున్న ఈ బైక్ ధర రూ.27.79 లక్షలు.





హోండా సీబీ1000ఆర్+

జపనీస్ కళాత్మక నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తూ హోండా సీబీ1000 ఆర్+ ఆకర్షణీయంగా ముస్తాబైంది. దీన్ని నియో స్పోర్ట్స్ కేఫ్ డిజైన్‌గా హోండా చెబుతుంది. కానీ... విలాసవంతమైన ప్యాకేజీలో చక్కటి పని తీరు, శైలి కోరుకునే రైడర్ల కోసం రూపకల్పన చేసినట్లుగా డిజైన్ కనిపిస్తుంది. కంపాక్ట్ శైలి ఎలిమెంట్స్ వాహనానికి మరింత లుక్‌నిస్తాయి. ఐకానిక్ ఫ్రంట్ ఎల్ఈడీ ఈ తరహా బైక్‌ల్లో సరికొత్త శైలికి మార్గమూ చూపవచ్చు. వెనుక వైపు ఫెండర్‌పై అమర్చిన స్వింగ్ ఆర్మ్‌కు తోడు నెంబర్ ప్లేట్ బైక్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. దీని నాలుగు సిలిండర్ల ఇంజిన్ గరిష్ఠ శక్తి 107 కిలోవాట్‌ను 10500 ఆర్‌పీఎం వద్ద, 104 ఎన్ఎం టార్క్‌ను 8250 ఆర్‌పీఎం వద్ద అందిస్తుంది. క్విక్ షిఫ్టర్, హీటెడ్ గ్రిప్స్, విస్తృత శ్రేణిలో ప్రీ-ఫిట్ ప్రీమియం యాక్సెసరీలైన మెటాలిక్ మీటర్ విజర్, సీల్‌కౌల్, ఫ్రంట్ ఫెండర్ ప్యానెల్, హగ్గర్ ప్యానెల్, రేడియేటర్ గ్రిల్ వంటివి ఉంటాయి. నూతన సీబీ1000ఆర్+ పూర్వమోడల్ డిజైన్ కన్నా తేలిగ్గా ఉన్నప్పటికీ పవర్ టు వెయిట్ రేషియో మాత్రం బాగా పెరిగింది. గ్రాఫైట్ బ్లాక్‌కలర్‌తో వస్తున్న దీని ధర రూ.14.46 లక్షలు (ఎక్స్‌షోరూమ్-ఢిల్లీ).

సెలబ్ స్టయిల్

అందాల దేవత



క్యాట్రియోనా గ్రే... గత ఏడాది విశ్వసుందరి కిరీటం అందుకున్న ఫిలిప్పీన్స్ బ్యూటీ. 'మిస్ యూనివర్స్' ఫైనల్స్‌లో ఆమె ధరించిన రెండు డ్రెస్‌లు అందర్నీ ఆకట్టుకున్నాయి. విశేషమేమిటంటే ఫిలిప్పీన్స్ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్‌తో మ్యాక్ టుమాంగ్ వీటిని రూపొందించారు. ఈ రెండింటిలో రెడ్ కలర్ గౌన్ ఒకటి చూపరులను బాగా ఆకర్షించింది. ఈ గౌన్ వెనుక ఓ కథ ఉంది. ఫిలిప్పీన్స్‌లో మయోన్ అనే అగ్నిపర్వతం ఉంది. ఇదొక యాక్టివ్ వ్యాల్కెనో. ప్రశాంతంగా ఉన్నప్పుడు ఎంత అందంగా ఉంటుందో, ఇది బద్దలై, లావా ఎగిసిపడుతున్నప్పుడు కూడా అంతే అద్భుతంగా ఉంటుంది. క్యాట్రియోనా ధరించిన గౌన్‌కి ఆ లావా ఎగిసిపడుతున్న దృశ్యాలే స్ఫూర్తిగా నిలిచాయని మాక్ టుమాంగ్ తెలిపారు. ఫిలిప్పీన్స్ పురాణాల్లోని 'దరగాంగ్ మగయాన్' అనే దేవత పేరు నుంచి వచ్చిందే మయోన్. అందుకే గ్రేను కూడా ఆ అందాల దేవతతో పోలుస్తున్నారు నెటిజన్లు.

డైలీ సుడోకు - 413

		5			7		6	
2			9	5	6	4		
	4	6						
8		2	4			6		7
4				6				3
5		1			3	2		4
						3	1	
		4	8	1	9			6
	7		6			9		

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.


సుడోకు- 412 సమాధానం

8	9	2	7	4	1	6	5	3
1	7	6	5	3	9	2	4	8
3	4	5	6	8	2	7	9	1
6	5	1	2	7	4	8	3	9
9	2	3	1	6	8	4	7	5
7	8	4	3	9	5	1	6	2
5	6	9	8	1	7	3	2	4
4	1	7	9	2	3	5	8	6
2	3	8	4	5	6	9	1	7



'వినయ విధేయ రామ'లో కియారా అడ్వాణీ, రామ్‌చరణ్

ఆవిరి... దెయ్యమా?



హారర్ చిత్రాలు తీయడంలో రవిబాబుది అందెవేసిన చేయి! 'అనసూయ', 'అమరావతి', 'అవును', 'అవును 2' చిత్రాలతో... భయపడి వినోదం పొందాలనుకునే ప్రేక్షకులను అలరించారు. మరోసారి హారర్ చిత్రం తీయడానికి ఆయన సన్నాహాలు చేస్తున్నారని సమాచారం! నూతన సంవత్సరం సందర్భంగా ఫ్లయింగ్ ఫాగ్స్ పతాకంపై తన స్వీయ దర్శకత్వంలో 'ఆవిరి' చిత్రాన్ని తెరకెక్కించనున్నట్టు రవిబాబు ప్రకటించారు. కాన్సెప్ట్ పోస్టర్‌నూ విడుదల చేశారు. అందులో ఓ గాజు సీసాలో బంధించిన అమ్మాయి... కాస్త తెరచిన మూతలోంచి ఆవిరి బయటకు వెళ్తున్నట్టుంది. ఇది హారర్ చిత్రమనీ, ఆ అమ్మాయి ఆత్మ అని కృష్ణానగర్ ఖబర్!! మరికొన్ని రోజుల్లో నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలు వెల్లడిస్తామని రవిబాబు తెలిపారు.

'కల్కి' కదిలాడు



రాజశేఖర్

'పి.ఎస్.వి.గరుడవేగ' వంటి సూపర్‌హిట్ తర్వాత రాజశేఖర్ నటిస్తున్న చిత్రం 'కల్కి'. 'అ!'తో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ప్రశాంత్‌వర్మ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సి.కల్యాణ్, శివానీ రాజశేఖర్, శివాత్మిక రాజశేఖర్ నిర్మాతలు. ఆదాశర్మ, నందితా శ్వేత కథానాయికలు. మంగళవారం ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను రాజశేఖర్ ట్విట్టర్ వేదికగా విడుదల చేశారు. 'కల్కి' ఫస్ట్ అవతార్‌ను విడుదల చేయడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. 1983 బ్యాక్‌డ్రాప్‌లో ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్నారు. ఈ మోషన్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి 'కదిలినాడు కల్కి' అని రాసుకొచ్చారు దర్శకుడు ప్రశాంత్ వర్మ. నాజర్, అశుతోష్ రానా కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: దాశరధి శివేంద్ర, సంగీతం: శ్రవణ్ భరద్వాజ్.



తెలుగు 'బర్ఫీ'లో?

తెలుగు ప్రేక్షకులకు హిందీ బర్ఫీ రుచి చూపించడానికి నాగచైతన్య అంగీకరించారని ఫిల్మ్‌నగర్ టాక్! ఆయుష్మాన్ ఖురానా, రాజ్‌కుమార్ రావ్ హీరోలుగా, 'వన్ నేనొక్కడినే' ఫేమ్ కృతీ సనన్ హీరోయిన్‌గా నటించిన హిందీ హిట్ 'బరేలీ కి బర్ఫీ'. ఈ సినిమా తెలుగు రీమేక్ హక్కులను రచయిత కోన వెంకట్‌కి చెందిన కోన ఫిల్మ్ కార్పొరేషన్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ సొంతం చేసుకున్నాయి. ఇందులో ఓ హీరోగా నాగచైతన్య నటించనున్నట్టు, నిర్మాతల ప్రతిపాదనకు ఆయన అంగీకరించినట్టు సమాచారం! ప్రస్తుతం తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టు కోన వెంకట్ కథలో మార్పులు చేస్తున్నారట! త్వరలో పూర్తి వివరాలు వెల్లడించనున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం నాగచైతన్య 'మజిలీ', 'వెంకీమామ' చిత్రాల్లో నటిస్తున్నారు. అవి పూర్తి కాగానే ఈ సినిమా పట్టాలు ఎక్కే అవకాశం ఉంది. ఇప్పుడు నాగచైతన్య, సమంత అమస్టర్‌డామ్‌లో ఉన్నారు. కొత్త ఏడాదికి అక్కడ స్వాగతం పలికారు.

ఆడ పులి!



నయనతార

నయనతార నటించిన మలయాళ చిత్రం 'ఎలెక్ట్రా' చిత్రాన్ని 'లేడీ టైగర్' పేరుతో ఈ నెల 4న తెలుగులో విడుదల చేస్తున్నారు నిర్మాత సురేశ్ దూడల. సి.ఆర్. రాజన్ సమర్పణలో సురేశ్ సినిమా పతాకంపై విడుదల కానున్న ఈ చిత్రంలో ప్రకాశ్‌రాజ్, మనీషా కొయిరాల, బిజూ మీనన్ ప్రధాన పాత్రల్లో నటించారు. నిర్మాత సురేశ్ దూడల మాట్లాడుతూ "నయనతార అభిమానులకు పండుగలాంటి చిత్రమిది. మనీషా కొయిరాల నటన, ప్రకాశ్‌రాజ్ ద్విపాత్రాభినయం చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి" అన్నారు. ఈ చిత్రానికి శ్యామ్‌ప్రసాద్ దర్శకుడు.

కన్నుమూసిన బాలీవుడ్ దిగ్గజం



ఖాదర్‌ఖాన్

పాత సంవత్సరం వెళ్లిపోతూ ఓ ప్రతిభాశాలిని తన వెంట తీసుకుపోయింది. నటుడిగా, మాటల రచయితగా దాదాపు రెండు దశాబ్దాల పాటు హిందీ చిత్రరంగంలో ఓ వెలుగు వెలిగిన ఖాదర్‌ఖాన్ (81) సోమవారం సాయంత్రం తుది శ్వాస విడిచారు. కొంతకాలంగా ఆయన శ్వాసకోస వ్యాధితో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని ఖాదర్ ఖాన్ కుమారుడు సర్ఫరాజ్ వెల్లడించారు. కుటుంబ సభ్యులంతా కెనడాలోనే ఉండటం వల్ల అంత్యక్రియలు ఇక్కడే జరుపుతామని ఆయన తెలిపారు. అఫ్గానిస్థాన్‌లోని కాబూల్‌లో జన్మించిన ఖాదర్ ఖాన్ 1970 నుంచి 1975 మధ్యకాలంలో ఓ ఇంజనీరింగ్ కాలేజ్‌లో లెక్చరర్‌గా పనిచేశారు. ఆ కాలేజ్‌లో జరిగిన ఓ ఫంక్షన్‌లో ఖాన్ వేసిన నాటకం చూసి దిలీప్‌కుమార్ ఆయన్ను పిలిపించి తన తర్వాతి చిత్రంలో అవకాశం ఇప్పించారు. ఆ తర్వాత 1973లో 'ధాగ్' చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి 300లకు పైగా చిత్రాల్లో నటించారు. 250పైగా సినిమాలకు డైలాగులు రాశారు. మాటల రచయితగా ఆయన మొదటి సినిమా 'జవానీ దివానీ'. 1974లో 'రోటీ' చిత్రానికి డైలాగ్‌లు రాసినందుకు హీరో రాజేశ్ ఖన్నా, దర్శకుడు మన్మోహన్‌దేశాయి లక్షా ఇరవై ఒక్క వెయ్యి రూపాయలు పారితోషికంగా ఇవ్వడం ఆ రోజుల్లో చర్చనీయాంశమైంది. హాస్య పాత్రలకు పేరుగాంచిన ఖాన్, దర్శకుడు డేవిడ్ ధావన్ సినిమాల్లో ఎక్కువగా నటించారు. కడుపుబ్బ నవ్వించే పాత్రలనే కాదు సాఫ్ట్ విలనీ పాత్రలనూ ఆయన పోషించి మెప్పించారు. అమితాబ్‌తో పాటు రాజేశ్ ఖన్నా, జితేంద్ర, ఫిరోజ్ ఖాన్, అనిల్ కపూర్, గోవిందా తదితర ప్రముఖ నటులతో ఆయన స్క్రీన్ షేర్ చేసుకున్నారు. తెలుగు చిత్ర ప్రముఖులు కోవెలమూడి బాపయ్య, దాసరి నారాయణరావు, రాఘవేంద్రరావు, తాతినేని రామారావు తదితరులు హిందీలో తీసిన చిత్రాలకు ఆయనే సంభాషణలు రాశారు. 2001లో సొంతంగా 'హస్నామత్'తో హాస్యం ప్రధానమైన టీవీ సిరీస్ మొదలుపెట్టారు. 'మస్తీ నహీ సస్తీ' హిందీలో ఆయన నటించిన చివరి చిత్రం.

ఖాదర్ ఖాన్ మరణం మనసుకి ఎంతో బాధ కలిగించింది. మా కాంబినేషన్‌లో 'అమర్ అక్బర్ ఆంటోని', 'ముకద్దర్ కా సికిందర్', 'గంగా జమున సరస్వతి', 'కూలీ', 'లావరీస్', 'దేశ్ ప్రేమి', 'సుహాగ్', 'పర్వరీశ్' వంటి హిట్ చిత్రాలొచ్చాయి. గొప్ప స్టేజ్ ఆర్టిస్ట్ ఆయన. రచయితగా ఆయన ప్రతిభను మాటల్లో చెప్పలేను. మంచి మిత్రుణ్ణి కోల్పోయా. ఖాన్ ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నా" అని అమితాబ్ బచ్చన్ ట్విట్టర్‌లో రాసుకొచ్చారు.


మంచి మిత్రుణ్ణి కోల్పోయా

- కె.బాపయ్య




ఖాదర్‌ఖాన్ మంచి రచయిత, నాకు మంచి మిత్రుడు కూడా. నేను దర్శకత్వం చాలా హిందీ చిత్రాలకు రచయితగా, నటుడిగా పనిచేశారు. స్టేజీ నుంచి వచ్చిన వ్యక్తి కావడంతో ఎమోషనల్ డైలాగులు బాగా రాసేవారు. కాకపోతే ఆయన లెంగ్తీ డైలాగులు రాసేవారు. పది డైలాగుల్లో చెప్పాల్సిన విషయాన్ని నాలుగు మాటల్లో క్లుప్తంగా, పవర్‌ఫుల్‌గా చెబితే బాగుంటుందని సూచించేవాడిని. జంట రచయితలు సలీమ్-జావేద్ రచనాశైలిని పరిశీలించమని చెప్పేవాడిని. నా మాట పాటించేవారు. దర్శకుడికి ఏం కావాలో దానికి అనుగుణంగా మెలిగిన వ్యక్తి. నిర్మాతలను ఇబ్బంది పెట్టని రచయిత, నటుడు. ఇతరుల విషయాల్లో జోక్యం చేసకొనేవాడు కాదు. తన పని తప్ప మిగిలిన విషయాల గురించి ఆలోచించ లేదెప్పుడూ. మనిషికి కొంచెం కోపం ఎక్కువ కానీ దాని ప్రభావం ఇతరుల మీద పడకుండా జాగ్రత్త పడేవారు. తను రచన చేసే సినిమాల్లో ఖాదర్ ఖాన్ నటించేవారు. అయితే 'తన పాత్రలకు పెద్ద డైలాగులు, పవర్‌ఫుల్ డైలాగులు రాసుకొని, మిగిలిన పాత్రలకు అంత ప్రాధాన్యం లేని డైలాగులు రాసేవారని కంప్లయింట్ ఆయన మీద ఉండేది కానీ నా సినిమాల్లో ఎప్పుడూ అలా చేయలేదు. బాగా చదువుకొని వచ్చిన వ్యక్తి కావడంతో క్రమశిక్షణతో మెలిగేవారు. ఒక మంచి మిత్రుణ్ణి కోల్పోయినందుకు బాధగా ఉంది'

నివాళి..



మృణాల్ సేన్

భారతీయ సినిమాకు అంతర్జాతీయంగా ఖ్యాతి తెచ్చిన ముగ్గురు బెంగాలీ చిత్ర ప్రముఖుల్లో మృణాల్ సేన్ (1923-2018) ఒకరు. మిగిలిన ఇద్దరు సత్యజిత్ రాయ్, రుత్విక్ ఘటక్. బెంగాలీ, హిందీ సినిమాలతో పాటు ఒకే ఒక్క తెలుగు చిత్రానికి మృణాల్‌సేన్ దర్శకత్వం వహించారు. ఆ సినిమా 'ఒక ఊరికథ'. అందులో హీరోగా నటించిన నారాయణరావు, ఆ చిత్రానికి అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన ముత్యాల సుబ్బయ్య మృణాల్ సేన్‌తో తమకున్న అనుబంధాన్ని వివరించారిలా...



నెల రోజుల్లో 18 కిలోలు తగ్గా!

-నారాయణరావు

- మృణాల్ సేన్‌గారు దర్శకత్వం వహించిన 'మృగయా' చిత్రం మా అన్నయ్య ఆధ్వర్యంలో రూపుదిద్దుకొంది. అందుకే పరంధామరెడ్డిగారు ఆయనతో తెలుగులో సినిమా తీయాలనుకొన్నప్పుడు మా అన్నయ్య సహకారం అభ్యర్థించారు. 'ఒక ఊరి కథ' సినిమాలో నటించాలని కానీ, నటిస్తానని కానీ నేను అనుకోలేదు. ప్రొడక్షన్ సైడ్ ఆయనకు హెల్ప్ చేయాలనుకున్నాం అంతే. రియలిస్టిక్ ఎప్రోచ్‌తో నిర్మించే ఈ చిత్రంలో కమల్‌హాసన్ హీరో పాత్రకు బాగుంటాడని ఆయన్ని మృణాల్ సేన్ దగ్గరకు తీసుకెళ్లా. అయితే ఆ పాత్రకు భిన్నంగా, లావుగా కమల్ ఉండటంతో మృణాల్ వద్దనేశారు. ఆ తర్వాత రకరకాల పేర్లు అనుకున్నాం. ఎవరూ మృణాల్ సేన్‌కు నచ్చలేదు. ఒకరోజు అనుకోకుండా ఆయన నేను నటించిన 'నిజం' చిత్రం రషెస్ చూశారు.
- ఆ తర్వాత ఏమనుకున్నారో ఏమో ఉన్నట్లుండి 'అవునూ.. ఆ వేషం నువ్వెందుకు వేయకూడదూ' అని అడిగారు. నేను మనసులో చాలా హ్యాపీగా ఫీలయ్యా. 'మీరు వెయ్యమంటే వేస్తాను సార్' అన్నాను. 'నువ్వు ఓకే.. కానీ బాగా సన్నబడాలి' అని కండీషన్ పెట్టారు. నేను వెనక్కి తగ్గలేదు. 'సన్నబడతాను సార్.. కాకపోతే కొంచెం టైమ్ ఇవ్వాలి' అన్నాను. 'సరే.. నెల రోజులు టైమ్ ఇస్తా తీసుకో' అన్నారు. ఆ నెల రోజుల్లో 18 కిలోలు తగ్గాను. చొక్కా తీస్తే ఎముకలు కనిపించేలా ఉండాలని ఆయన అనడంతో అచ్చం అలాగే తయారయ్యాను.
- ఒక ఊరి కథ' చిత్రం మున్షీ ప్రేమ్‌చంద్ రాసిన 'కఫన్ కథ ఆధారంగా రూపుదిద్దుకొంది. నాకు తండ్రిగా కన్నడ నటుడు వాసుదేవ రావు నటిచారు. పండిట్ రవిశంకర్ సోదరుడు ఉదయశంకర్ కుమార్తె మమతా శంకర్ నాకు భార్యగా నటించారు. 'మృగయా'లో కూడా ఆమే హీరోయిన్‌గా నటించారు. హైదరాబాద్‌లోని రంగస్థల నటులకు ఆవకాశం ఇచ్చారు. హైదరాబద్‌లోని ఇబ్రహీంపట్నంలో షూటింగ్ చేశాం. రెయిన్ ఎఫెక్ట్ సీన్ మాత్రం సారథి స్టూడియోలో సెట్ వేసి తీశాం.

ఆయన దగ్గర పనిచేయడం నా అదృష్టం!

-ముత్యాల సుబ్బయ్య



- మద్రాసులో ఉండే 'సుప్రియ హోటల్' యజమాని, నా మిత్రుడు పరంధామరెడ్డికి సినిమాలంటే ఆసక్తి. తెలుగులో ఓ ఆఫ్‌బీట్ సినిమా తీయాలని ఆయన కోరిక. ముఖ్యంగా బెంగాలీ దర్శకుడు మృణాల్‌సేన్ అంటే ఆయనకు అభిమానం. ఆయనతో ఓ తెలుగు సినిమా తీయాలని ముచ్చటపడ్డారు. మృణాల్ సేన్‌గారు కూడా అంగీకరించారు. ఆయన యూనిట్‌లో ఎక్కువగా ఉత్తరాది వారు ఉండేవారు. తెలుగు తెలిసిన అసోసియేట్ డైరెక్టర్ ఉంటే బాగుంటుందని పరంధామరెడ్డిగారు నన్ను వచ్చి అడిగారు. ఆ సమయంలో నేను ఖాళీగా ఉండటంతో సరేనన్నాను.
- 'ఒక ఊరి కథ' చిత్రానికి డైలాగులు ఎవరు రాస్తే బాగుంటుందా అనే అంశం మీద చాలా చర్చ జరిగింది. ఒక దశలో వామపక్ష భావాలు కలిగిన రచయిత చెరబండరాజుతో రాయిద్దాం అనుకొని ఆయన్ని పిలిపించాం. అయితే ఆయనకూ, దర్శకుడు మృణాల్ సేన్‌కూ సరిపడలేదు. ఎందుకంటే తను హిందీలో రాసిన డైలాగ్స్ యథాతథంగా తెలుగులోకి అనువదించాలని మృణాల్ సేన్ అనేవారు. దానికి చెరబండరాజు అంగీకరించలేదు. ఆ తర్వాత నేను శ్రీశ్రీ పేరు సూచించాను. అదీ కుదరలేదు. చివరకు యండమూరి వీరేంద్రనాథ్ ను పిలిపించి ఆయనతో మాటలు రాయించాం.
- యూనిట్‌లో తెలుగువాళ్ల సంఖ్య తక్కువ. అంతా హిందీలోనే మాట్లాడేవారు.నాకు హిందీ రాదు. పల్లెటూరి చదువులవల్ల ఇంగ్లీషు కూడా ఫ్లూయంట్‌గా మాట్లాడలేను. దాంతో భాషా సమస్యవల్ల ఆ షూటింగ్ జరిగినంతకాలమూ ఇబ్బంది పడ్డాను.
- మృణాల్ సేన్ గొప్ప దర్శకుడే కాదు చాలా మంచి వ్యక్తి కూడా. సెట్లో చాలా సింపుల్‌గా ఉండేవారు. అందరితో కలసిపోయేవారు. అప్పట్లో నేను సిగరెట్ తాగేవాడిని. టీ తాగగానే సిగరెట్ తాగడం నాకు అలవాటు. మృణాల్ సేన్‌గారి ముందు తాగడానికి ఇబ్బంది పడి చాటుకు వెళ్లి తాగేవాడిని. ఒక రోజు ఆయన నా దగ్గరకు వచ్చి సిగరెట్ కావాలని అడిగారు. నాకు అలవాటు లేదని బుకాయించబోయా. 'నువ్వు సిగరెట్ తాగుతావని నాకు తెలుసు. .. ఇటివ్వు' అని నా దగ్గర సిగరెట్ తీసుకొని తాగారు. అంత సింపుల్‌గా ఉండేవారు. ఆయన దగ్గర పని చేసే అవకాశం రావడం నా అదృష్టం'

మార్కెట్‌లో మార్జిన్ నలభై శాతానికి తగ్గకుండా చూడండి, లేకుంటే మనకు ఆ ప్రాజెక్టు వద్దు, క్లోజ్ చేయండి అన్నది ఇప్పటి ఐటి కంపెనీల మాట. ఇది ఒక వాదన అయితే సరికొత్త టెక్నాలజీలకు అనుగుణంగా సంబంధిత సాంకేతిక నైపుణ్యాలు ఉన్న యువత కోసం ఐటి కంపెనీల పెనుగులాట మరోవైపు కనిపిస్తోంది. రాబోయే రోజులకు అవసరమైన వ్యక్తులను రిక్రూట్ చేసుకునేందుకు తీవ్ర కసరత్తే చేస్తున్నాయి. అందుకోసం ఎంతవరకైనా వెళుతున్నాయని రాబర్ట్ ఆఫ్ టెక్నాలజీ 2019 శాలరీ నివేదిక వెల్లడిస్తోంది. డేటా ఫోకస్ నుంచి సెక్యూరిటీ సంబంధ పొజిషన్ల వరకు ప్రతి స్థాయిలోనూ ఈ ధోరణి వ్యక్తమవుతోంది. ఐటి రంగంలో రాబోయే రోజుల్లో ఈ జాబ్స్‌కు డిమాండ్ ఉంటుందన్నది ఇండస్ట్రీ నిపుణుల మాట.



ఐటీ ఉద్యోగాల్లో వీటికే హవా!

బిజినెస్ ఇంటెలిజెన్స్ అనలిస్ట్

ఈ ఉద్యోగానికి డేటాబేస్ టెక్నాలజీ, అనలిటిక్స్, రిపోర్టింగ్ టూల్స్‌పై అనుభవం ఉండాలి. కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్‌లో ఇంజనీరింగ్ డిగ్రీ ఉండాలి. ఆర్గనైజేషన్‌కు చెందిన యూనిక్ డేటాని అవగాహన చేసుకోగలిగే నైపుణ్యాలు ఉన్నాయా లేదా అన్నది ఆయా మేనేజ్‌మెంట్లు చూస్తాయి. అలాగే సదరు డేటాని తమ క్లయింట్లకు అందజేయగలగాలి. డేటా సేకరణ, దాన్ని ఒక పద్ధతిలో స్టోర్ చేయడం, క్లయింట్లకు అందజేయడం అన్నవి బిజినెస్ ఇంటెలిజెన్స్ అనలిస్టు విధులుగా ఉంటాయి.

స్కిల్స్: డేటాబేస్‌పై తలెత్తే సందేహాల నివృత్తి, స్టోర్డ్ ప్రొసీజర్ రైటింగ్, ఆన్‌లైన్ అనలిటికల్ ప్రాసెసింగ్, డేటా క్యూబ్ టెక్నాలజీ, రిటెన్ అలాగే వెర్బల్ నైపుణ్యాలు బలంగా ఉండటం

క్లౌడ్ ఆర్కిటెక్ట్

ఒక ఐటి కంపెనీ క్లౌడ్ కంప్యూటింగ్ వ్యూహాలను వీరు పర్యవేక్షించాలి. క్లౌడ్ అప్లికేషన్స్‌కు అవసరమైన వ్యక్తుల నియామకం, నిర్వహణ, సంబంధిత అప్లికేషన్లకు బాసటగా నిలవడం వీరి విధులై ఉంటాయి. నెట్‌వర్కింగ్, ప్రోగ్రామింగ్, సెక్యూరిటీ స్కిల్స్‌కు తోడు మల్టిపుల్ ఆపరేటింగ్ సిస్టమ్స్‌పై లోతైన అవగాహన ఉండాలి. అమెజాన్ వెబ్ సర్వీసెస్ వంటి క్లౌడ్ సర్వీస్‌లపై పరిజ్ఞానానికి తోడు ఐటిఎస్ఎం, ఐఅండ్ఒ, గవర్నెన్స్ ఆటోమేషన్, వెండార్ మేనేజ్‌మెంట్ స్కిల్స్ అనుభవం ఉన్న వ్యక్తుల కోసం సంస్థలు చూస్తుంటాయి.

స్కిల్స్: క్లౌడ్ టెక్నాలజీస్, అర్కిటెక్చరల్ ప్రిన్సిపల్స్‌పై నాలెడ్జ్, స్కేలింగ్ క్లౌడ్ అప్లికేషన్స్‌పై అనుభవం, సంబంధిత కాస్ట్ - పర్ఫార్మెన్స్ - ఆర్కిటెక్చర్ ఆఫ్ క్లౌడ్ సిస్టమ్స్‌పై అవగాహన, కొలాబిరేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరమవుతాయి.

క్లౌడ్ సిస్టమ్స్ ఇంజనీర్

ఐటి క్లౌడ్ సిస్టమ్స్ డెవలపపింగ్, ప్లానింగ్, డిజైనింగ్, ఇన్‌స్టాలింగ్, మేనేజింగ్, మెయింటెయినింగ్, సపోర్టింగ్ విషయాల్లో క్లౌడ్ సిస్టమ్ ఇంజనీర్లు బాధ్యత వహించాల్సి ఉంటుంది. అమెజాన్ వెబ్ సర్వీసెస్, ఓపెన్ స్టాక్, మైక్రోసాఫ్ట్ అజ్యూర్ సహా ప్రముఖ క్లౌడ్ సర్వీస్‌లపై ప్రొఫెషనల్స్ అయి ఉండాలి. అలాగే ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్, ఆప్లాస్, డెవ ఆప్స్, ఆటోమేషన్, క్లౌడ్ డేటాబేస్‌లపై అవగాహన బాగా ఉండాలి.

స్కిల్స్: ఐటి క్లౌడ్ సిస్టమ్స్ డెవలపింగ్, ఇన్‌స్టాలింగ్, మెయింటైనింగ్, సపోర్టింగ్ విషయాల్లో అనుభవం ఉండాలి. డిబగ్, కాన్ఫిగర్ సామర్థ్యాలు ఉండాలి. క్లౌడ్ మౌలిక సదుపాయాల ముఖ్యంగా సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ తెలిసుండాలి. మల్టిపుల్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్ పరిజ్ఞానం చాలా అవసరం. ఇంజనీరింగ్‌లో డిగ్రీకి తోడు సిస్టమ్ ఇంజనీర్‌గా కనీసం అయిదేళ్ళకు మించి అనుభవం కూడా ఉండాలి.

హెల్ప్ డెస్క్ డెస్క్‌టాప్ సపోర్ట్ ప్రొఫెషనల్స్

కస్టమర్ నిర్దేశిత వ్యాపారాల్లో హెల్ప్ డెస్క్‌కు ప్రాధాన్యం ఎక్కువ. ఫ్రంట్ ఎండ్‌లోనే కస్టమర్ సర్వీస్ అదేవిధంగా ట్రబుల్ షూటింగ్ అవసరమవుతాయి. అందువల్ల అక్కడే తగు సాంకేతిక పరిజ్ఞానం, సంబంధిత విషయాలపై అవగాహన ఉన్న వ్యక్తులు అవసరమవుతారు. 'రాబర్ట్ హాఫ్ టెక్నాలజీ' హెల్ప్ డెస్క్‌ను మూడు దశలుగా విభజించింది.

స్కిల్స్: మొదటి దశ ఎంట్రీ లెవెల్. అసోసియేట్ డిగ్రీ లేదా టెక్నికల్ స్కూల్‌లో కోర్సు వర్క్‌తో చేరవచ్చు. రెండో దశలో ఉండాలంటే కనీసం రెండేళ్ళ అనుభవం ఉండాలి. బ్యాచిలర్స్ డిగ్రీ ఉండాలి. మూడో దశలో పనికి ప్రొఫెషనల్ సర్టిఫికేషన్స్‌తోపాటు డిగ్రీ కూడా ఉండాలి.

డేటా బేస్ డెవలపర్

వీరు ప్రాథమికంగా డేటాబేస్ ఆర్కిటెక్చర్ నిర్వహణ, సరికొత్త డేటాబేస్ సర్వర్ల డెవలప్ చేసే బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది. ఎస్‌క్యుఎల్ కోడ్‌ని ఉపయోగించి ఫ్రంట్-ఎండ్- యూజర్ డిమాండ్ మేరకు డేటాబేస్ సిస్టమ్స్‌ను డెవలప్ చేయాల్సి ఉంటుంది. ప్రోబ్లెమ్ సాల్వింగ్, ట్రబుల్ షూటింగ్ నైపుణ్యాలు ఉండాలి. డేటాబేస్ ఏర్పాటు, నిర్వహణ సంబంధ సాంకేతిక నైపుణ్యాలు తెలియాలి.

స్కిల్స్: వివిధ డేటాబేస్ టెక్నాలజీలు, ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్‌కు సంబంధించి అనుభవం ఉండాలి. మైక్రోసాఫ్ట్ ఎస్‌క్యుఎల్ సర్వర్ ఇంటిగ్రేషన్ సర్వీసెస్, ఎన్ఒఎస్‌క్యుఎల్ డేటాబేసెస్, బిగ్ డేటా ఇన్‌ఫ్రాస్టక్చర్, హడూప్, జావాస్క్రిప్ట్, హెచ్‌టిఎంఎల్, పిహెచ్‌పి, ఒరాకిల్ వీటిలో కొన్ని. ప్రాబ్లెమ్ సాల్వింగ్, ట్రబుల్ షూటింగ్ నైపుణ్యాలు ఉండాలి. కంప్యూటర్ సైన్స్ లేదా సంబంధిత ఫీల్డ్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ ఉండాలి.

సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్

ఐటిలోని ఇతర జాబ్‌ల మాదిరిగానే వీరికి ప్రాబ్లెమ్ సాల్వింగ్, కమ్యూనికేషన్, అనలిటికల్ సామర్థ్యాలు తెలిసి ఉండాలి. కంపెనీ నిర్వహణకు సంబంధించి సిస్టమ్స్ అడ్మినిస్ట్రేషన్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌పై పట్టు ఉండాలి.

స్కిల్స్: సర్వర్లు, బ్యాకప్, రికవరీ, ఇనస్టాలింగ్, ప్యాచింగ్, అప్‌గ్రేడింగ్ సాఫ్ట్‌వేర్‌లో అనుభవం ఉఆలి. నెట్‌వర్కింగ్ ప్రాబ్లెమ్స్‌ను సాల్వ్ చేసే సామర్థ్యం అవసరం. కంప్యూటర్ సైన్స్‌లో బ్యాచిలర్ డిగ్రీకి తోడు అసోసియేట్ లేదా టెక్నికల్ ట్రైనింగ్ సర్టిఫికెట్ ఉండాలి.

డేటా సైంటిస్ట్

బిజినెస్ ఇన్ఫర్మేషన్ అవసరమైన సమాచార సేకరణ, నిర్వహణలో తోడ్పడే వ్యక్తి డేటా సైంటిస్ట్. సమాచారాన్ని అవసరమైన వారికి కావల్సిన విధంగా కమ్యూనికేట్ చేయగలిగే నైపుణ్యం కూడా ఉండాలి.

స్కిల్స్: ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్ ప్రత్యేకించి పైథాన్ లేదా జావా తెలిసుండాలి. అనలిటికల్ స్కిల్, మేథమెటికల్ స్కిల్స్ బలంగా ఉండాలి. మంచి పొజిషన్లు ఈ రంగంలో కావాలంటే మాస్టర్స్ లేదా పిహెచ్‌డి అభిలషణీయం.

డెవలపర్(వెబ్, సాఫ్ట్‌వేర్, మొబైల్)

ఈ రంగంలో డెవలపర్‌లు సంబంధిత ఉత్పత్తులకు అవసరమైన సిస్టమ్‌ల నిర్వహణ, డిజైనింగ్, ఇన్‌స్టాలింగ్, టెస్టింగ్‌కు బాధ్యత వహించాల్సి ఉంటుంది. కోడింగ్, డిజైనింగ్, బిల్డింగ్ అప్లికేషన్స్‌తెఎలిసి ఉండాలి. సి, సిప్లస్‌ప్లస్, హెచ్‌టిఎంఎల్, జావా మైక్రోసాఫ్ట్, డాట్‌నెట్, ఎస్‌క్యుఎల్ లాంగ్వేజెస్ కూడా అవసరం. క్లయింట్ అవసరాలపై అవగాహన ఉండటమే కాదు, వాటిని అందించగలగాలి.

స్కిల్స్: మల్టిపుల్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్ తెలిసి ఉండాలి. అనలిటికల్, టెక్నికల్ స్కిల్స్ ఉండాలి. కమ్యూనికేషన్ స్కిల్స్ బలంగా ఉండాలి. కంప్యూటర్ సైన్స్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ ఉండాలి. రెండేళ్ళ అసోసియేట్ డిగ్రీకి తోడు సర్టిఫికేషన్స్, బూట్ క్యాంప్స్, ముందస్తు వర్క్ అనుభవం అవసరం.

డెవ్‌ఆప్స్ ఇంజనీర్

కోడ్‌ని వేగంగా, డిప్లాయిమెంట్‌లో తక్కువ ఫెయిల్యూర్స్‌తో వీరు ప్రాక్టీస్ చేసి ఉంటారు. అందుకే ఈ రంగంలో అనుభవం ఉన్న వ్యక్తులను వివిధ ఐటి కంపెనీలు తీసుకుంటాయి. కోడింగ్, స్క్రిప్టింగ్, ప్రాసెసెస్ డెవలప్‌మెంట్‌కు వీరు బాధ్యత వహించాలి. ఐటి ఇన్‌ఫ్రాస్టక్చర్, ప్రొవిజన్ రిసోర్సెస్, టెస్టింగ్ తదితర వ్యవహారాలను వీరు చక్కబెడుతుంటారు. వివిధ ప్రాసెసెస్‌ల మెరుగుదలతో వీరి పాత్ర ఉంటుంది. తద్వార కంపెనీ సామర్థ్యాన్ని వీరు మెరుగుపరుస్తుంటారు.

స్కిల్స్: కోడింగ్ అండ్ స్క్రిప్టింగ్, ఆటోమేషన్. డేటా మేనేజ్‌మెంట్, ఐటి ఆపరేషన్స్ స్కిల్స్ ఉండాలి. డెవ్‌ఆప్స్ బెస్ట్ ప్రాక్టీసెస్‌పై లోతైన అవగాహన ఉండాలి. కమ్యూనికేషన్, ఇంట్రాపర్సనల్ స్కిల్స్ బలంగా ఉండాలి.

ఫుల్-స్టేక్ డెవలపర్

సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో ప్రతి దశకు సంబంధించిన పరిజ్ఞానం వీరికి ఉండాలి. అంతమాత్రాన ప్రతి ఏరియాపై లోతైన పరిజ్ఞానం అవసరం లేదు. వాటిపై అవగాహన ఉంటే చాలు. సర్వర్ల నుంచి నెట్‌వర్క్ వరకు వివిధ అంశాలు తెలిసి ఉండాలి. క్యుఎ, ఎపిఐ లు, యుఎక్స్, యుఐ డిజైన్, సెక్యూరిటీ, కస్టమర్ రిక్వైర్‌మెంట్స్ సహా అన్నీ తెలిసి ఉండాలి.

స్కిల్స్: డెవలప్‌మెంట్‌కు సంబంధించి మల్టిపుల్ ఏరియాల్లో అనుభవం ఉండాలి. ప్రోగ్రామింగ్ స్కిల్స్‌కు తోడు వివిధ లాంగ్వేజెస్ తెలిసి ఉండాలి. డెవలప్‌మెంట్ ప్రాసెస్‌లపై అవగాహన ఉండాలి. కంప్యూటర్ సైన్స్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ ఉండాలి.

ఐఒటి స్పెషలిస్ట్

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఒటి) స్పెషలిస్ట్ ఒక ప్రొఫెషనల్. సంబంధిత డిసిప్లిన్స్ - డివైసెస్, కనెక్టివిటీ, ఎడ్జ్, క్లౌడ్ అనలిటిక్స్, ఎంట్రప్రైజ్ ఇంటిగ్రేషన్, ప్లాట్‌ఫామ్స్, డెవలప్‌మెంట్, డెవ్‌ఆప్స్‌లో ఒకటికి మించి తెలిసి ఉండాలి. ఐఒటి పరిధిలోని రెండు అంశాలతో కలగలిసి వ్యాపారం జరుగుతుంటే ఈ నిపుణులను తప్పకుండా తీసుకోవాల్సి ఉంటుంది.

స్కిల్స్: ఐఒటి ఎక్స్‌పర్ట్ అయి ఉండాలి. సంబంధిత టూల్స్, అప్లికేషన్స్, డివైసెస్, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌పై అనుభవం అవసరం. ఐఒటి ఎడ్యుకేషన్‌లో కంటిన్యూ అయ్యే కమిట్‌మెంట్ ఉండాలి.

నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్

ఎల్ఎఎన్/ డబ్ల్యుఎఎన్ ప్రొటోకాల్. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌కు బాధ్యత వహించాలి. ఈ నిపుణులు ట్రబుల్‌షూటింగ్ విషయంలో ఎక్కువసేపు గడపాల్సి ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో, సిస్టమ్ విఫలమైనప్పుడు వీరి సేవలు కీలకం. సంస్థ నెట్‌వర్క్ అవసరాలను అనుసరించి అనుభవం, అర్హతలు కలిగిన వ్యక్తులు కావాల్సి వస్తారు.

స్కిల్స్: ట్రబుల్‌షూటింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, అనలిటిక్ అండ్ డయాగ్నస్టిక్ స్కిల్స్, వర్కింగ్ అవర్స్ తరవాత కూడా పనిచేసేందుకు సంసిద్ధత ఉండాలి. ప్రొఫెషనల్ సర్టిఫికేషన్స్ ఉండాలి. డిగ్రీకి తోడు అయిదేళ్ళ అనుభవం తప్పనిసరి.

సెక్యూరిటీ ప్రొఫెషనల్(డేటా, ఇన్ఫర్మేషన్, నెట్‌వర్క్, సిస్టమ్స్, క్లౌడ్)

ప్రతి రోజు వ్యాపార వ్యవహారాల్లో డేటా అవసరం పెరుగుతున్న కొద్దీ ఈ నిపుణులు కావాల్సి వస్తారు. వ్యవహారానికి సంబంధించి లోపల, బైట ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడగలగాలి. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ నెట్‌వర్క్‌ల భద్రతకు పూచీపడాలి.

స్కిల్స్: సంస్థ సెక్యూరిటీ పాలసీలను సమర్థంగా అమలు చేయాలి. సంబంధిత ఆడిట్‌లను నిర్వహించాలి. ఇబ్బందులు ఎదురుకాకుండా చూడగలగాలి. సెక్యూరిటీ సిస్టమ్స్‌కు సంబంధించి అనుభవం ఉండాలి. చట్టాలు, విధివిధానాలు తెలిసి ఉండాలి.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు

ఏటా క్రమం తప్పకుండా క్యాలెండర్ ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసే సంస్థల్లో స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సి), యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) ముఖ్యమైనవి. వీటితో పాటు బ్యాంకింగ్ రంగానికి సంబంధించి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబిపిఎస్); త్రివిధ దళాలకు సంబంధించి కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్(సిడిఎస్), నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డిఏ) నోటిఫికేషన్స్ కూడా క్రమం తప్పకుండా విడుదలవుతుంటాయి.



స్టాఫ్ సెలెక్షన్ కమిషన్

కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలకు సంబంధించి క్లరికల్ నుంచి ఆఫీసర్ క్యాడర్ వరకు పోస్టులను భర్తీ చేస్తుంది. ఆయా స్థాయి పోస్టుల భర్తీకి స్టాఫ్ సెలెక్షన్ కమిషన్.... కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్(ఎస్ఎస్‌సిజిఎల్), కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేషన్(ఎస్ఎస్‌సి సిహెచ్‌సిఎల్), జూనియర్ ఇంజనీర్, జిడి కానిస్టేబుల్, మల్టీటాస్కింగ్, సైంటిఫిక్ అసిస్టెంట్, సెలెక్షన్ పోస్ట్, సెంట్రల్ పోలీస్ ఆర్గనైజేషన్, స్టెనోగ్రాఫర్ పరీక్షలను ఏటా క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది.

కంబైన్డ్ హయ్యర్ సెకండరీ ఎగ్జామినేషన్(టైర్ -1)
భర్తీ చేసే పోస్టులు: ఎల్‌డిసి/జెఎస్ఎ; పిఏ/ఎస్ఎ; డిఇఒ(డేటా ఎంట్రీ ఆపరేటర్)
అర్హత: ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత
నోటిఫికేషన్ విడుదల: 2019 జనవరి 19
దరఖాస్తుకు చివరి తేదీ: 2019 ఫిబ్రవరి 18
వెబ్‌సైట్: https://ssc.nic.in

ఐబిపిఎస్

సుమారు 21 ప్రభుత్వ బ్యాంకుల్లోని క్లరికల్, ప్రొబేషనరీ ఆఫీసర్ల, స్పెషలిస్ట్ ఆఫీసర్ల భర్తీకి ఐబిపిఎస్ నోటిఫికేషన్లు జారీ చేస్తుంది. డిగ్రీ ఉత్తీర్ణులు ఐబిపిఎస్ నిర్వహించే వివిధ బ్యాంకు పరీక్షలు రాయవచ్చు. అదేవిధంగా నాబార్డ్, సిబ్బంది, అధికారుల నియామకాలకు కూడా ఐబిపిఎస్ పరీక్షలు నిర్వహిస్తుంది.

వెబ్‌సైట్: https://www.ibps.in/

మరికొన్ని

ప్రభుత్వరంగ సంస్థలు 'గేట్' ఆధారంగా ఇంజనీరింగ్ ట్రైనీ, మేనేజ్‌మెంట్ ట్రైనీ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేస్తాయి. ఇవే కాకుండా వివిధ ఉత్పత్తి సంస్థలు పలు ఉద్యోగాలకు ప్రకటనలను ఇస్తుంటాయి. ముఖ్యంగా మార్కెటింగ్, సేల్స్, హాస్పిటాలిటీ రంగాల్లో జాబ్స్‌కు కొదువే ఉండదు. ఆసక్తి, అంతకు మించి సవాలును స్వీకరించే గుణం ఉంటే చాలు ఈ జాబ్స్‌ను దక్కించుకోవచ్చు.

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్

కేంద్ర ప్రభుత్వంలోని అత్యున్నత సర్వీసులైె ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ వంటి ఖాళీల భర్తీ ఏటా యూపీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తుంది. ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ అనే మూడు ప్రక్రియల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. దీనితో పాటు కేంద్ర ప్రభుత్వ వివిధ మంత్రి శాఖలకు సంబంధించి ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్, ఎన్‌డిఎ అండ్ ఎన్ఎ, కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ ఎగ్జామినేషన్‌లను నిర్వహించి ఆయా స్థాయిల్లో ఉద్యోగాలను భర్తీ చేస్తుంది.

ఎన్‌డిఎ అండ్ ఎన్ఎ ఎగ్జామినేషన్(1) 2019
భర్తీ చేసే విభాగాలు: ఆర్మీ, నేవల్, ఎయిర్ ఫోర్స్
అర్హత: ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత
నోటిఫికేషన్ విడుదలయ్యే తేదీ: 2019 జనవరి 9
దరఖాస్తుకు చివరి తేదీ: 2019 ఫిబ్రవరి 4
వెబ్‌సైట్: http://www.upsc.gov.in/

కంబైన్డ్ జియో సైంటిస్ట్స్ అండ్ జియాలజిస్ట్స్ ఎగ్జామినేషన్
భర్తీ చేసే ఉద్యోగాలు: గ్రూప్ ఎ స్థాయిలో జియాలజిస్టులు, జియో ఫిజిస్టులు, కెమిస్టులు
అర్హత: సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ
నోటిఫికేషన్ విడుదల తేదీ: 2019 మార్చి 20
దరఖాస్తుకు చివరి తేదీ: 2019 మే 6
వెబ్‌సైట్: http://www.upsc.gov.in/

సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ ఎగ్జామినేషన్
భర్తీ చేసే ఉద్యోగాలు: వివిధ స్థాయిల్లో పోలీస్ ఉద్యోగాలు
నోటిఫికేషన్ విడుదల తేదీ: 2019 ఏప్రిల్ 24
దరఖాస్తుకు చివరి తేదీ: 2019 మే 20
వెబ్‌సైట్: http://www.upsc.gov.in/

సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) ఎగ్జామినేషన్ 2019, ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్(ప్రిలిమినరీ) ఎగ్జామినేషన్ 2019
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత
నోటిఫికేషన్ విడుదల తేదీ: 2019 ఫిబ్రవరి 19
దరఖాస్తుకు చివరి తేదీ: 2019 మార్చి 18
వెబ్‌సైట్: http://www.upsc.gov.in/

ఐఈఎస్/ ఐఎస్ఎస్ ఎగ్జామినేషన్ 2019
భర్తీ చేసే ఉద్యోగాలు: గ్రూప్ ఎ స్థాయిలో ఎకనామిక్ ఆఫీసర్లు
నోటిఫికేషన్ విడుదల తేదీ: 2019 మార్చి 20
దరఖాస్తుకు చివరి తేదీ: 2019 ఏప్రిల్ 16
వెబ్‌సైట్: http://www.upsc.gov.in/

ఎల్ఐసీ తాత్కాలిక ఛైర్మన్‌గా హేమంత్ భార్గవ

న్యూఢిల్లీ : భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) తాత్కాలిక ఛైర్మన్‌గా హేమంత్ భార్గవ నియమితులయ్యారు. ఎల్ఐసీ ఛైర్మన్‌గా ఉన్న వీకే శర్మ.. సోమవారం పదవీ విరమణ చేయటంతో ఆయన స్థానంలో మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న హేమంత్‌ను తాత్కాలిక ఛైర్మన్‌గా నియమిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఎల్ఐసీ రెగ్యులర్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌ను నియమించే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించినట్లు ప్రభుత్వం తెలిపింది. 2017, ఫిబ్రవరిలో ఎల్ఐసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులైన హేమంత్ భార్గవ.. సంస్థను సరికొత్తగా తీర్చిదిద్దటంలో కీలక పాత్ర పోషించారు.

భవిష్యత్ బంగారం!

కొత్త ఏడాదిలోనే కాదు.. కనీసం వచ్చే అయిదారేళ్ల పాటు దేశీయ సాఫ్ట్‌వేర్ రంగం కళకళలాడే అవకాశం ఉంది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగానికి డిజిటల్ టెక్నాలజీలు వెన్నుదన్నుగా నిలవనున్నాయి. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), కృత్రిమ మేధ (ఏఐ), ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), వర్చ్యువల్ రియాలిటీ (వీఆర్) వంటి టెక్నాలజీలు ఉద్యోగావకాశాలు కల్పించనున్నాయని, ఈ టెక్నాలజీలను నేర్చుకున్న వారికి ఢోకా ఉండదని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) గ్లోబల్ హెడ్ (టెక్నాలజీ బిజినెస్ యూనిట్), ప్రాంతీయ అధిపతి (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) వి.రాజన్న చెబుతున్నారు. ఖాతాదారులను కంపెనీలు ఆకట్టుకోవాలంటే భిన్నమైన రీతిలో సేవలందించాలి. డిజిటల్ టెక్నాలజీల ద్వారానే అది సాధ్యమైనందున ఈ టెక్నాలజీల్లో పెట్టుబడులు పెడుతున్నాయని వివరించారు. ఐటీ పరిశ్రమ వృద్ధికి ఈ పరిణామం దోహదం చేయగలదన్నారు. కొత్త ఏడాది సందర్భంగా ఐటీ రంగంలో రానున్న ధోరణులు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో అదనంగా లభించే ఉద్యోగావకాశాలు, పరిశ్రమ ఆదాయంలో పెరుగుదల మొదలైన అంశాలపై 'ఆంధ్రజ్యోతి బిజినెస్'తో చర్చించారు. ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు..

'ఐటీ'కి డిజిటల్ టెక్నాలజీల అండ

అయిదారేళ్ల వరకూ జోరే
నేర్చుకున్నోళ్లకు నేర్చుకున్నంత
2019-20లో లక్ష ఉద్యోగాలు!
టీసీఎస్‌కు హైదరాబాద్ కీలక కేంద్రం
ప్రాంతీయ అధిపతి వి.రాజన్న

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



హైదరాబాద్, ఆంధ్రజ్యోతి బిజినెస్

భవిష్యత్తులో ఐటీ పరిశ్రమ వృద్ధికి డిజిటల్ టెక్నాలజీలే దోహదం చేస్తాయంటున్నారు. ఏ విధంగానో వివరిస్తారా?

పోటీని అధిగమించి అన్ని రంగాల్లోని కంపెనీలు ఆటోమేషన్, క్లౌడ్ సేవలను వినియోగించుకోవాలని భావిస్తున్నాయి. డిజిటల్ టెక్నాలజీల ద్వారానే ఆటోమేషన్ జరుగుతుంది. ఇప్పటి వరకూ కంపెనీలు చిన్న, చిన్న మొత్తాల్లోనే డిజిటల్ టెక్నాలజీల్లో పెట్టుబడులు పెట్టాయి. వచ్చే కొద్ది సంవత్సరాల్లో కంపెనీలు (ఖాతాదారులు) డిజిటల్ టెక్నాలజీల్లో భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టే వీలుంది. బిలియన్ డాలర్లకు మించిన ప్రాజెక్టులను మెగా డీల్స్ అంటారు. ఇటువంటివి భవిష్యత్తులో ఐటీ కంపెనీలకు బాగా వచ్చే వీలుంది. 2018-19లో ఇటువంటి ప్రాజెక్టులు టీసీఎస్‌కు మూడు, నాలుగు వచ్చాయి. దేశీయ ఐటీ పరిశ్రమ, కంపెనీలకు ఇది సానుకూల పరిణామం. వచ్చే అయిదారేళ్ల పరిశ్రమ అభివృద్ధికి డిజిటల్ టెక్నాలజీలు దోహదం చేయనున్నాయి.

అవకాశాలను అందిపుచ్చుకునే సామర్థ్యాలు దేశీయ ఐటీ పరిశ్రమకు ఉన్నాయా?

ప్రపంచ ఖాతాదారులకు (కంపెనీలు) భారత్ డిజిటల్ టెక్నాలజీల హబ్ కానుంది. ప్రపంచవ్యాప్తంగా కంపెనీలు డిజిటల్ టెక్నాలజీల్లోకి మారే ప్రక్రియలో భారత్ కీలక పాత్ర పోషిస్తుంది. ప్రాజెక్టులను అమలు చేసే సామర్థ్యాలు మన కంపెనీలకు పటిష్ఠంగా ఉన్నాయి. దేశీయ ఐటీ కంపెనీలు ప్రత్యేక నైపుణ్యాల కోసం ఎక్సలెన్స్ కేంద్రాల్లో (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. నిపుణులకు డిజిటల్ టెక్నాలజీల్లో నైపుణ్యాలను పెంచడంపైన కూడా ఎక్కువ నిధులు కేటాయిస్తున్నాయి. టీసీఎస్‌నే తీసుకుంటే.. స్వల్ప కాలంలో 3 లక్షల మంది ఉద్యోగులకు డిజిటల్ టెక్నాలజీల్లో శిక్షణ ఇచ్చింది. అన్నింటికీ మించి ఖాతాదారులను అర్థం చేసుకోవడంలో భారత కంపెనీలదీ అందెవేసిన చేయి. కొన్ని సంవత్సరాలుగా వారితో అనుబంధమే ఇందుకు కారణం.

వచ్చే ఆర్థిక సంవత్సరంలో అదనంగా పరిశ్రమలో ఎన్ని ఉద్యోగాలు లభించే వీలుంది?

ఐటీ రంగంలో ప్రస్తుతం 42 లక్షల మంది ఉద్యోగులు ప్రత్యక్షంగా పని చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో అదనంగా లక్ష మందికి ఐటీ పరిశ్రమ ఉపాధి అవకాశాలు కల్పించింది. 2018-19, వచ్చే ఆర్థిక సంవత్సరంలో కూడా అదనంగా ఇదే స్థాయిలో ఉద్యోగావకాశాలు లభించే వీలుంది. 2019-20 నియామకాల కోసం ఇప్పటికే టీసీఎస్ మొదటి విడత ప్రాంగణ, ఆఫ్ క్యాంపస్ నియామాలను పూర్తి చేసింది. రెండో విడత ఆఫ్ క్యాంపస్ నియామకాలను ప్రారంభించాం. విద్యార్థులు, నిపుణులు కొత్త టెక్నాలజీలలో నైపుణ్యాలు సంపాదించి, అవకాశాలు అందిపుచ్చుకోవడానికి ఎన్నో అవకాశాలు ప్రస్తుతం ఉన్నాయి. నేర్చుకున్న వారికి నేర్చుకున్నంత. భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 7 శాతం వాటా ఐటీ పరిశ్రమదే. మొత్తం ఎగుమతుల్లో 24 శాతం, సేవల రంగ ఎగుమతుల్లో 40 శాతానికి మించి ఐటీ ఎగుమతులే ఉన్నాయి. దేశంలో అత్యధిక ఉద్యోగావకాశాలను కల్పిస్తున్న ప్రధాన రంగాల్లో ఐటీ ఒకటి.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఐటీ పరిశ్రమ ఆదాయంపై అంచనాలు?

అంతక్రితం ఏడాదితో పోలిస్తే 2017-18లో ఐటీ పరిశ్రమ ఆదాయం 8 శాతానికి పైగా వృద్ధి చెంది 167 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.11.52 లక్షల కోట్లు) చేరింది. ఇందులో 126 బిలియన్ డాలర్లు (75 శాతం) ఎగుమతులు కాగా.. 25 శాతం దేశీయ వాటా. 2018-19లో పరిశ్రమ ఆదాయం 7-10 శాతం మేరకు పెరగడానికి అవకాశాలున్నాయి. మొత్తం ఆదాయంలో డిజిటల్ టెక్నాలజీల వల్ల లభించే ఆదాయం వాటా పెరిగే వీలుంది. టీసీఎస్‌నే తీసుకుంటే ఏడాది క్రితంతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఆదాయం దాదాపు 12 శాతం పెరిగింది. అయితే.. డిజిటల్ టెక్నాలజీల ద్వారా లభించిన ఆదాయం ఏకంగా 60 శాతం వృద్ధి చెందింది. మొత్తం ఆదాయంలో డిజిటల్ టెక్నాలజీల వాటా మూడో వంతు ఉంది.

అన్ని రంగాల్లోని కంపెనీలు డిజిటల్ టెక్నాలజీలకు ఎందుకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి?

సినిమా టికెట్ల కొనుగోలు నుంచి షాపింగ్ వరకూ అన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. ఖాతాదారులకు భిన్నమైన అనుభవాన్ని కల్పించి ఆకర్షించాలని కంపెనీలు కోరుకుంటున్నాయి. వినియోగదారులకు అదనపు విలువ చేకూర్చాలని భావిస్తున్నాయి. ఐటీ కంపెనీల కోణంలో చూస్తే మరింత మెరుగైన సేవలను తక్కువ ఖర్చుకు ఐటీ కంపెనీలు అందించాలని ఖాతాదారులు కోరుకుంటున్నారు. అందుకే డిజిటల్ టెక్నాలజీలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. టీసీఎస్ అభివృద్ధి చేసిన 'బిజినెస్ 4.0 థాట్ లీడర్ వ్యూహం పరిశ్రమ మొత్తానికి వర్తిస్తుంది. ఖాతాదారు కంపెనీలు డిజిటల్ టెక్నాలజీల్లోకి మారే ప్రక్రియలో ఎలా పాలు పంచుకోవాలన్న దానిపై ఐటీ కంపెనీలు దృష్టి సారిస్తున్నాయి. ఈ ప్రక్రియలో భాగస్వాములతో చేతులు కలుపుతున్నాయి. ఉదాహరణకు ఒక డిజిటల్ ప్రాజెక్టును అమలు చేయాలంటే.. నెట్‌వర్కింగ్ కంపెనీ, చిప్‌సెట్ తయారీ కంపెనీ మొదలైన రంగాల్లోని కంపెనీల అవసరం ఉంటుంది.

హైదరాబాద్‌లో టీసీఎస్ విస్తరణ ప్రణాళికలు ఏమిటీ?

హైదరాబాద్‌లోని ఆదిభట్లలో అభివృద్ధి చేసిన ప్రాంగణంలో మొత్తం నాలుగు అభివృద్ధి కేంద్రాలను (డెవలప్‌మెంట్ సెంటర్లు) ఏర్పాటు చేయనున్నాం. ఇప్పటికే రెండు కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. వీటిలో 13,000 మంది నిపుణులు పని చేస్తున్నారు. ఆదిభట్ల ప్రాంగణ సామర్థ్యం 25,000 మంది. మూడో డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణంలో ఉంది. 3-4 నెలల్లో పూర్తవుతుంది. నిపుణుల అవసరాలను బట్టి నాలుగో డెవలప్‌మెంట్ సెంటర్ అందుబాటులోకి వస్తుంది. టీసీఎస్‌కు హైదరాబాద్ ఎంతో కీలకం. ఇక్కడ వివిధ విభాగాలకు సాఫ్ట్‌వేర్, ప్రాడక్టులను అభివృద్ధి చేయగల నిపుణుల లభ్యత, మౌలిక సదుపాయాలు వంటి అన్ని సదుపాయాలు ఉన్నాయి. హైదరాబాద్‌లో టీసీఎస్‌కు మొత్తం మూడు- డెక్కన్ పార్క్, సినర్జీ పార్క్, ఆదిభట్ల ప్రాంగణాలున్నాయి. 2007లో హైదరాబాద్‌లో టీసీఎస్‌కు 4,500 మంది ఉద్యోగులుంటే.. ఇప్పుడు 43,000 మంది నిపుణులు, ఉద్యోగులు పని చేస్తున్నారు. దశాబ్ద కాలంలో నిపుణుల సంఖ్య పదింతలైంది. ప్రపంచ వ్యాప్తంగా టీసీఎస్‌కు హైదరాబాద్ నాలుగో అతిపెద్ద కేంద్రం. టీసీఎస్ వృద్ధి వ్యూహంలో భవిష్యత్తులో కూడా హైదరాబాద్ కేంద్రం కీలకంగా కొనసాగుతుంది. ఇటీవలే విజయవాడలో కూడా టీసీఎస్ ఆన్‌లైన్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ప్రారంభించింది. టీసీఎస్‌లో మొత్తం 4 లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.

బీఎస్ఎన్ఎల్ కొత్త ఆఫర్లు

» స్పెక్ట్రమ్ కేటాయించగానే 4జీ సేవలు
» తెలంగాణ సర్కిల్ సీజీఎం సుందర్ వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : కొత్త ఏడాదిని పురస్కరించుకుని భారత్ సంచార్ నిగమ్ (బీఎస్ఎన్ఎల్) సరికొత్త ఆఫర్లను ప్రకటించింది. ప్రీ పెయిడ్, బ్రాడ్‌బ్యాండ్, లాండ్‌లైన్ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా వాయిస్, డేటా ప్లాన్‌లను తీసుకువచ్చినట్లు బీఎస్ఎన్ఎల్ తెలంగాణ సర్కిల్ సీజీఎం వి సుందర్ తెలిపారు. ప్రీ పెయిడ్ వినియోగదారుల కోసం 'వార్షిక-1699, 'వార్షిక ప్లస్-2099' పేరుతో రెండు ఆఫర్లను తీసుకువచ్చినట్లు చెప్పారు. వార్షిక -1699 ప్లాన్ వ్యాలిడిటీ 365 రోజులు కాగా.. అన్ లిమిటెడ్ వాయిస్ కాల్స్ (ముంబై, ఢిల్లీ మినహాయించి), అపరిమిత డేటా (రోజుకు 2జీబీ, ఆ తర్వాత 80 కేబీపీఎస్ వేగం), వంద ఎస్ఎంఎస్‌లు, ఫ్రీ కాలర్ ట్యూన్ వంటి వాటిని అందించనున్నట్లు ఆయన తెలిపారు. కాగా 4జీ సేవలను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని, స్పెక్ట్రమ్ కేటాయింపులు చేపట్టగానే ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు సుందర్ తెలిపారు.

విమాన ఇంధనం.. పెట్రోల్, డీజిల్ కంటే చౌక!

14.7 శాతం తగ్గిన ధర

న్యూఢిల్లీ: విమానాల్లో ఉపయోగించే ఇంధనం ఇప్పుడు పెట్రోల్, డీజిల్ కంటే చౌకగా మారింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఈనెల 1న విమాన ఇంధన (ఏటీఎఫ్) ధరను 14.7 శాతం తగ్గించాయి. దీంతో, ఢిల్లీలో కిలో లీటరు (1,000 లీటర్లు) ఏటీఎఫ్ ధర రూ.9,900 తగ్గి రూ.58,060.97కు జారుకుంది. ఈ చొప్పున ఒక లీటరు విమాన ఇంధనం సుమారు రూ.58కే లభించనుంది. మంగళవారం నాడు ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ.68.65, డీజిల్ రూ.62.66గా నమోదైంది. ఈ లెక్కన విమాన ఇంధనం పెట్రోల్, డీజిల్ కంటే తక్కువకు లభించనుందన్నమాట.

ఇరాన్ చమురు పన్ను మినహాయింపు!

న్యూఢిల్లీ: ఇరాన్ ప్రభుత్వ కంపెనీ 'నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ' (ఎన్ఐఓసీ) నుంచి కొనుగోలు చేసే ముడి చమురు కోసం రూపాయల్లో జరిపే చెల్లింపులపై ప్రభుత్వం పన్ను మినహాయించింది. ఇందుకు సంబంధించి డిసెంబరు 28వ తేదీతో కూడిన గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటివరకున్న నిబంధనల ప్రకారం.. ఏదేని విదేశీ కంపెనీ భారత బ్యాంక్ ఖాతా ద్వారా అందుకునే ఆదాయంపై 40 శాతం విత్ హోల్డింగ్ ట్యాక్స్ వర్తిస్తుంది.

ఎంఎస్ఎంఈలకు ఊరట!

రుణాల వన్ టైమ్ పునర్వ్యవస్థీకరణ

న్యూఢిల్లీ: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)కు చెందిన రుణ బకాయిల పునర్వ్యవస్థీకరణ కోసం మంగళవారం నాడు ఆర్‌బీఐ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ ఏడాది జనవరి 1 నాటికి ఒత్తిడిలో ఉన్న (డిఫాల్ట్ అయినప్పటికీ ఇంకా మొండి బకాయిల్లోకి మళ్లని రుణ ఖాతాలు) ఎంఎస్ఎంఈ రుణాల వన్ టైమ్ రీస్ట్రక్చరింగ్ (పునర్వ్యవస్థీకరణ)కు ఆర్‌బీఐ అనుమతిచ్చింది. రూ.25 కోట్ల లోపు ఎంఎస్ఎంఈ రుణాలకు మాత్రమే ఈ పథకం ద్వారా లబ్ధి పొందే అర్హత కల్పించింది. 2020, మార్చి 31 కల్లా రుణ పునర్వ్యవస్థీకరణను అమలు చేయాల్సి ఉంటుంది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ అమలుతో కుదేలైన ఎంఎస్ఎంఈ రంగానికి ఊరట కల్పించాలని ప్రభుత్వం ఆర్‌బీఐని కోరింది. ఆర్‌బీఐతో ప్రభుత్వ విభేధాలకు ఈ అంశం కూడా ఒక కారణం. అయితే, ఈ విషయంలో ఇరు వర్గాలు ఇప్పటికే ఓ అవగాహనకు వచ్చాయి. ఎంఎస్ఎంఈలకు రూ.25 కోట్ల వరకు బకాయిలను పునర్వ్యవస్థీకరించేందుకు ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టాలని గత ఏడాది నవంబరు 19న జరిగిన సమావేశంలో రిజర్వ్ బ్యాంక్‌కు బోర్డు సూచించింది.

సబ్సిడీ గృహ రుణాల గడువు పొడిగింపు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద మధ్య తరగతి ఆదాయ (ఎంఐజీ) వర్గాల కోసం అమలు చేస్తున్న రుణ ఆధారిత సబ్సిడీ పథకాన్ని (సీఎల్ఎస్ఎస్) ప్రభుత్వం 2020, మార్చి వరకు పొడిగించింది. గడువు ప్రకారం ఈ పథకం ఈ ఏడాది మార్చి 31తో ముగుస్తుంది. అయితే ఈ గడువు మరింత పొడిగించాలని పెద్ద ఎత్తున విజ్ఞప్తులు రావడంతో, పథకాన్ని వచ్చే ఏడాది మార్చి వరకు పొడిగించినట్లు కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి తెలిపారు. వార్షిక ఆదాయం రూ.9 లక్షల నుంచి రూ.18 లక్షల మధ్య ఉండే మధ్య తరగతి ఆదాయ వర్గాల కోసం ప్రభుత్వం ఈ పథకం ప్రవేశ పెట్టింది.



ఏపీలో ఆర్ఓసీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ షా

ఏపీలో ఆర్ఓసీ కార్యాలయం ప్రారంభం

పాల్గొన్న దక్షిణ, ఈశాన్య రాష్ట్రాల ప్రాంతీయ ఆర్ఓసీ షా

విజయవాడ (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఆంధ్రప్రదేశ్ (ఏపీ) రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్ఓసీ) కార్యాలయం ప్రారంభమైంది. ఇప్పటి వరకూ తెలుగు రాష్ట్రాలకు హైదరాబాద్‌లోని ఆర్ఓసీ సేవలందిస్తోంది. సూర్యారావుపేటలో ఏర్పాటు చేసిన ఈ నూతన కార్యాలయాన్ని ఆర్ఓసీ దక్షిణ, ఈశాన్య రాష్ట్రాల ప్రాంతీయ డైరెక్టర్ ఎంపీ షా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఆర్ఓసీ మిశ్రా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏపీ తొలి ఆర్ఓసీగా డెన్నింగ్ కె బాబు ప్రత్యేక పూజల అనంతరం బాధ్యతలు స్వీకరించారు. తొలి ఏఆర్ఓసీగా సాయి శంకర్ నియమితులయ్యారు. అనంతరం షా మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు 30 వేల కంపెనీలు ఉన్నాయని, వాటిలో 18 వేల కంపెనీలు చురుగ్గా కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి నెలా 1000 కంపెనీలు రిజిస్టర్ అవుతున్నాయని చెప్పారు. తెలంగాణ ఆర్ఓసీ మిశ్రా మాట్లాడుతూ.. కంపెనీలు పెట్టే వారికి ఆర్ఓసీపై అవగాహన కల్పించాలని కోరారు. డెన్నింగ్ కె బాబు మాట్లాడుతూ.. భారతదేశంలో ఏపీ ఆర్ఓసీ ఒక మోడల్‌గా తయారవుతుదన్న ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో షెల్ కంపెనీలు లేకుండా చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రాబోయే అయిదేళ్లలో ఇక్కడ 5 లక్షల కంపెనీలు ఏర్పాటయ్యే అవకాశం ఉందన్నారు. కంపెనీలు ఎక్కువగా విజయవాడ, గుంటూరు, రాజమండ్రి, కాకినాడ, వైజాగ్ ప్రాంతాల్లో ఉన్నాయని తెలిపారు.

రూ.94,726 కోట్లు

డిసెంబరు జీఎస్‌టీ వసూళ్లు

న్యూఢిల్లీ: గత ఏడాది డిసెంబరులో జీఎస్‌టీ వసూళ్లు రూ.94,726 కోట్లుగా నమోదయ్యాయి. నవంబరులో నమోదైన రూ.97,637 కోట్ల వసూళ్లతో పోలిస్తే గణనీయంగా తగ్గాయి. మంగళవారం కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం.. డిసెంబరు 30 నాటికి 72.44 లక్షల సేల్స్ రిటర్నులు (జీఎస్‌టీఆర్-3బీ) దాఖలయ్యాయి. గత ఏడాది ఆగస్టు నుంచి సెప్టెంబరు మధ్యకాలానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు రూ.11,922 కోట్ల పరిహారం చెల్లించింది. డిసెంబరులో వసూలైన మొత్తం పన్ను ఆదాయంలో సెంట్రల్ జీఎస్‌టీ రూ.16,442 కోట్లు, స్టేట్ జీఎస్‌టీ రూ.22,459 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.47,936 కోట్లు, లగ్జరీ, హానికారక ఉత్పత్తులపై జీఎస్‌టీకి అదనంగా వసూలు చేసిన సుంకం రూ.7,888 కోట్లుగా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19)లో కేవలం ఏప్రిల్, సెప్టెంబరు నెలల్లో మాత్రమే జీఎస్‌టీ వసూళ్లు రూ.లక్ష కోట్ల మైలురాయిని అధిగమించగలిగాయి.



కొత్త 'వార్షిక జీఎస్‌టీ ఫారమ్' నోటిఫై

వార్షిక జీఎస్‌టీ రిటర్నుల దాఖలు కోసం కేంద్ర ప్రభుత్వం కొత్త ఫారాన్ని ప్రకటించింది. జీఎస్‌టీ నెట్‌వర్క్‌లో నమోదు చేసుకున్న వ్యాపారస్థులు ఈ ఏడాది జూన్ 30లోగా ఈ వార్షిక జీఎస్‌టీ ఫారాన్ని సమర్పించాల్సి ఉంటుంది. ఈ ఫారమ్‌లో వ్యాపారస్థులు తాము జరిపిన విక్రయాలు, కొనుగోళ్లతోపాటు 2017-18 ఆర్థిక సంవత్సరానికి గాను పొందిన ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ ప్రయోజన వివరాలను పొందుపర్చాల్సి ఉంటుంది.

నాన్ ఫైలర్స్‌కు లేట్ ఫీజు మాఫీ

2017, జూలై నుంచి 2018, సెప్టెంబరు మధ్యకాలానికి సంక్షిప్త, తుది విక్రయాల రిటర్నులను దాఖలు చేయకపోవడంతోపాటు పన్ను చెల్లించని వ్యాపారస్థులకు లేట్ ఫీజును మాఫీ చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. అయితే, వీరు ఈ 15 నెలల కాలానికి సంబంధించిన రిటర్నులను 2019, మార్చి 31లోగా సమర్పించాల్సి ఉంటుందని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ) స్పష్టం చేసింది.

నత్తనడకే..!

న్యూఢిల్లీ: దేశీయ వాహన తయారీ రంగానికి 2018 ముగింపు నిరాశనే మిగిల్చింది. డిసెంబరులోనూ వాహన విక్రయాలు మందకొడిగానే సాగాయి. ప్రధాన సంస్థల్లో కొన్నింటి అమ్మకాలు స్వల్ప వృద్ధిని నమోదు చేసుకోగా.. మరికొన్ని క్షీణతను కనబర్చాయి. సంవత్సరాంతర డిస్కౌంట్ ఆఫర్లు కూడా కార్ సేల్స్‌కు పెద్దగా ఊతమివ్వలేకపోయాయి. కొనుగోలుదారుల్లో సెంటిమెంట్ బలహీనపడటంతోపాటు మార్కెట్లో ద్రవ్య కొరత ఇందుకు ప్రధాన కారణమైంది. గత నెలలో మారుతి సుజుకీ, హ్యుండయ్ మోటార్స్, హోండా కార్స్, టాటా మోటార్స్ సేల్స్ సింగిల్ డిజిట్‌కు పరిమితం కాగా.. మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ ఎం) వాహన విక్రయాలు తగ్గుముఖం పట్టాయి. కొత్త ఏడాదిలో పరిస్థితులు మళ్లీ మెరుగుపడవచ్చని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ మార్కెట్ నుంచి వాహనాలకు డిమాండ్ పెరగవచ్చని వారు ఆశాభావంతో ఉన్నారు.



డిసెంబరులో వాహన విక్రయాలు

కంపెనీ	2018	2017	వృద్ధి/క్షీణత(%)
కార్లు			
మారుతి సుజుకీ	1,21,479	1,19,286	1.8
హ్యుండయ్ మోటార్స్	42,093	40,158	4.6
హోండా కార్స్	13,139	12,642	4.0
టాటా మోటార్స్	14,260	14,180	1.0
ఎం అండ్ ఎం	15,091	15,543	-3.0
ద్విచక్ర వాహనాలు			
రాయల్ ఎన్‌ఫీల్డ్	56,026	65,367	-14.0
ట్రాక్టర్లు			
మహీంద్రా	17,404	18,488	-6.0
ఎస్కార్ట్స్	4,212	3,476	27.5
వాణిజ్య వాహనాలు			
వీఈ కమర్షియల్ వెహికిల్స్	6,236	6,087	2.4

ఆటుపోట్లున్నా దూకుడే

వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్‌కు గుర్తింపు



న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచింది. ఆటుపోట్లు ఎదురైనప్పటికీ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న జాబితాలో చైనా అగ్రస్థానంలోనే ఉంది. 2018లో ముడి చమురు ధరలు దూసుకుపోవటం, అంతర్జాతీయ వాణిజ్య యుద్ధం కారణంగా భారత ఆర్థిక వ్యవస్థ.. ఒకడుగు ముందుకు ఒక అడుగు వెనక్కు అన్న ధోరణిలో సాగింది. అయితే ఎన్ని ఆటుపోట్లు, ఆటంకాలు ఎదురైనా దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధిపథంలో సాగటం విశేషం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 8.2 శాతంగా నమోదైంది. 2017-18 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో ఇది 7.7 శాతంగా ఉంది. కాగా అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపించటంతో సెప్టెంబరుతో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో వృద్ధి రేటు 7.1 శాతానికి పడిపోయింది. మరోవైపు ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం పెద్దఎత్తున సంస్కరణలను అమలు చేయాలని నిర్ణయించటమే కాకుండా వృద్ధి రేటును 7.8 శాతానికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ రాజీవ్ కుమార్ తెలిపారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఇప్పటికే సత్ఫలితాలను ఇస్తున్నాయని రాజీవ్ చెప్పారు.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి	రూపాయి డాలర్	ముడి చమురు
186.24 ↑	47.55 ↑	50 ↓	5 ↓	↑	↑
36254.57	10910.10	31,660	38,245	69.43	53.80

ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

పామాయిల్‌పై దిగుమతి సుంకం కోత

న్యూఢిల్లీ: ఆసియాన్ దేశాల నుంచి దిగుమతి చేసుకునే ముడి పామాయిల్, రిఫైన్డ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని ప్రభుత్వం తగ్గించింది. ఈ నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుంది. ఆగ్నేయాసియా దేశాలతో ఉన్న ప్రాధాన్యతా వాణిజ్య ఒప్పందాలకు అనుగుణంగానే ఈ చర్య తీసుకున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. మలేషియా నుంచి దిగుమతి చేసుకునే పామాయిల్‌పై సుంకాన్ని 54 శాతం నుంచి 45 శాతానికి, ఇండోనేషియా, ఇతర ఆసియాన్ సభ్య దేశాల నుంచి దిగుమతి చేసుకునే పామాయిల్‌పై సుంకాన్ని 44 శాతం నుంచి 40 శాతానికి తగ్గించినట్టు కేంద్ర పరోక్ష పన్నుల బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. భారత్ దిగుమతి చేసుకునే వంటనూనెల్లో పామాయిల్ వాటాయే అధికం.

అరబిందో రక్తపోటు ఔషధం రీకాల్

న్యూఢిల్లీ : అధిక రక్తపోటు తద్వారా గుండె పోటు నివారణకు ఉపయోగించే 80 లక్షలకు పైగా టాబ్లెట్లను అరబిందో ఫార్మా అమెరికా విభాగం స్వచ్ఛందంగా రీకాల్ చేసింది. ఎన్-నిట్రోసోడైథిలమైన్ పేరిట మార్కెట్లో ఉన్న ఆ టాబ్లెట్లలో కొన్ని మలినాలున్నట్టు గుర్తించామంటూ ఇచ్చిన సమాచారం ఆధారంగా తాము వాటిని ఉపసంహరించుకున్నట్టు యూఎస్ ఎఫ్‌డీఏకు తెలిపింది. అమ్లోడిపిన్ వల్సర్టాన్, వల్సర్టాన్ హెచ్‌సీటీజెడ్, వల్సర్టాన్ పేరిట అరబిందో మార్కెటింగ్ చేస్తోంది. రీకాల్ చేసిన లాట్లలోని టాబ్లెట్లు ఇప్పటికే కొనుగోలు చేసిన వారు వాటిని ఉపయోగించవద్దని తెలిపింది.

శుభారంభం

10900 ఎగువన నిఫ్టీ



ముంబై : కొత్త సంవత్సరం తొలి రోజున స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. మంగళవారం ట్రేడింగ్ ఆరంభంలో సూచీలు తీవ్ర ఒడిదుడుకులు లోనైనా చివరి గంటలో కొలుకుని లాభాల బాటపట్టాయి. కొనుగోళ్ల మద్దతుతో సెన్సెక్స్ 186.24 పాయింట్ల లాభంతో 36254.57 పాయింట్ల దగ్గర, నిఫ్టీ 47.55 పాయింట్ల లాభంతో 10910.10 వద్ద ముగిశాయి. మొండి బకాయిల భారం నుంచి బ్యాంకింగ్ రంగం కోలుకుంటోందన్న ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వ్యాఖ్యలు బ్యాంకింగ్ షేర్లకు టానిక్‌లా పని చేశాయి. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, డాలర్‌తో రూపాయి మారకం రేటు మరింత పుంజుకోవడం దేశీయ స్టాక్ మార్కెట్లకు కలిసొచ్చింది.

అయితే నిధుల లభ్యత (లిక్విడిటీ), వచ్చే వారం నుంచి వెలువడనున్న కంపెనీల ఆర్థిక ఫలితాలు రానున్న రోజుల్లో మార్కెట్ గమనాన్ని నిర్దేశిస్తాయని బీఎన్‌పీ పారిబా అనుబంధ సంస్థ 'షేర్‌ఖాన్' అడ్వైజరీ హెడ్ హేమాంగ్ జాని అంచనా వేస్తున్నారు. వాణిజ్య యుద్ధ భయాలు, నీరసిస్తున్న అంతర్జాతీయ ఆర్థిక వృద్ధి, చమురు ధరల్లో కొనసాగుతున్న అనిశ్చితి, లోక్‌సభ ఎన్నికలు, డాలర్‌తో రూపాయి ఒడిదుడుకులు ఈ ఏడాది మార్కెట్లను తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

బ్యాంకింగ్, ఫైనాన్షియల్, టెలికాం, ఐటీ, ఆటోమొబైల్, ఫార్మా కంపెనీల షేర్లు మంగళవారం చురుగ్గా ట్రేడయ్యాయి. సెన్సెక్స్ షేర్లలో భారతీ ఎయిర్‌టెల్ షేరు అత్యధికంగా 2.76 శాతం లాభపడింది. కొనుగోళ్ల మద్దతుతో హెచ్‌డీఎఫ్‌సీ, యెస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, హీరో మోటోకార్ప్, టాటా మోటార్స్, సన్ ఫార్మా, బజాజ్ ఫైనాన్స్, టీసీఎస్, పవర్‌గ్రిడ్, ఐటీసీ, బజాజ్ ఆటో, మారుతి, కోల్ ఇండియా, ఎల్ అండ్ టీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు లాభాల బాట పట్టాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, ఓఎన్‌జీసీ, హెచ్‌యూఎల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎన్‌టీపీసీ, ఏషియన్ పెయింట్స్, వేదాంత, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కంపెనీల షేర్లు మాత్రం అమ్మకాల ఒత్తిడితో 3.75 శాతం వరకు నీరసించాయి.

రాకెట్‌లా దూసుకెళ్లిన అతుల్ ఆటో

భారీ లాభాల్లో అతుల్ ఆటో షేరు

రాజ్‌కోట్‌కు చెందిన అతుల్ ఆటో కంపెనీ షేరు మంగళవారం బీఎస్ఈలో భారీ లాభాలతో ట్రేడయింది. ఈ కంపెనీ షేరు సర్క్యూట్ బ్రేకర్ ను తాకి 19.99 శాతం లాభంతో రూ.348.20 దగ్గర ముగిసింది. డిసెంబరులో ఈ కంపెనీ విక్రయాలు 49.90 శాతం పెరగడమే ఇందుకు ప్రధాన కారణం.

లాభాల్లో ట్రెడ్జింగ్ కార్పొరేషన్ షేరు

విశాఖపట్నం కేంద్రంగా పనిచేసే డ్రెడ్జింగ్ కార్పొరేషన్ షేరు మంగళవారం పరుగులు తీసింది. బీఎస్ఈలో ఒక దశలో 8.44 శాతం లాభపడిన ఈ కంపెనీ షేరు చివరికి 6.64 శాతం లాభంతో రూ.470.45 దగ్గర స్థిరపడింది.

రుణపత్రాల ఈటీఎఫ్‌లకే ప్రభుత్వ కంపెనీల మొగ్గు



న్యూఢిల్లీ: మూలధన పెట్టుబడి అవసరాల కోసం పెట్టుబడి సమీకరణకు రుణపత్రాల ఈటీఎఫ్ రూపంలో నిధుల సమీకరించుకునేందుకు 12కి పైగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఆసక్తిని ప్రదర్శిస్తున్నాయి. క్రిసిల్ ఎ, డబుల్ ఎ రేటింగ్ గల సీపీఎస్ఈలను తొలుత ఈటీఎఫ్ బాటలో బాండ్లు జారీ చేయడానికి తొలుత అనుమతించనున్నట్టు ఆర్థిక శాఖ అధికారి ఒకరు తెలిపారు. గతంలో జారీ చేసిన సీపీఎస్ఈ ఈటీఎఫ్, భారత్-22 ఈటీఎఫ్‌లు సాధించిన విజయాన్ని పరిశీలించిన ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ డెట్ ఈటీఎఫ్‌లకు కూడా అనుమతించనున్నట్టు 2018-19 బడ్జెట్ సందర్భంగా ప్రకటించారు.

ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా డెట్ ఈటీఎఫ్‌ల ద్వారా నిధులు సమీకరించుకోవచ్చునని ఆర్థిక శాఖ ప్రకటించింది. డెట్ ఈటీఎఫ్‌లతో ఇన్వెస్టర్ పరిధి విస్తరించడంతో పాటు నిధుల సేకరణలో పారదర్శకత ఉంటుందంటున్నారు. దేశంలో కార్పొరేట్ బాండ్ల మార్కెట్ పరిమాణం జీడీపీలో 13 శాతం మాత్రమే ఉంది. అందులో ప్రభుత్వ బాండ్ల మార్కెట్ వాటా 30.4 శాతం ఉంది.

10900 పైన ముగింపు నిలకడ

టెక్ వ్యూ

మార్కెట్ కరెక్షన్‌లో ప్రారంభమై 10800 వరకు దిగజారినా చివరి సెషన్ అనంతరం తిరిగి కోలుకుని పాజిటివ్‌గా క్లోజయింది. దీ గరిష్ఠ స్థాయి 10900 కన్నా పైన క్లోజ్ కావడం మరింత పాజిటివ్ ట్రెండ్ ఉంటుందనేందుకు సంకేతం. అలాగే 10, 20 డీఎంఏల కన్నా పైనే క్లోజ్ కావడం కూడా సానుకూలతను సూచిస్తోంది.

బుధవారం స్థాయిలివే...

నిరోధం: 11000 మద్దతు: 10800

- మరింత అప్‌ట్రెండ్ కోసం మైనర్ నిరోధం 10960 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 11000. ఆ పైన కనీసం రెండు రోజులు పాటు బలంగా క్లోజయినప్పుడే ర్యాలీ మరింతగా కొనసాగుతుంది.
- మైనర్ మద్దతు స్థాయి 10860 కన్నా దిగువన ట్రేడయితే ఇంట్రాడే బలహీనతలో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 10800. అంతకన్నా దిగజారితే మరింత కరెక్షన్ తప్పదు.
- బ్యాంక్ నిఫ్టీ ఇంట్రాడే మైనర్ కరెక్షన్ అనంతరం బలమైన రికవరీతో ఇటీవల ఏర్పడిన గరిష్ఠ స్థాయిల కన్నా పైన క్లోజయింది. ఇది ట్రెండ్ సానుకూలతను సూచిస్తోంది.

■ వి.సుందర్ రాజా

ప్రథమార్ధం మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి: మార్గశిర బహుళ ద్వాదశి
నక్షత్రం: అనూరాధ
భరణి, పుష్య, పూర్వాషాఢ నక్షత్ర జాతకులు, ధనస్సు, మేష రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.
నిఫ్టీ: 10910.10 (47.55)
ట్రెండ్ మార్పు వేళలు: 9.37
ధోరణి: నిఫ్టీ ఫ్యూచర్స్ 9.50 వరకు నిస్తేజంగా ట్రేడయి ఆ తర్వాత 11.40 వరకు మెరుగ్గా ఉన్నా, 11.40 నుంచి 1.10 మధ్యన నిలకడగా ట్రేడ్ కావచ్చు. 1.10 నుంచి చివరి వరకు బలహీనంగా మారవచ్చు.
ట్రేడింగ్ వ్యూహం: నిఫ్టీ ఫ్యూచర్స్ 10 గంటల సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఏటీపీ) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 11.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.15 తర్వాత ఏటీపీ కన్నా దిగువన వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవాల్సి ఉంటుంది.
నిరోధం: 10950, 10985
మద్దతు స్థాయిలు: 10870, 10735
ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.
గమనిక: ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in

టెక్నికల్స్ సానుకూలమే..

సరైన సమయంలో సరైన షేర్ల కొనుగోలు వ్యూహం మంచిది



స్టాక్ మార్కెట్లకు రానున్న రోజులు సానుకూలంగానే ఉంటాయి. నెలవారీ చార్టుల ప్రకారం గత మూడు నెలల కాలంలో నిఫ్టీ కన్సాలిడేషన్ ధోరణిలో నడిచింది. 2018 అక్టోబరు నెలలో దీర్ఘకాలిక మద్దతు స్థాయి 10000 వద్ద మద్దతు తీసుకుని నవంబరులో ఎగువకు బలమైన రివర్సల్ సాధించింది. చార్టుల ప్రకారం డిసెంబరు నెల అంతా స్వల్ప నిలకడ ధోరణిని ప్రదర్శించింది. అలాగే 20 నెలల చలన సగటు వద్ద (చార్టులో ఎర్రగా కనిపిస్తున్న రేఖ) కూడా మద్దతు తీసుకుంది. అలాగే 10 నెలల చలన సగటు వద్ద (చార్టులో నీలంగా కనిపిస్తున్న రేఖ) నిలదొక్కుకుంటోంది. ఇవన్నీ సానుకూలతకు సంకేతాలు.

దీన్ని బట్టి చూస్తే సాధారణ పరిస్థితుల్లో కొత్త సంవత్సరంలో కదలికలు సానుకూలంగానే ఉండవచ్చు. ఆరునెలల సూచీ 50 స్థాయి లు దిగువకు రావడం కూడా సానుకూల సంకేతం. గత మూడు నెలల కదలికలను గమనిస్తే 11000 వద్ద టాప్ ఏర్పడింది. ఇక్కడే నిలదొక్కుకోలేకపోయింది. మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించాలంటే ఇక్క డ బ్రేకౌట్ తప్పనిసరి. టెక్నికల్స్ ప్రకారం 2019లో మార్కెట్ అప్‌ట్రెండ్‌లో పురోగమించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. కాని మార్కెట్లో పెట్టుబడి నియమాలను మాత్రం ఇన్వెస్టర్లు గుర్తుంచుకుని తీరాలి. ఫండమెంటల్ పటిష్ఠంగా ఉన్న కంపెనీలు, ధరలు కనిష్ఠంగా ఉన్న షేర్ల కొనుగోళ్లు, షేర్ల కదలికలు నిరంతరం ట్రాక్ చేయడం మంచిది. ఏ వరుసగా కొద్ది నెలలుగా ఆటుపోట్లకు లోను కావడంతో నిలకడగా ట్రేడవుతున్న కంపెనీలను పరిశీలించి మెరుగైన పటిష్ఠత ఉండడంతో పాటు భవిష్యత్‌లో వృద్ధి అవకాశాలు గలవిగా పరిగణించాలి. ఇదీకాకుండా ఓవర్‌సోల్డ్ కరెక్షన్ వచ్చినప్పుడల్లా తక్కువ ధరకు అందుబాటులో ఉన్న మంచి కంపెనీల షేర్లు కొనుగోలు చేయాలి. షేరులో ఏ మాత్రం బలహీనత కనిపించినా లాభాలతోనైనా సరే బయటపడాలి. నష్టాలు తక్కువ స్థాయికి పరిమితం చేసుకుని దుర్లు కావాలి.

2019

2018 సంవత్సరం మొత్తంలో మార్కెట్ తీవ్ర ఆటుపోట్లతో సైడ్‌వేస్ ధోరణిలో నడిచింది. ఏడాది మొత్తానికి 10860 వద్ద ముగిసింది. 2017 ముగింపు 10530 పాయింట్ల కన్నా స్వల్పంగా పైన క్లోజయింది. ఆగస్ట్‌లో 10500 నుంచి మంచి ర్యాలీ సాధించి 1300 పాయింట్ల మేరకు లాభపడి 11800 వరకు వెళ్లగలిగింది. కాని సెప్టెంబరు నుంచి తిరిగి బేర్ పట్టులోకి జారుకుని 1800 పాయింట్ల మేరకు నష్టపోయింది. తిరిగి గత రెండు నెలలుగా మందకొడిగా రికవరీ సాధిస్తూ 10870 వద్ద నిలిచింది. ప్రస్తుతం మార్కెట్ ఆరు నెలల కాలవ్యవధి కంటే బలమైన స్వల్పకాలిక సైకిల్‌లో ఉంది.

ఏడాదంతా ఎగుడు దిగుడులే..

■ వి.సుందర్ రాజా

ఉక్కు విక్రయాల్లో 29% వృద్ధి

వైజాగ్ స్టీల్ సీఎండీ పీకే రథ్



సమావేశంలో మాట్లాడుతున్న పీకే రథ్

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): డిసెంబరు చివరి నాటికి రూ.14,687 కోట్ల విలువైన ఉక్కు ఉత్పత్తులను విక్రయించినట్టు రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్, వైజాగ్ స్టీల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పీకే రథ్ వెల్లడించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2017తో పోల్చితే అమ్మకాల్లో 29 శాతం (రూ.11,395 కోట్లు) వృద్ధిని సాధించినట్టు చెప్పారు. నిర్వహణాపరంగా వైజాగ్ స్టీల్ 20 శాతం వృద్ధిని సాధించిందని అన్నారు. హాట్ మెటల్ తయారీలో పల్వరైజ్ కోల్ ఇంజెక్షన్‌ను ఉపయోగించడంవల్ల, టన్నుకు 100 కిలోలు ఉపయోగిస్తే ఏడాదికి రూ.1,500 కోట్లు ఆదా అవుతుందన్నారు. ఈ దిశగా సాంకేతిక నిపుణులు దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు రాయ్ చౌదరి, వేణుగోపాల రావు, కేసీ దాస్ పాల్గొన్నారు.

అంచనాలను మించి పెట్టుబడుల ఉపసంహరణ!

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్ఈ)ల్లో పెట్టుబడుల ఉపసంహరణ (డిజిన్వెస్ట్‌మెంట్) ఈ ఆర్థిక సంవత్సరం కూడా నిర్దేశిత లక్ష్యాన్ని దాటే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.80,000 కోట్లు సమీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు ప్రభుత్వ ఖజానాకు రూ.77,417 కోట్లు సమకూరాయి. హెచ్‌పీసీఎల్ ఈక్విటీలో ప్రభుత్వానికి ఉన్న 51.10 శాతం వాటాలను ఓఎన్‌జీసీ రూ.36,915 కోట్లకు కొనుగోలు చేయడం ఇందుకు బాగా కలిసొచ్చింది. ఈ సంవత్సరం మార్చి నాటికల్లా హెలికాప్టర్ సేవల కంపెనీ పవన్ హన్స్ ఈక్విటీలో ఉన్న 51 శాతం వాటాలను విక్రయించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికితోడు ఓఎన్‌జీసీ, ఐఓసీ, ఆయిల్ ఇండియా, ఎన్ ఎల్సీ, బీహెచ్ఈఎల్, నాల్కో వంటి 10 సీపీఎస్ఈల్లో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.12,000 కోట్లు సమకూరతాయని అంచనా. ఇవికాకుండా ఐపీవోల ద్వారా ఆర్‌వీఎన్ఎల్ విలీనం, ఎన్‌టీపీసీలో ఎస్ఈసీఐ విలీనం ద్వారా రూ.21,000 కోట్లు సమకూరే అవకాశం ఉంది.

బీఎస్ఈలో తెలుగు రాష్ట్రాల కంపెనీ షేర్లు

ఎన్ఎస్ఈ-500

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	32,640	32,600	---	32,380	31,670
క్రితం ముగింపు	32,590	---	32,710	32,450	31,630
22 క్యారెట్లు	30,220	30,050	---	30,050	30,210
క్రితం ముగింపు	30,170	---	30,090	30,110	30,170
వెండి (కిలో)	39,500	39,700	---	39,400	41,500
క్రితం ముగింపు	39,300	---	39,500	39,400	41,500

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 5.00 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	439	చిత్తూరు	438
వరంగల్	441	చెన్నై	445
విజయవాడ	453	నమక్కల్	430
గోదావరి	453	బెంగళూరు	445
విశాఖపట్నం	458	ముంబై	494


ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెంకాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	92	విజయవాడ	94
కరీంనగర్	92	గుంటూరు	95
వరంగల్	92	ఒంగోలు	96
మహబూబ్‌నగర్	92	చిత్తూరు	99
కర్నూలు	92	నెల్లూరు	99
విశాఖపట్నం	85	అనంతపురం	98
గోదావరి	92		



మన పంచాయతీరాజ్ స్వప్నం నిజమైన ప్రజాస్వామ్యాన్ని ప్రతిబింబిస్తుంది. ఇది సాకారమైతే అతి సామాన్యుడు కూడా అత్యున్నత స్థాయి పాలకుడితో సమానమవుతాడు.

- మహాత్మ గాంధీ



మొదటి విడత (జనవరి 7- 21)

నోటిఫికేషన్ విడుదల	:జనవరి 7న (సోమవారం)
ఓటర్ల జాబితా విడుదల (వార్డుల వారీగా)	:జనవరి 7
నామినేషన్ల దాఖలు	:ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు
నామినేషన్ల దాఖలు తుది గడువు	:జనవరి 9 (బుధవారం సాయంత్రం 5 గంటల వరకు)
నామినేషన్ల పరిశీలన	:జనవరి 10 (గురువారం సాయంత్రం 5 గంటల వరకు)
అర్హత పొందిన నామినేషన్ల వెల్లడి	:జనవరి 10 (గురువారం సాయంత్రం 5 గంటల తర్వాత)
అప్పీల్ చేసుకోవటానికి చివరి తేదీ	:జనవరి 11 (శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు)
డిస్పోజల్ చేయటానికి చివరి తేదీ	:జనవరి 12 (శనివారం సాయంత్రం 5 గంటల లోపు)
ఉపసంహరణకు తుది గడువు	:జనవరి 13 (ఆదివారం మధ్యాహ్నం 3 గంటల లోపు)
పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటన	:జనవరి 13 (ఆదివారం 3 గంటల తర్వాత)
మొదటి విడత పోలింగ్ తేదీ	:జనవరి 21 (సోమవారం)
పోలింగ్ సమయం	:ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు
ఓట్ల లెక్కింపు	:మధ్యాహ్నం 2 గంటల నుంచి
ఎన్నికల ఫలితం	:అదే రోజు లెక్కింపు తర్వాత
ఉప సర్పంచ్ ఎన్నిక	: లెక్కింపు తర్వాత

రెండో విడత (జనవరి 11-25)

నోటిఫికేషన్ విడుదల	:జనవరి 11 (శుక్రవారం)
ఓటర్ల జాబితా విడుదల	:జనవరి 11 (వార్డుల వారీగా)
నామినేషన్ల దాఖలు	:ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు
నామినేషన్ల దాఖలు తుది గడువు	:జనవరి 13 (ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు)
నామినేషన్ల పరిశీలన	:జనవరి 14 (సోమవారం సాయంత్రం 5 గంటల వరకు)
అర్హత పొందిన నామినేషన్ల వెల్లడి	:జనవరి 14 (సోమవారం సాయంత్రం5 గంటల తర్వాత)
అప్పీల్ చేసుకోవటానికి చివరి తేదీ	:జనవరి 15 (మంగళ వారం సాయంత్రం 5 గంటల వరకు)
డిస్పోజల్ చేయటానికి చివరి తేదీ	:జనవరి 16 (బుధవారం సాయంత్రం 5 గంటల లోపు)
ఉపసంహరణకు తుది గడువు	:జనవరి 17 (గురువారం మధ్యాహ్నం 3 గంటల లోపు)
పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటన	:జనవరి 17 (గురువారం 3 గంటల తర్వాత)
రెండో విడత పోలింగ్ తేదీ	:జనవరి 25 (శుక్రవారం)

మూడో విడత (జనవరి 16-30)

నోటిఫికేషన్ విడుదల	:జనవరి 16 (బుధవారం)
ఓటర్ల జాబితా విడుదల(వార్డుల వారిగా)	:జనవరి 16
నామినేషన్ల దాఖలు	:ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు
నామినేషన్ల దాఖలు తుది గడువు	:జనవరి 18 (శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు
నామినేషన్ల పరిశీలన	:జనవరి 19(శనివారం సాయంత్రం 5 గంటల వరకు)
అర్హత పొందిన నామినేషన్ల వెల్లడి	:జనవరి 19 (శనివారం సాయంత్రం 5 గంటల తర్వాత)
అప్పీల్ చేసుకోవటానికి చివరి తేదీ	:జనవరి 20 (ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు)
డిస్పోజల్ చేయటానికి చివరి తేదీ	:జనవరి 21 (సోమవారం సాయంత్రం 5 గంటల లోపు)
ఉపసంహరణకు తుది గడువు	:జనవరి 22 (మంగళవారం మధ్యాహ్నం 3 గంటల లోపు)
పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటన	:జనవరి 22 (మంగళ వారం 3 గంటల తర్వాత)
మూడో విడత పోలింగ్ తేదీ	:జనవరి 30 (బుధవారం)

సంగ్రామం ప్రారంభం



హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలకు నగారా మోగింది. రాష్ట్రంలోని 12,732 సర్పంచ్ పదవులకు, 1,13,170 వార్డు సభ్యుల పదవులకు మూడు విడతలుగా ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. 2019 నూతన సంవత్సరం ఆరంభం రోజునే వెలువడిన ఈ షెడ్యూల్ ప్రకారం జనవరి నెలలోనే పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. పంచాయతీల పాలకమండళ్ల గడువు ముగిసి దాదాపు ఆరు నెలల తరువాత కొత్త పాలకమండళ్లు కొలువుదీరబోతున్నాయి. ఎస్ఈసీ కమిషనర్ నాగిరెడ్డి సోమవారం సాయంత్రం తన కార్యాలయంలో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. దీంతో రాష్ట్రంలో ఎన్నికల నియమావళి (కోడ్) అమలులోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. దాదాపు 1.50 కోట్ల మంది పంచాయతీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తొలి విడత పంచాయతీ ఎన్నికల కోసం నోటిఫికేషన్‌ను ఈ నెల 7న, రెండో విడత 11న, మూడో విడత 16న జారీ చేయనున్నారు. మొదటి విడత పోలింగ్ ఈ నెల 21న, రెండో విడత 25న, మూడో విడత 30న జరగనుంది. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఆ వెంటనే ఓట్ల లెక్కింపు చేపట్టి.. ఫలితాలను వెల్లడిస్తారు. తొలుత వార్డులకు లెక్కింపు జరుపుతారు. అనంతరం సర్పంచ్ ఓట్లు లెక్కిస్తారు. ఫలితాలు వెలువడిన వెంటనే చేతులెత్తే పద్ధతిన ఉప సర్పంచులను ఎన్నుకుంటారు. ఏదైనా కారణంగా ఉప సర్పంచ్‌ను ఎన్నుకోని పక్షంలో.. తదుపరి ప్రత్యేక సమావేశంలో ఎన్నుకునే వీలుంది. కాగా, రాష్ట్రంలోని 19 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగడం లేదు. ఇందులో 17 గ్రామ పంచాయతీలకు పాలకమండళ్ల గడువు ఇంకా ముగియలేదు. మరో రెండు పంచాయతీల ఎన్నికలను కోర్టు కేసుల కారణంగా నిలిపేశారు.

బ్యాలెట్లపై పేర్లుండవు.. గుర్తులపైనే ఓటు..

పంచాయతీ ఎన్నికలను ఎప్పటిలాగే బ్యాలెట్ పేపర్లపైనే నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్రంలో 3.50 కోట్ల బ్యాలెట్ పత్రాలను గుర్తులతో ముద్రించి ఎస్ఈసీ సిద్ధం చేసుకుంది. పంచాయతీ పోలింగ్ కోసం వాడే బ్యాలెట్ పత్రాలపై అభ్యర్థుల పేర్లు, ఫొటోలు ఉండవు. కేవలం గుర్తులు మాత్రమే ఉంటాయి. అభ్యర్థులకు కేటాయించిన గుర్తుల చివర నోటా ఉంటుంది. సర్పంచ్ అభ్యర్థుల కోసం తెలుపు రంగు బ్యాలెట్, వార్డు సభ్యుల కోసం గులాబీ రంగు బ్యాలెట్ పత్రాలను వినియోగిస్తారు.

ఎన్నికల వ్యయ పరిమితి పెంపు

అభ్యర్థుల వ్యయ పరిమితిని భారీగా పెంచారు. గతంలో 10 వేలకు పైగా జనాభా కలిగిన పంచాయతీకి సర్పంచ్ అభ్యర్థులు రూ.80 వేలు, వార్డు సభ్యులు రూ.10 వేల వరకు ఖర్చు చేసేలా పరిమితి ఉంది. పదివేల లోపు జనాభా ఉన్న గ్రామాలకు.. సర్పంచ్ అభ్యర్థులకు రూ.40 వేలు, వార్డు సభ్యులకు రూ.5 వేలు మాత్రమే వ్యయ పరిమితి ఉండేది. ప్రస్తుత ఎన్నికల్లో ఈ వ్యయ పరిమితిని భారీగా పెంచారు.

వ్యయ పరిమితి (రూ.లలో)

వివరము	సర్పంచ్‌కి	వార్డు సభ్యులకు
5 వేలకు పైగా జనాభా ఉంటే	250000	50000
5 వేలలోపు జనాభా ఉంటే	150000	30000

సర్పంచ్ అభ్యర్థి ధరావతు(జనరల్)	: రూ. 2000
(రిజర్వు)	: రూ. 1000
వార్డు మెంబర్ ధరావతు(జనరల్)	: రూ. 500
(రిజర్వు)	: రూ. 250

ఖర్చు పరిమితి:

5 వేలలోపు జనాభా గల జీపీకి రూ. 1.50 లక్షలు

5 వేల కంటే ఎక్కువ జనాభా గల జీపీకి రూ. 2.50 లక్షలు

పంచాయతీ ఓటర్లు 1.50 కోట్లు!

ప్రస్తుతం రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో 1,49,52,058 మంది ఓటర్లు ఉన్నారు. నవంబరు 19 నుంచి పంచాయతీ షెడ్యూల్ జారీ చేసే జనవరి 1 నాటికి ఓటరు జాబితాలో చేరిన వారిని రెండో అనుబంధ జాబితాగా చేర్చనున్నారు.

ఇదీ షెడ్యూలు..

తొలి విడత పోలింగ్	: జనవరి 21
రెండో విడత పోలింగ్	: జనవరి 25
మూడో విడత పోలింగ్	: జనవరి 30
పోలింగ్ సమయం	: ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు
ఓట్ల లెక్కింపు, ఫలితం	: పోలింగ్ రోజునే
ఎన్నికలు నిర్వహించే పద్ధతి	: బ్యాలెట్ పేపర్
రాష్ట్రంలో మొత్తం పోలింగ్ కేంద్రాలు	: 1,13,190
మొత్తం పోలింగ్ సిబ్బంది	1,48,033
మొత్తం ఓటర్లు	: 1,49,52,000
ఆమోదించే గుర్తింపు కార్డుల సంఖ్య	: 18
బ్యాలెట్ పేపర్ల రంగులు	: గులాబీ, తెలుపు
బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థి పేరు ఉండదు	
నోటా గుర్తు కూడా బ్యాలెట్‌లో ఉంటుంది.	

అనర్హత వేటుపడిన వారు ఇలా...

గత ఎన్నికల్లో సర్పంచ్‌లుగా గెలిచిన వారు	9
గత ఎన్నికల్లో వార్డు సభ్యులుగా గెలిచిన వారు	1300
గత ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేసి ఓడిన వారు	1266
గత ఎన్నికల్లో వార్డు సభ్యులుగా పోటీ చేసి ఓడినవారు	8528
గత ఎన్నికల్లో ఎంపీటీసీగా పోటీ చేసి ఓడినవారు	1331
గత ఎన్నికల్లో జడ్పీటీసీగా పోటీ చేసి ఓడినవారు	311

12,745 మంది పోటీకి అనర్హులు

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు 12,745 మంది అర్హత కోల్పోయారు. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి ఎన్నికల ఖర్చులను సమర్పించని వారిపై రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఈ సారి పోటీకి అనర్హత వేటు వేసింది.

● అభ్యర్థులూ జర సోంచాయించుండ్రి!



సర్పంచ్‌గా పోటీ చేస్తున్రు సరే.. కానీ గీ విషయాలు జర పట్టించుకోండ్రి అంటూ ఆ గ్రామస్థులు ఏకంగా ఓ ఫ్లెక్సీనే ఏర్పాటు చేశారు! సర్కారు నుంచి వచ్చే ప్రతి పైసా.. చేయించిన పనుల తాలూకు లెక్కలు చెప్పాలె. సీసీ రోడ్లు, చేతిపంపులు, డ్రైనేజీలను నిర్మించాలె. గ్రామంలో కులం, మతం తేడా లేకుండా అందర్నీ సమానంగా చూడాలె... ఇలా వరుసగా ఏడు సూచనలు చేశారు. ఎక్కడ అంటారా? భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని అనుపాక గ్రామంలోని ప్రధాన సెంటర్లో!

-అశ్వారావుపేట

సర్పంచ్‌గా పోటీకి గల్ఫ్ నుంచి వచ్చిన్రు

కథలాపూర్, జనవరి 1: నగరాల్లో 60-70వేల ఉద్యోగం వదిలేసి సర్పంచ్‌గా పోటీ చేసేందుకు ఊర్లోకి వస్తేనే ఆశ్చర్యపోతారు! మరి.. ఏకంగా విదేశాల నుంచే వస్తే? అవును.. గ్రామ సర్పంచ్ పదవికి ఉన్న క్రేజీ ప్రవాసీయులనూ ఆకర్షిస్తోంది. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలానికి చెందిన ఇద్దరు యువకులు ఇప్పటికే తమ తమ గ్రామాల్లో వాలిపోయారు. వారే.. ఇప్పపల్లికి యాటకార్ల అశోక్, దుంపెటకు చెందిన నక్క రమేశ్. తాను సౌదీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నానని.. నెలకు 60 వేల నుంచి 70 వేల దాకా వేతనం పొందుతున్నాని చెప్పాడు. గ్రామానికి సేవ చేయాలనే ఉద్దేశంతో ఉన్న కొలువు వదులుకొని గల్ఫ్ నుంచి వచ్చానని చెప్పాడు. రమేశేమో గతంలో దుంపెటలోనే ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేశానని చెప్పాడు. మూడేళ్ల క్రితం ఉపాధి కోసం దుబాయ్ వెళ్లానని.. అక్కడ ఓ ఫైవ్‌స్టార్ హోటల్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నానని.. నెలకు రూ. 40 వేల దాకా జీతం వస్తోందని చెప్పాడు. దుంపెట స్థానం ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించినందు వల్ల పోటీ చేయడానికి అవకాశం దక్కిందన్నాడు.



రమేశ్



అశోక్

ముందే మోగిన నగారా!

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూలు జారీలో తెరవెనుక చాలా తతంగమే జరిగిందా..? హైకోర్టు ఆదేశాలతోనే ఎన్నికలకు వెళుతున్నట్లు కనిపించినా.. అదే కోర్టు నుంచి ఇతర ఆదేశాలేవీ రాకముందే హడావుడిగా షెడ్యూల్ విడుదల చేశారెందుకు? అదీ సెలవు రోజున నోటిఫికేషన్ విడుదల చేయడం వెనక ఆంతర్యమింటి? అంటే.. ఎన్నికల నిర్వహణకు ఉన్న అడ్డంకిని తొలగించుకునేందుకేనన్న వాదన వినిపిస్తోంది. బీసీ రిజర్వేషన్లపై కోర్టు నుంచి తదుపరి ఆదేశాలు రాకముందే షెడ్యూల్‌కు వెళ్లడం ద్వారా ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం చేసుకునే వ్యూహం ఉన్నట్లు కనిపిస్తోంది. పంచాయతీ ఎన్నికలు, రిజర్వేషన్లకు సంబంధించి హైకోర్టులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. జూన్‌లోనే ఎన్నికలు నిర్వహించాలని ప్రయత్నించినా.. కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులతో వాయిదా పడ్డాయి. ఆ తరువాత కూడా హైకోర్టులో కేసులు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే పంచాయతీలకు వంద రోజుల్లోగా ఎన్నికలు నిర్వహించాలని అక్టోబరు 11న హైకోర్టు ఆదేశించింది. దానిప్రకారం ఈ నెల 10లోగా ఎన్నికలు జరపాలి. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 శాతానికి మించకుండా రిజర్వేషన్లు అమలు చేసేలా ప్రభుత్వం ఇటీవల ఆర్డినెన్స్‌ను జారీచేసింది. దీని ప్రకారం ఎస్టీలకు 6.68 శాతం, ఎస్సీలకు 20.52 శాతం, బీసీలకు 22.78 శాతం రిజర్వేషన్లు కల్పించారు. దీంతో తమకు రిజర్వేషన్లు తగ్గడంపై బీసీలు ఉద్యమబాట పట్టారు. కోర్టులో పిటిషన్లు కూడా దాఖలయ్యాయి. బుధవారం ఈ పిటిషన్లను విచారించనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఎన్నికలు వాయిదా వేయాల్సిన పరిస్థితి తలెత్తవచ్చని ప్రభుత్వం భావించడంతోనే కోర్టు నుంచి తదుపరి ఆదేశాలు రాకముందే నోటిఫికేషన్ జారీచేసినట్లు సమాచారం.

అంతా హడావుడిగానే..

పంచాయతీ రిజర్వేషన్లను డిసెంబరు 29 నాటికి ఖరారు చేయాలని పంచాయతీరాజ్ శాఖ నిర్దేశించుకున్నా.. 31 మధ్యాహ్నానికి కూడా పూర్తి కాలేదు. షెడ్యూల్ ఏరియాలో సర్పంచ్ పదవులను వంద శాతం గిరిజనులకే కేటాయించాలని, వార్డు పదవుల్లో సగం వరకు ఇతరులకు కేటాయించవచ్చని ఉన్నతాధికారులు స్పష్టం చేయడంతో హడావుడిగా ఆదివారం సాయంత్రానికి రిజర్వేషన్లను పూర్తి చేశారు. వెంటనే జిల్లాల గెజిట్ల నివేదికను జారీ చేసి ఎన్నికల సంఘానికి పంపారు. దీంతో రెండు, మూడు రోజుల తర్వాత షెడ్యూల్ వస్తుందని భావించారు. కానీ, ప్రభుత్వం నుంచి నివేదిక అందిన 24 గంటల్లోపే షెడ్యూల్ విడుదలవడం గమనార్హం. 1న ప్రభుత్వం సెలవు ప్రకటించినప్పటికీ ఎన్నికల సంఘం అధికారులు, సిబ్బంది విధులకు హాజరై షెడ్యూల్ ప్రకటనకు ఏర్పాట్లు చేశారు. దీనికి కారణం.. బుధవారం కోర్టులో విచారణకు రానున్న పిటిషన్‌లేనన్న వాదన వినిపిస్తోంది. సహజంగా షెడ్యూల్‌ను వెలువరించిన తదుపరి కోర్టులు కూడా వీటిపై జోక్యం చేసుకోవు. పరోక్షంగా ప్రభుత్వ ఆదేశం మేరకే షెడ్యూల్ ప్రకటనను ముందుకు తెచ్చినట్లు పలువురు పేర్కొంటున్నారు.

రాష్ట్రంలో మళ్లీ 'కోడ్' కూసింది

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల నియమావళి (కోడ్) అమలులోకి వచ్చింది. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) మంగళవారం సాయంత్రం పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించి.. కోడ్ అమలులోకి వచ్చినట్లు పేర్కొంది. ఎన్నికలు ముగిసే వరకు కోడ్ అమలులో ఉంటుంది. గ్రామ పంచాయతీలకే ఎన్నికలు జరుగుతున్నా రాష్ట్రమంతటికీ కోడ్ వర్తిస్తుంది. ఇది ఉన్నంతవరకు రాష్ట్రంలో కొత్త పథకాల ప్రకటన, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు అవకాశం లేదు. ముఖ్యమంత్రి, ఇతర ప్రజాప్రతినిధులు తమ అధికార పర్యటనలను ఎన్నికల పర్యటనలతో మిళితం చేయరాదు. అయితే, సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల పనులను సందర్శించడంలో అభ్యంతరం లేదని, కొత్తగా పథకాల ప్రకటన, శంకుస్థాపనలు చేయరాదని ఎస్ఈసీ కమిషనర్ నాగిరెడ్డి పేర్కొన్నారు. చట్టసభల ఎన్నికల్లో నిబంధనలన్నీ పంచాయతీ ఎన్నికలకూ వర్తిస్తాయి.

మంత్రివర్గం లేకుండానే ఆర్డినెన్సా?

▸▸ హైకోర్టులో ఆర్.కృష్ణయ్య పిటిషన్

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ రాజ్యాంగ విరుద్ధమని, దాని అమలును నిలిపివేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. బీసీల రిజర్వేషన్లను 34 నుంచి 22 శాతానికి తగ్గించడం రాజ్యాంగ విరుద్ధమని, సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి రిజర్వేషన్లను కుదించడం సరికాదంటూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, ఎన్సీపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల రవీందర్ మంగళవారం హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని రిజిస్ట్రీ వర్గాలను కోరగా.. అనుమతించలేదు. ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం ఈ పిటిషన్‌ను విచారించే అవకాశం ఉంది.



చింతలూరు గ్రామం



తెల్దారుపల్లి గ్రామం

ఆ ఊర్లలో ఏకగ్రీవమే!

సమష్టిగా అభ్యర్థి ఎంపిక.. అతడే సర్పంచ్.. ఎన్నడూ సర్పంచ్ ఎన్నికలు జరగలేదు

▸▸ తెల్దారుపల్లి, చింతలూరు గ్రామాల ఆదర్శం

▸▸ ఏకగ్రీవ ఎన్నిక నజరానాలతో అభివృద్ధి

జగిత్యాల, ఖమ్మం రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికలంటే మాటలు కాదు. ఆ మాటకొస్తే.. ఇతర ఎన్నికలతో పోలిస్తే జంఝాటం ఒకింత ఎక్కువే! ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది మొదలు.. నామినేషన్, ఎన్నికలు, కౌంటింగ్ పక్రియ అంతా ముగిసేదాకా గ్రామంలో నువ్వా నేనా అన్నట్లుగా వాతావరణం యమా హాట్‌గా ఉంటుంది. అలాంటిది.. సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలనే ఆలోచన ఉంటే గొప్ప ఆదర్శమే కదా! ఈ విషయంలో ఆ రెండు గ్రామాలది ఎంతో ప్రత్యేకత! గ్రామ పంచాయతీ వ్యవస్థ అమల్లోకి వచ్చినప్పటి నుంచి అంటే.. 59 ఏళ్లుగా సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ వస్తున్న గ్రామం ఒకటి! గ్రామ పంచాయతీగా ఆవిర్భవించింది మొదలు 37 ఏళ్లుగా 'ఏకగ్రీవ' సూత్రాన్ని పాటిస్తున్న ఊరు మరొకటి! అందులో మొదటిది ఖమ్మ జిల్లా రూరల్ మండలంలోని తెల్దారుపల్లి అయితే.. రెండో గ్రామం జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని చింతలూరు. ఈ ఊర్లలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డ్ మెంబర్ల ఎన్నికలు ఏకగ్రీవంగా జరుగుతున్నాయి. ఈసారి కూడా ఏకగ్రీవానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

తమ్మినేని వీరభద్రం సొంతూరు

తెల్దారుపల్లిలో 1959 నుంచి సర్పంచ్‌ను, ఉప సర్పంచ్‌ను, వార్డ్ మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ వస్తున్నారు. వీరి 'ఏకగ్రీవ' నిబద్ధతకు రిజర్వేషన్ల ప్రక్రియ ఎన్నడూ ప్రతిబంధకం కాలేదు. అన్నట్లు.. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి నేత తమ్మినేని వీరభద్రం సొంతూరు ఇదే! కాగా 1981లో గ్రామపంచాయతీగా ఆవిర్భవించింది. ఆ ఏడాది అంతా కలిసి భద్రీనాయక్‌ను సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. అది మొదలు.. ఆ ఊర్లో సర్పంచ్ ఎన్నికలే జరగలేదు. ప్రతిసారీ ఏకగ్రీవంగానే ఎన్నుకున్నారు. మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలిచినందుకు గతంలో ముఖ్యమంత్రి చేతులమీదుగా ఈ గ్రామానికి పురస్కారాలు దక్కాయి. నజరానాగా గతంలో రూ.5లక్షలు, రూ.8లక్షలను ఈ గ్రామ సర్పంచ్‌లు అందుకున్నారు. ఆ డబ్బుతో గ్రామంలో సీసీ రోడ్లు, మురికికాలువలు నిర్మించారు. మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటుచేసుకున్నారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యా వలంటీర్లను నియమించారు.

షెర్వాన్.. కొత్త సర్పంచ్ సాబ్!

▸▸ ఏకగ్రీవంగా ఎన్నుకున్న సల్పబండ గ్రామస్థులు

దర్పల్లి, జనవరి 1: పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ కూడా రాకముందే నిజామాబాద్ జిల్లా దర్పల్లి మండలం సల్పబండ గ్రామ ప్రజలు తమ సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొన్నటి దాకా సల్పబండ తండాగా ఉమ్మడి దుబ్బాక గ్రామపరిధిలో ఉండేది. ఇటీవలే దీన్ని గ్రామపంచాయతీగా చేశారు. గతంలో దుబ్బాక సర్పంచ్‌గా సేవలందించిన షెర్వాన్‌ను గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.




గ్రామాభివృద్ధే లక్ష్యం



ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉంటే గ్రామానికి సరైన నిధులు రావు. గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడమే మా లక్ష్యం. అందుకే 59 ఏళ్లుగా సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నాం.

- సిద్దినేని కోటయ్య, మాజీ జడ్పీటీసీ

ఎన్నేళ్లకైనా ఏకగ్రీవమే



జాగీర్దార్ల నుంచి విముక్తి జరిగిన నాటి నుంచి (1958 నుంచి) సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నాం. ప్రజలకు ఏ కష్టమొచ్చినా అందరం కలిసి ఆదుకుంటాం. ఈసారి ఊర్లో మహిళా కమ్యూనిటీహాల్ నిర్మించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఆలోచనలో ఉన్నాం.

-తమ్మినేని కమలమ్మ, మాజీ సర్పంచ్

రాష్ట్ర ప్రజలకు ఇక సత్వర న్యాయం

» త్వరలో దిగువ కోర్టుల ఏర్పాటు

» టీఆర్ఎస్ ఎంపీ వినోద్ ఆశాభావం



రైల్వే బోర్డు చైర్మన్ వినోద్ యాదవ్‌ను కలిసిన ఎంపీ వినోద్

న్యూఢిల్లీ, జనవరి1(ఆంధ్రజ్యోతి): టీఆర్ఎస్ చేసిన పోరాటంతో ప్రత్యేక హైకోర్టు వచ్చిందని, ఇప్పుడు తెలంగాణ సంపూర్ణ రాష్ట్రంగా ఏర్పడిన రోజుగా భావిస్తున్నామని లోక్‌సభలో టీఆర్ఎస్ పక్ష ఉపనేత వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. కొత్త ఏడాది తొలి రోజే తెలంగాణ హైకోర్టు ఏర్పడటంపై రాష్ట్ర ప్రజలంతా సంబరపడుతున్నారని, ప్రమాణ స్వీకారం చేసిన జడ్జిలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మార్పుతో రాష్ట్ర ప్రజలకు సత్వర న్యాయం లభించనుందని చెప్పారు. ఇన్నాళ్లూ ఉమ్మడి హైకోర్టు విభజన జరగకపోవడంతో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో దిగువ కోర్టులు ఏర్పాటు చేయలేదని, ప్రత్యేక హైకోర్టు ఏర్పడిన నేపథ్యంలో హైకోర్టు సీజే దానిపై దృష్టిపెట్టే అవకాశముందని చెప్పారు.

రైల్వే ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేయాలి: వినోద్

కొత్తగా బాధ్యతలు చేపట్టిన రైల్వే బోర్డు చైర్మన్ వినోద్‌కుమార్ యాదవ్‌తో ఎంపీ వినోద్‌కుమార్ మంగళవారం భేటీ అయ్యారు. తెలంగాణ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రాజెక్టులు, స్టేషన్ల ఆధునికీకరణ, ఆర్వోబీలు, కొన్ని రైళ్లు వివిధ స్టేషన్లలో ఆపడంపై చేసిన అభ్యర్థనలను పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని కోరినట్లు వినోద్ చెప్పారు.

తెలుగు రాష్ట్రాల మధ్య సెషన్స్ జడ్జిల బదిలీలు

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు విభజన నేపథ్యంలో 29 మంది జిల్లా/సెషన్స్ జడ్జిలను, 18 మంది కోర్టు సిబ్బందిని అంతరాష్ట్ర (ఏపీ, తెలంగాణ) బదిలీ చేశారు. ఈ మేరకు ఉమ్మడి హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీచేశారు. మరో ఇద్దరిని పరస్పర అంగీకార బదిలీ చేశారు.

● వర్గీకరణకు చట్టబద్ధత ఇవ్వండి: ఎమ్మార్పీఎస్

న్యూఢిల్లీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి తావర్ చంద్ గెహ్లాట్‌ను తెలంగాణ ఎమ్మార్పీఎస్ కోరింది. బుధవారం ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ వర్గీకరణ చేయాల్సిన ఆవశ్యకతను టీ-ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుకరాజు, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు కె.రాములు వివరించారు.

● 'ఏపీ'పై మాట్లాడే హక్కు టీఆర్ఎస్‌కు లేదు: టీడీపీ

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వం గురించి మాట్లాడే నైతిక హక్కు టీఆర్ఎస్ నాయకులకు లేదని టీడీపీ-టీఎస్ ప్రధాన కార్యదర్శి బండ్రు శోభారాణి అన్నారు. మంగళవారం ఆమె ఎన్టీఆర్‌భవన్‌లో మాట్లాడారు. ఏపీ సీఎం చంద్రబాబును తిట్టడానికి టీఆర్ఎస్ నాయకులు పోటీపడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు టీఆర్ఎస్‌కు ఓట్లు వేసింది సమస్యలు పరిష్కరించడానికా? ఏపీ సీఎంను తిట్టడానికా? అని ప్రశ్నించారు.

● వైద్య విద్యలో మార్పులపై దృష్టి

» దేశంలోని హెల్త్ వర్సిటీల వీసీలతో భేటీ

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పీజీ, సూపర్ స్పెషాలిటీ వైద్య విద్యలో తీసుకురావాల్సిన మార్పులపై కేంద్రం దృష్టి పెట్టింది. 14 స్టేట్ హెల్త్ యూనివర్సిటీల వీసీలతో సమావేశమై సూచనలు, సలహాలు తీసుకుంది. నాలుగు రోజుల క్రితం చెన్నైలో ఎంజీఆర్ హెల్త్ యూనివర్సిటీలో నీతి ఆయోగ్ సభ్యుడు, ఎంసీఐ పాలకవర్గ సభ్యుడు వినోద్.కె.పాల్ ఒక సమావేశం నిర్వహించారు. వైద్య విద్యలో ఎటువంటి మార్పులు తీసుకురావాలి, వైద్య విద్య సీట్ల పెంపుకోసం ఏం చేయాలి, ప్రమాణాలను ఏ విధంగా పెంచాలి తదితర అంశాలపై చర్చించారు.

● సమస్యలుండగానే ఎన్నికలా?: గూడూరు

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా, బీసీ రిజర్వేషన్లు.. ఇలా అనేక సమస్యలను పరిష్కరించకుండానే ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలకు వెళ్లడంపై టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి మండిపడ్డారు. 22లక్షల ఓట్లు గల్లంతయ్యాయని, వాటిని పరిశీలించకుండానే ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల కేసు కోర్టులో ఉండగానే ప్రభుత్వం నోటిఫికేషన్ ఎలా జారీ చేస్తుందని ప్రశ్నించారు.

● కేసు ఉండగానే షెడ్యూలా?: బీసీ సంఘాలు

పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లపై హైకోర్టులో కేసు ఉండగానే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంపై బీసీ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. షెడ్యూల్ విడుదల నేపథ్యంలో బీసీ సంక్షేమ సంఘం అత్యవసర సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీలను నమ్మించి మోసం చేసిన టీఆర్ఎస్ ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

● షెడ్యూల్‌ను సవరించాలి: ఉపాధ్యాయ సంఘాలు

గణతంత్ర దినోత్సవాన్ని దృష్టిలో పెట్టుకుని పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను సవరించాలని పలు ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 25వ తేదీన రెండో దశ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. మెజారిటీ ఉపాధ్యాయులు ఎన్నికల విధుల్లో ఉండటం, స్కూళ్లలో పోలింగ్ నిర్వహించడంతో జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆటంకం కలుగుతుందని టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునందన్, ఎస్జీటీ ఫోరం అధ్యక్షుడు కమ్రుద్దీన్ తెలిపారు.

● రాజ్యాంగ బద్ధత కోసం ప్రధానికి కృష్ణయ్య లేఖ

రాంనగర్/హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత కల్పించాలని, పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ బిల్లు పెట్టాలని కోరుతూ ప్రధాని మోదీకి, పార్లమెంట్‌లోని 36 పార్టీల అధ్యక్షులకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మంగళవారం లేఖ రాశారు. కోర్టుల జోక్యంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు తగ్గకుండా ఉండాలంటే పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించాలని ప్రధానిని కోరారు.

● బీసీ రిజర్వేషన్ల తగ్గింపు దుర్మార్గం: చాడ

జనాభా ప్రాతిపదికన స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచకుండా తగ్గించడం దుర్మార్గమైన చర్య అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. 1985 నుంచి జరిగిన అన్ని ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు అమలు చేశారని, ఇప్పుడు 23 శాతానికి తగ్గించడం బీసీల హక్కులను హరించడమే అన్నారు. రిజర్వేషన్లు 50%మించకూడదని 2013లో చెప్పిన సుప్రీంకు బీసీ జనాభా లెక్కలు పంపితే పునరాలోచించే అవకాశముందన్నారు.



మహదేవపూర్ మండలంలో మేడిగడ్డ బ్యారేజీని పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్



కన్నెపల్లి పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్

ఏమిటీ నిర్లక్ష్యం?

(మొదటి పేజీ తరువాయి)

నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలు, పంపు హౌజ్‌లను మంగళవారం సీఎం సందర్శించారు. మధ్యాహ్నం 1.45 గంటలకు మేడిగడ్డ బ్యారేజీని సందర్శించిన ముఖ్యమంత్రి.. రెండు గంటలకుపైగా పనులను పరిశీలించారు. 4వ ప్యాకేజీ పనులను స్వయంగా పరిశీలించారు. కేసీఆర్ పర్యటన మొత్తం పనులను పరిశీలిస్తూ.. అధికారులకు సూచనలు.. ఆదేశాలు జారీ చేస్తూ సాగింది. మేడిగడ్డ బ్యారేజీలో మొత్తం 85 గేట్లకు 12 గేట్ల నిర్మాణం మాత్రమే పూర్తి కావడంపై కేసీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. "నిధులకు కొరత లేదు. రాత్రింబవళ్లు పని చేస్తున్నారు. అయినా బ్యారేజీ పనులు ఎందుకు ముందుకు సాగడం లేదు!?" అంటూ అసహనం వ్యక్తం చేశారు. వర్షాల వల్ల కొంత ఆలస్యమైందని అధికారులు చెప్పడంతో ఇంకా ఏయే పనులు పెండింగ్‌లో ఉన్నాయని సీఎం ప్రశ్నించారు. బ్యారేజీ పనులు పూర్తయితే మహారాష్ట్ర వైపు 30 ఎకరాలకుపైగా ముంపునకు గురయ్యే అవకాశం ఉందని సీఈ వెంకటేశ్వర్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఇన్ని రోజులూ ఈ సమస్యను పరిష్కరించకుండా ఏం చేస్తున్నారని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్‌నాటికి గోదావరి జలాలను రైతులకు అందించాల్సి ఉందని, ఎప్పటిలోగా మేడిగడ్డ బ్యారేజీ పనులు పూర్తవుతాయని అక్కడే ఉన్న ఎల్అండ్‌టీ సీఎండీ సుబ్రమణ్యన్‌ను ప్రశ్నించారు. ఏప్రిల్ 31లోగా పూర్తి చేస్తామని ఆయన చెప్పడంతో.. అంత సమయం అవసరం లేదని, ఏప్రిల్ 15లోగా పనులన్నీ పూర్తి కావాలని నిర్దేశించారు. సాయంత్రం కన్నెపల్లి పంపుహౌజ్‌కు చేరుకున్నారు. నేరుగా గోదావరి నుంచి ఇంటేక్‌వెల్‌లోకి నీరు వచ్చే ప్రదేశం వద్ద పరిశీలించారు. అప్రోచ్ కెనాల్ మొత్తం కాంక్రీటుతో పూర్తి చేయాలని ఆదేశించారు. మార్చి 15లోగా కన్నెపల్లి పంపుహౌజ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరమైతే గోదావరిపై కాఫర్ డ్యాం నిర్మించి గోదావరి జలాలను కన్నెపల్లి పంపుహౌజ్‌కు మళ్లించాలని సూచించారు. ఆ నీటితో మార్చి 15లోగా వెట్ రన్ నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం, పంప్‌హౌజ్‌లో బిగిస్తున్న మోటార్లను పరిశీలించారు. ఎన్ని మోటార్లు బిగించాలని కేసీఆర్ ప్రశ్నించగా.. ఇప్పటి వరకు 4 బిగించామని, మరో 7 మోటార్లు బిగించాల్సి ఉందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. దాంతో, మొత్తం 11 మోటార్లను మార్చి 15లోగా బిగించాలని ఆదేశించారు. అయితే, కన్నెపల్లి పంపుహౌజ్ నుంచి అన్నారం వరకు వెళ్లే గ్రావిటీ కెనాల్ నిర్మాణం పూర్తి కాలేదని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వాటిని కూడా మార్చి 15లోగా మొత్తం పూర్తి చేసి సర్వం సిద్ధం చేయాలని ఆదేశించారు. కన్నెపల్లి పంపుహౌజ్‌తోపాటు సుందిళ్ల, గోలివాడ పంపుహౌజ్‌లను కూడా మార్చి 15లోగా పూర్తి చేయాలని నిర్దేశించారు.

నిధులకు ఎలాంటి ఇబ్బందుల్లేవు

నిధులపరంగా ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేయడంలో రాజీపడవద్దని సీఎం కోరారు. కాంట్రాక్టు ఏజెన్సీలు అవసరమైతే మ్యాన్‌పవర్ మరింత పెంచుకుని గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనులను సీఎంవో కార్యదర్శి పది రోజులకోసారి పర్యవేక్షిస్తారన్నారు. సబ్ స్టేషన్ పనులను పూర్తి చేయాలని ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్ రావును ఫోన్‌లో ఆదేశించారు.

రైతులు ఎదురు చూస్తున్నారు

సాగునీటి కోసం రైతులు ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా కాళేశ్వరం ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు సీఎం కేసీఆర్ సూచించారు. రాష్ట్ర ప్రజలు గత ఎన్నికల్లో భారీ మెజారిటీతో మళ్లీ టీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టం కట్టారని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి, ప్రభుత్వం కూడా చిత్తశుద్ధిని చాటుకుంటుందని చెప్పారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ పనులను కూడా పూర్తి చేసి, జూన్‌లో ఖరీఫ్ పంట కోసం రైతులకు సాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని, రోజుకు మూడు షిఫ్టుల్లో పనులు సాగాలని సూచించారు. గోదావరికి రెండువైపులా ఉండే ఫ్లడ్ బ్యాంక్స్ పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి.. మట్టి పని రివిట్‌మెంట్ పనులను పూర్తి జలాశయ మట్టం దాకా పూర్తి చేయాలని సూచించారు. మేడిగడ్డ బ్యారేజ్ కాంక్రీటు పనులు రోజుకు 10 వేల క్యూబిక్ మీటర్లకు తగ్గకుండా చేయాలని ఆదేశించారు. చెన్నై పోర్టులో ఉన్న మోటార్లను వెంటనే తెప్పించాలన్నారు. సీఎం కేసీఆర్‌తో పాటు సీఎస్ ఎస్కే జోషి, డీజీపీ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, జలవనరుల సంఘం చైర్మన్ ప్రకాష్‌తోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు.

నేడు అన్నారం.. సుందిళ్లకు

కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనలో భాగంగా సీఎం కేసీఆర్ బుధవారం పెద్దపల్లి జిల్లాలో నిర్మిస్తున్న అన్నారం పంప్‌హౌజ్, సుందిళ్ల బ్యారేజీ, గోలివాడ పంప్‌హౌజ్ పనులను పరిశీలించనున్నారు. మొదట ఖరారు చేసిన షెడ్యూల్ ప్రకారం మంగళవారమే వాటిని కూడా సందర్శించాలి. కానీ, సమయం సరిపోదని గమనించి షెడ్యూల్‌లో మార్పులు చేశారు. మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌస్ పనులను పరిశీలించి, సాయంత్రం 6 గంటలకు కరీంనగర్‌లోని ఉత్తర తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అక్కడే రాత్రి బస చేశారు. బుధవారం ఉదయం 10 గంటలకు అన్నారం బ్యారేజీకి చేరుకుంటారు. పనులను పరిశీలించి సుందిళ్ల బ్యారేజీకి చేరుకుంటారు. అక్కడే భోజనం చేసి గోలివాడ వద్ద నిర్మిస్తున్న సుందిళ్ల పంప్‌హౌస్ పనులను పరిశీలిస్తారు.



కేసీఆర్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్యేల స్వాగతం

» బొకే ఇచ్చిన శ్రీధర్‌బాబు, శాలువా కప్పిన గండ్ర

» టీఆర్ఎస్‌లో చేరుతున్నామనడం అవాస్తవం

» మీడియా కథనాలు దురదృష్టకరం: శ్రీధర్‌బాబు

మహదేవపూర్ రూరల్, జనవరి 1: ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా మంగళవారం మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, గండ్ర వెంకటరమణారెడ్డి స్వాగతం పలికారు. శ్రీధర్‌బాబు పూలబొకే ఇచ్చి స్వాగతం పలకగా, వెంకటరమణారెడ్డి శాలువా కప్పారు. దీంతో వారిద్దరూ టీఆర్ఎస్‌లో చేరబోతున్నారంటూ వార్తా చానళ్లలో కథనాలు ప్రసారమయ్యాయి. ఈ వార్తలను శ్రీధర్‌బాబు ఖండించారు. మేడిగడ్డ బ్యారేజీ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేసీఆర్ రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత జిల్లాకు వస్తుండటంతో మంథని నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించి వినతులను సమర్పించడానికే వచ్చానని తెలిపారు.

దేవాదులనూ చూసి రండి!

» విశ్రాంత ఇంజనీర్లకు కేసీఆర్ సూచన

» ఇతర ప్రాజెక్టులనూ పరిశీలిస్తున్న బృందం

హైదరాబాద్/నాగర్‌కర్నూలు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): దేవాదుల ప్రాజెక్టును కూడా చూసి రావాలని ముఖ్యమంత్రి కేసీఆర్ విశ్రాంత ఇంజనీర్లకు సూచించినట్లు తెలిసింది. వారి పరిశీలన తర్వాత సాగునీటి ప్రాజెక్టులపై విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించారు. ప్రస్తుతం ఆయన కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనలో ఉన్న విషయం తెలిసిందే. ఆయన సందర్శనకు ఒకరోజు ముందుగా కాళేశ్వరం ప్రాజెక్టును విశ్రాంత ఇంజనీర్లు పరిశీలించి వచ్చారు. తమ సందర్శన వివరాలను సోమవారం సాయంత్రం వారు సీఎంకు వివరించారు. తిరిగి మంగళవారం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణ పనుల్ని పరిశీలించారు. బుధవారం సీతారామ ప్రాజెక్టును సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలోనే దేవాదుల ప్రాజెక్టును కూడా పరిశీలించాల్సిందిగా వారికి సీఎం కేసీఆర్ సూచించినట్లు సమాచారం. ఈ ప్రాజెక్టులో భాగంగా రామప్ప పరిధిలో పైపులైన్ వేయాలా? లేక సొరంగం నిర్మించాలా? అనే విషయంపై కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని పరిశీలించి రావాల్సిందిగా సీఎం సూచించారు. ఆయా ప్రాజెక్టుల పరిశీలన పూర్తయిన తర్వాత విశ్రాంత ఇంజనీర్లు సీఎంకు ప్రత్యేక నివేదికను అందజేయనున్నారు. దాని ఆధారంగా ప్రాజెక్టుల నిర్మాణాలపై విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించే అవకాశం ఉంది. అప్పటికి ముఖ్యమంత్రి కాళేశ్వరం, శ్రీరాంసాగర్ పునరుజ్జీవ ప్రాజెక్టుల పరిశీలనను పూర్తి చేయనున్నారు.

లోక్‌సభ స్థానాలన్నీ కాంగ్రెస్ ఖాతాలోనే

» రాహుల్ ప్రధాని కావడం ఖాయం: ఉత్తమ్



మేళ్లచెర్వు రూరల్, జనవరి 1: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలోని అన్ని లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సీట్లు సాధిస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ హయాంలో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించామని, ఇప్పుడు 22%కు తగ్గించడం బాధాకరమన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపుదల కోసం న్యాయ పోరాటం చేస్తామన్నారు. నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలందరికీ మేలు జరగాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని దేవుడిని ప్రార్థిస్తున్నానన్నారు. రాష్ట్ర ప్రజలకు ఉత్తమ్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. హుజూర్‌నగర్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చి దిద్దుతానన్నారు. తన నియోజకవర్గంలో గతంలో వేల కోట్ల రూపాయలతో రహదారులు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, సాగు, తాగునీటి పథకాలు, మట్టపల్లి బ్రిడ్జి, డిగ్రీ కళాశాల, 100 పడకల ఆస్పత్రి, మోడల్ స్కూల్స్ తదితర అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. నిధులు మంజూరై మిగిలిపోయిన పనులను, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. పులిచింతల ముంపు బాధితుల పునరావాస కేంద్రాల్లో మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడతానన్నారు. పంచాయతీ ఎన్నికల కోసం త్వరలో గ్రామ, మండల సమన్వయ కమిటీలు వేస్తానన్నారు. సర్పంచ్ అభ్యర్థులను ఈ కమిటీలు ఎంపిక చేయాలని సూచించారు.



కేటీఆర్‌ని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న కోటి తదితరులు

సందడిగా తెలంగాణ భవన్

» కేటీఆర్‌కు నేతల కొత్త సంవత్సర శుభాకాంక్షలు

» మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల రాక

» కేసీఆర్‌పై పాటను ఆవిష్కరించిన సంగీత దర్శకుడు కోటి

» అంధ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసిన కేటీఆర్

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని మంగళవారం టీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్ సందడిగా మారింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు పలువురు నేతలు, ప్రముఖులు తరలివచ్చారు. కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో మాజీ మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు. ప్రముఖ సినీ సంగీత దర్శకుడు కోటి, గాయని పసల బేబి కేటీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌పై రచయిత రామలింగం రాసిన పాటను కోటి ఆవిష్కరించారు. గాయని బేబి ఆ పాటను పాడి వినిపించారు. మరోవైపు వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో అంధ విద్యార్థులు కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారితో కలిసి కేటీఆర్ కేక్ కట్ చేశారు. టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్ కూడా కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ హోంగార్డ్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆ సంఘం గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం-2019 కేలండర్‌ను కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధికి అధికారులంతా మరింత బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

విస్తరణ ఇంకాస్త లేటు?

» గ్రామ పంచాయతీ ఎన్నికలే కారణం

» పదవులకు మరో నెల ఆగక తప్పదేమో

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల ఎన్నికల దృష్ట్యా మంత్రివర్గ విస్తరణ ఉంటుందా? లేదా? అనే అంశంపై చర్చ మొదలైంది. జనవరిలో విస్తరణ ఉంటుందని ఇప్పటి వరకు భావించారు. అయితే ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో విస్తరణ వాయిదా పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. విస్తరణకు ఈ షెడ్యూల్ చట్టపరంగా అడ్డంకి కానప్పటికీ ఎమ్మెల్యేలంతా ఎన్నికల్లో నిమగ్నమై ఉండడం వల్ల విస్తరణ ఉండకపోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదే జరిగితే ఫిబ్రవరిలో విస్తరణ ఉంటుందని భావిస్తున్నారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్, హోం మంత్రిగా మహమ్మూద్ అలీ మాత్రమే ప్రమాణ స్వీకారం చేశారు. పరిమితంగా మరో 6 గురు లేదా ఎనిమిది మందితో మంత్రివర్గ విస్తరణ ఉంటుందని భావిస్తూ వచ్చారు. ప్రస్తుతం పలు శాఖలను విలీనం చేస్తున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే విస్తరణ ఉండవచ్చని భావించారు. సంక్రాంతి పండుగ తర్వాత జనవరి ముగిసేలోగా విస్తరణ ఉంటుందని పలువురు ఎమ్మెల్యేలు ఆశతో ఉన్నారు. మంగళవారం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెలాఖరు వరకు పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయి. మూడో దశ ఎన్నికలు ఈ నెల 30న జరుగనున్నాయి. సాధారణంగా ఇది మంత్రివర్గ విస్తరణకు అడ్డంకి కాదు. అయితే ఎన్నికలు జరుగుతున్నందున విస్తరణ ఎందుకులే అని సీఎం అనుకుంటే మాత్రం వాయిదా పడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ఎమ్మెల్యేలందరూ ఎన్నికల్లో నిమగ్నమై ఉంటారు. విస్తరణ చేపడితే ఎన్నికలపై ప్రభావం పడే అవకాశం ఉందన్న కోణంలో ఆలోచిస్తే ఫిబ్రవరి వరకు ఆగక తప్పకపోవచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

బుల్లెట్ రైళ్లకు ప్రాధాన్యం

» ప్రయాణికుల భద్రతకు పెద్దపీట

» రైల్వేబోర్డు చైర్మన్ వీకే యాదవ్ వెల్లడి

» రైల్ నిలయంలో బాధ్యతల స్వీకరణ

» ఆ వెంటనే ఢిల్లీకి పయనం



హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): భారతీయ రైల్వే వ్యవస్థలో అత్యున్నత స్థానమైన రైల్వే బోర్డు చైర్మన్‌గా వినోద్‌కుమార్ యాదవ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బోర్డు చైర్మన్‌గా ఆయన కేంద్ర ప్రభుత్వ ఎక్స్ అఫీషియో సెక్రటరీ హోదాతో విధులు నిర్వర్తించనున్నారు. ఇప్పటి వరకు దక్షిణ మధ్య రైల్వే జీఎంగా ఉన్న ఆయన.. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలోనే కొత్త బాధ్యతలు స్వీకరించడం గమనార్హం. ఆ వెంటనే ఆయన ఢిల్లీకి పయనమయ్యారు. బాధ్యతల స్వీకరణ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైల్వే బోర్డు చైర్మన్‌గా తాను హైస్పీడ్ బుల్లెట్ రైళ్ల ప్రాజెక్టుకు ప్రాధాన్యమిస్తానన్నారు. దాంతోపాటు.. సెమీ హైస్పీడ్, డెడికేటెడ్ కారిడార్ల ఏర్పాటు, కొత్త రైల్వే మార్గాల నిర్మాణం, ప్రస్తుత లైన్లను డబ్లింగ్, ట్రిప్లింగ్ చేయడం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. ప్రయాణికుల భద్రతకు పెద్ద పీట వేస్తానని వ్యాఖ్యానించారు. రైల్వేల్లో మౌలిక సదుపాయాలు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో పలు చర్యలు చేపట్టిందన్నారు. ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు కల్పించడమే రైల్వే ప్రధాన లక్ష్యమన్నారు. పలు రైల్వే స్టేషన్లను ఆధునికీకరించామని, 68 స్టేషన్లను ఈ ఏడాది చివరి నాటికి పునరుద్ధరిస్తామని తెలిపారు. అంతకు ముందు ఆయన దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఆరు డివిజన్ల మేనేజర్లతో సమీక్ష జరిపారు.

నాతోనే జనం.. నాదే ప్రభంజనం

(మొదటి పేజీ తరువాయి)

న్యాయప్రక్రియ పూర్తయ్యాకే.. రాజ్యాంగపరిధిలో నిర్మిస్తామని వివరించారు. కొత్త సంవత్సరం తొలి రోజునే ఇంటర్వ్యూ రూపంలో మోదీ ప్రజల ముందుకు వచ్చారు. సర్జికల్ స్ట్రైక్స్, రుణమాఫీ నుంచి శబరిమల, ట్రిపుల్ తలాక్, ఉర్జిత్ పటేల్ రాజీనామా దాకా పలు అంశాలపై మాట్లాడారు. 2018 విజయవంతంగా ముగిసిందని.. అందులో ఎన్నికలు ఒక అంశమని పేర్కొన్నారు. మూడు రాష్ట్రాల్లో అధికారం కోల్పోవడాన్ని తేలిగ్గా తీసుకున్న ఆయన.. కాంగ్రెస్ ప్రథమ కుటుంబం బెయిల్‌పై బయట ఉందంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సైతం కాంగ్రెస్ సంస్కృతి నుంచి బయటపడాలన్నారు. ఏఎన్ఐ ఎడిటర్ స్మితా ప్రకాశ్ అడిగిన ప్రశ్నలకు ప్రధాని సవివరంగా సమాధానాలు ఇచ్చారు. ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు ఇవి...

● 'మోదీ మ్యాజిక్' తగ్గుతోందా!

'మోదీ మ్యాజిక్' అంటూ ఒకటుందని అంగీకరించినందుకు వారికి ధన్యవాదాలు. 'మోదీ ప్రభంజనం ముగిసింది' అంటూ కొందరు వ్యక్తులు ప్రతిసారీ చెబుతూనే ఉంటారు. ఒకరిద్దరు ఎక్కువ, తక్కువ కావచ్చు కానీ... ఆ 'కొందరు' అలాగే ఉంటారు. 2014 ఎన్నికల ముందు కూడా ఇదే చెప్పారు. బీజేపీకి 200 సీట్లు కూడా రావన్నారు. ఇప్పుడూ అదే అంటున్నారు.



వారెవరో మీకూ తెలుసు. తమ ఆకాంక్షలు, కలలను నెరవేరుస్తారనే విశ్వాసం నుంచే 'ప్రభంజనం' పుడుతుంది. అలాంటి విశ్వాసం ఇప్పుడు దేశ యువతలో కనిపిస్తోంది. సామాన్య ప్రజలకు అన్నీ తెలుసు!

● 'మందిరం'పై ముందు కోర్టు తేల్చనీ...



అయోధ్యలో రాజ్యాంగ ప్రక్రియకు లోబడి రామమందిరం నిర్మిస్తామని బీజేపీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చాం. ప్రస్తుతం ఈ అంశం సుప్రీం కోర్టు పరిధిలో ఉంది. కాంగ్రెస్ న్యాయవాదులు అడ్డంకులు సృష్టిస్తుండటంతో విచారణ ప్రక్రియ ఆలస్యమవుతోంది. అంతలోనే... ఆర్డినెన్స్ జారీపై బయట చర్చ జరుగుతోంది. అయితే... ముందు న్యాయ ప్రక్రియ పూర్తి కానివ్వండి! ఆ తర్వాతే మందిర నిర్మాణం కోసం ప్రభుత్వ బాధ్యతగా చేయాల్సిన అన్ని ప్రయత్నాలు చేస్తాం.

● ఓడింది ఛత్తీస్‌గఢ్‌లోనే...

ఇటీవలే ఐదు రాష్ట్రాల ఎన్నికలు జరిగాయి. తెలంగాణ, మిజోరాంలో ఎవరూ బీజేపీకి ఏమాత్రం అవకాశమివ్వలేదు. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో వచ్చింది హంగ్ అసెంబ్లీ మాత్రమే. అక్కడ ప్రభుత్వ వ్యతిరేకత కూడా కనిపించింది. ఇక... మాకు ఘోర పరాజయం ఎదురైంది ఛత్తీస్‌గఢ్‌లో మాత్రమే. అదే సమయంలో... త్రిపుర, హరియాణాలలో జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికలు, జమ్మూ కశ్మీర్ పంచాయతీ ఎన్నికల్లో మాకు లభించిన విజయాన్ని కూడా గుర్తించాలి. హరియాణాలోని మొత్తం మునిసిపల్ కార్పొరేషన్లలో గెలిచాం. త్రిపురలో 90-95 శాతం సొంతం చేసుకున్నాం. కశ్మీర్‌లో మా పార్టీ తరఫున 30 నుంచి 35వేల మంది గెలిచారు. గెలుపోటములు మాత్రమే అన్నింటికీ కొలబద్ధ కాదు.

● కాంగ్రెస్‌కు స్వీయ ముక్తి అవసరం!

కాంగ్రెస్ ముక్త్ భారత్ గురించి గతంలో చాలాసార్లు మాట్లాడాను. కాంగ్రెస్ అనేది ఒక 'సంస్కృతి'. కులతత్వం, కుటుంబ రాజకీయం, అవినీతి, అప్రజాస్వామ్యం... ఇవన్నీ కాంగ్రెస్ సంస్కృతిలో భాగం. కాంగ్రెస్ ముక్త్ భారత్ అంటే... ఈ సంస్కృతి లేని భారత్‌ను సాధించడమే. ఇంకా చెప్పాలంటే... కాంగ్రెస్ సంస్కృతి నుంచి కాంగ్రెస్ పార్టీ కూడా ముక్తి పొందాలి. విపక్షంగా కాంగ్రెస్ పార్టీ విఫలమైంది. అది ఒక కుటుంబ పార్టీ! నాలుగు తరాలు దేశాన్ని ఏలిన 'ఫస్ట్ ఫ్యామిలీ' వారిది. 2జీ, కామన్ వెల్త్ స్కామ్, నేషనల్ హెరాల్డ్ ఇలా అనేక కుంభకోణాలకు పాల్పడి... బెయిలుపై బయట స్వేచ్ఛగా తిరుగుతున్నారు. ఇది చాలా పెద్ద విషయం!

● వ్యవస్థల గురించి కాంగ్రెస్ మాట్లాడటమా...

సీబీఐ, ఆర్బీఐ, ఈడీ వంటి వ్యవస్థలను దెబ్బతీస్తున్నట్లు మమ్మల్ని విమర్శిస్తున్నారు. కాంగ్రెస్‌కు దీని గురించి మాట్లాడే హక్కు లేదు. ప్రధాని కార్యాలయాన్ని తోసిరాజంటూ సోనియా నేతృత్వంలో జాతీయ సలహా మండలిని ప్రవేశపెట్టారు. కేంద్ర కేబినెట్ తీర్మాన ప్రతిని విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ ముక్కలుగా చించేశారు. న్యాయవ్యవస్థలోనూ వేలు పెట్టారు. సీనియర్ జడ్జిలను కాదని... తమకు అనుకూలమైన జూనియర్‌లకు పదవులిచ్చారు. ఆర్బీఐ గవర్నర్లకు ఎన్నోసార్లు ఉద్వాసన పలికారు. ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్‌ను జోకర్‌గా అభివర్ణించారు. వాళ్లు మమ్మల్ని విమర్శించడమేమిటి! సోహ్రాబుద్దీన్ కేసు తీర్పులో ఏం చెప్పారో చూడండి. వ్యవస్థలను కాంగ్రెస్ ఎలా దుర్వినియోగం చేసిందో తెలుస్తుంది. అగస్టా వెస్ట్‌ల్యాండ్ కేసులో దళారీ మిచెల్‌ను దుబాయ్ నుంచి తీసుకొస్తే... ఆయన తరఫున కాంగ్రెస్ న్యాయవాది వాదించడం ఎందుకు? మా విషయానికి వస్తే... సీబీఐలో ఇద్దరు ముఖ్య వ్యక్తుల మధ్య విభేదాలు వచ్చినప్పుడు... ఆ సంస్థ ప్రతిష్ఠను దృష్టిలో పెట్టుకుని ఇద్దరినీ సెలవులో పంపించారు. ఇక... ఆర్బీఐ గవర్నర్ పదవికి వ్యక్తిగత కారణాలవల్లే రాజీనామా చేసినట్లు ఉర్జిత్ పటేల్ స్పష్టంగా చెప్పారు. ఆయనపై రాజకీయ ఒత్తిళ్ల సమస్యే లేదు. మొట్టమొదటిసారి ఈ విషయం బయటపెడుతున్నాను. ఉర్జిత్ పటేల్ ఆరేడు నెలల కిందటే నన్ను కలిశారు. వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్లు లేఖ కూడా ఇచ్చారు.

● అనిల్ అంబానీ కోసం దసో, ఫ్రాన్స్‌పై ఒత్తిడి

ఈ ఆరోపణలు నాపై కాదు! మా ప్రభుత్వంపై చేస్తున్నారు. ఈ ఆరోపణలు దేశ రక్షణ బలగాలను బలహీనపరుస్తున్నాయి. ఈ ఆరోపణల గురించి నేను పట్టించుకోను. నన్ను వ్యక్తిగతంగా నిందిస్తున్నారని బాధపడుతూ కూర్చోవాలా... లేక దేశ భద్రతా అవసరాలు తీర్చడంపై దృష్టి సారించాలా? రాఫెల్ విమానాలను వీలైనంత త్వరగా సమకూర్చుకునేందుకు ప్రయత్నిస్తాం. వాళ్లు అలా నాపై ఎంద బురద చల్లినా సరే... నేను నిజాయితీ మార్గంలోనే ప్రయాణిస్తాను. మన సైనికులను గాలికి వదిలేయను. ఆరోపణలు వచ్చినా సరే... సైన్యానికి అవసరమైనవన్నీ సమకూర్చి తీరుతాం.

సర్జికల్ స్ట్రైక్స్... రిస్క్ అని తెలుసు!

"కశ్మీర్‌లోని ఉడీలో సైనిక స్థావరంపై ఉగ్రవాదులు దాడి చేశారు. మన జవాన్లు 20 మంది సజీవ దహనమయ్యారు. నా మనసుకు చాలా కష్టమనిపించింది. దీనికి గట్టిగా బదులు చెప్పాలని ఆర్మీ అధికారులు భావించారు. 'సరే' అంటూ వారికి స్వేచ్ఛ ఇచ్చాం. 2016 సెప్టెంబరు 28న మన కమెండోలు నియంత్రణ రేఖ దాటి పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో మెరుపుదాడులు చేశారు. ఇదిపెద్ద రిస్క్ అని నాకూ తెలుసు. దేశం కోసం ప్రాణత్యాగం చేసేందుకూ మన సైనికులు వెనుకాడరు. కానీ.. ఈ ఆపరేషన్‌లో వారికి ఎలాంటి హాని కలగొద్దని నా ఉద్దేశం. మిషన్ విఫలమైనా నేను పట్టించుకోను... కానీ, మీరు మాత్రం సూర్యోదయ సమయానికి క్షేమంగా వెనుతిరిగి వచ్చేయండి అని కమెండోలకు చెప్పాను. మన వాళ్లు ఎల్‌వోసీని దాటారు. ఆ క్షణం నుంచి ఉత్కంఠ మొదలైంది. ఆ రోజు రాత్రంతా ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకుంటూనే ఉన్నాను. మరోగంటలో తెల్లవారుతుందనగా... అక్కడేం జరుగుతోందనే సమాచారం తెలియలేదు. సూర్యోదయం తర్వాతా అదే పరిస్థితి! అంతలో... 'మనవాళ్లు సేఫ్ జోన్‌లోనే ఉన్నారు' అని సమాచారం వచ్చింది. వెళ్లిన వాళ్లంతా క్షేమంగా తిరిగి వచ్చారని నిర్ధారణ అయ్యేదాకా నా మనసు మనసులో ఉండదన్నాను. మొత్తానికి ఈ ఆపరేషన్ విజయవంతమైంది. కానీ... కొన్ని పార్టీలు మాత్రం సర్జికల్ స్ట్రైక్స్‌పై సందేహాలు లేవనెత్తాయి. అలా సందేహాలు వ్యక్తం చేయడం పాకిస్థాన్‌కు అవసరం! కానీ పాక్ మాటల్నే ఇక్కడి వాళ్లు మాట్లాడారు.



తలాక్, శబరిమల వేర్వేరు...

ఇవి రెండూ వేర్వేరు అంశాలు! ప్రపంచంలోని అనేక ఇస్లామిక్ దేశాలే ట్రిపుల్ తలాక్‌ను నిషేధించాయి. పొరుగున ఉన్న పాకిస్థాన్ కూడా నిషేధించింది. అంటే... ఇది మతపరమైన విశ్వాసం, సంప్రదాయం కానే కాదు. నిజంగా అది మత విశ్వాసమై ఉంటే... తక్షణ తలాక్‌పై ఆ దేశాలు నిషేధం విధించేవి కాదు. తలాక్ రద్దు... సామాజిక న్యాయం, లైంగిక సమానత్వానికి సంబంధించినది. అందరికీ సమాన న్యాయం జరగాలన్నది భారత స్వాభావిక ధర్మం! ఇక... శబరిమల అంశం సంప్రదాయానికి సంబంధించినది. మన దేశంలో కొన్ని ఆలయాల్లోకి పురుషులకు ప్రవేశం లేదు. పురుషులు అక్కడికి వెళ్లలేరు. శబరిమలపై ఒక మహిళా న్యాయమూర్తి కూడా తీర్పులో కొన్ని వ్యాఖ్యలు చేశారు. మహిళగా ఆమె కొన్ని సూచనలు ఇచ్చారు. వాటిపై చర్చ జరగాలి.



పెద్దనోట్ల రద్దు 'షాక్' కాదు!

పెద్ద నోట్ల రద్దు ప్రజలకు ఆకస్మికంగా ఇచ్చిన 'షాక్' కానేకాదు. నల్లధనం, దాని నియంత్రణ గురించి అంతకు ముందు ఏడాది నుంచే మాట్లాడుతున్నాం. నల్లధనం ఉంటే బయటపెట్టాలని, జరిమానాలు కడితే ఎలాంటి సమస్య ఉండదని చెప్పాం. చాలా కొద్దిమంది మాత్రమే స్పందించారు. మిగిలిన వాళ్లు... 'మోదీ కూడా అందరి లాగా మాటలు చెబుతున్నాడులే' అనుకున్నారు. నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ దేశాన్ని వదిలి ఎందుకు పారిపోయారనుకున్నారు? పెద్దనోట్ల రద్దు వల్లే! అలా పారిపోయిన వాళ్లందరినీ తిరిగి తీసుకొస్తాం! ఈరోజు కాకుంటే... రేపు! ఇది జరిగి తీరుతుంది. భారతదేశ సొమ్మును దోచుకున్న వాళ్ల నుంచి ప్రతి పైసా కక్కించి తీరుతాం.

కేసీఆర్ కూటమా!? ఆ విషయం నాకు తెలియదే!



ఏఎన్ఐ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జనవరి 1: వచ్చే ఎన్నికలు 'మహా కూటమి వర్సెస్ భారత దేశ ప్రజల' మధ్యే జరుగుతాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రజల ప్రేమ, ఆశీర్వాదానికి తాను ప్రతి రూపమని తెలిపారు. టీడీపీ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు చొరవతో కాంగ్రెస్‌తో కలిసి ఏర్పాటు చేస్తున్న 'మహా కూటమి'ని తేలిగ్గా తీసుకున్నారు. కాంగ్రెస్, బీజేపీల్లేని 'ఫెడరల్ ఫ్రంట్' పేరిట టీఆర్ఎస్ సారథి, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న ప్రయత్నాల గురించి తనకు అస్సలు తెలియదని వ్యాఖ్యానించారు. మంగళవారం ఏఎన్ఐ ఎడిటర్ స్మితా ప్రకాశ్‌కు ప్రధాని మోదీ ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. 'కేసీఆర్ ఏర్పాటు చేస్తున్న ఫెడరల్ ఫ్రంట్ వెనుక మోదీయే ఉన్నారని చంద్రబాబు ఆరోపిస్తున్నారు కదా!' అని ప్రశ్నించగా... "అలాంటి కూటమి ఏర్పడిందనీ, ఏర్పడుతోందని నాకు తెలియదు. ఆ విషయం నా దృష్టికే రాలేదు. నేను మరీ అంత అజ్ఞానంలో ఉన్నానని అనుకోవడం లేదు" అని బదులిచ్చారు. ఇక... చంద్రబాబు ఆరోపణలు ఆక్రోశంతో చేస్తున్నవే అని తెలిపారు. "ఆయనకు తెలంగాణపై ఏదైతే ద్వేషభావం ఉందో... తెలంగాణ ఎన్నికల్లో ఆయన ఆశలు అడియాశలు అయ్యాయో అందరికీ తెలుసు. ఆ బాధతో ఏదో అంటే నేనేమీ చేయలేను" అని చంద్రబాబుకు చురకలు అంటించారు.

ఎందుకీ కూటమి...

అసలు మహా కూటమి ఎందుకని ప్రధాని మోదీ ప్రశ్నించారు. తెలంగాణలో బీజేపీ వ్యతిరేక మహా కూటమి పూర్తిగా విఫలమైందని తెలిపారు. "మహా కూటమి, మహా కూటమి... ఇది ఎందుకు? ఐదేళ్లయిపోయింది. కాంగ్రెస్‌ను వ్యతిరేకించి బయటకు వచ్చిన వారు, కాంగ్రెస్‌ను ఆది నుంచీ ఆది నుంచీ ద్వేషిస్తున్న వారు కూటమి అంటున్నారు. వారంతా ఎక్కడైనా, ఎప్పుడైనా వారు ఒకచోట కూర్చుని, ఒక్కమాట మీద ఉన్నారా? ఆర్థిక అంశాలు, దేశ సమస్యలపై ఈ ఐదేళ్లలో ఏకాభిప్రాయంతో ఒక్కసారైనా మాట్లాడారా? వారందరి లక్ష్యం మోదీయే! మోదీని అది చేయాలి, మోదీని అది చేయాలి అంటారు. కానీ, దేశంకోసం ఏం చేస్తామన్నది ఎవ్వరూ చెప్పరు!" అని విమర్శించారు. 'మోదీ తప్ప మరెవరైనా సరే అని కూటమి నేతలు చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో ఇదే ప్రధానాంశం అవుతుందా' అని ప్రశ్నించగా... దేశ ప్రజలే ఎన్నికల అజెండాను నిర్ణయిస్తారని మోదీ స్పష్టం చేశారు. "తమ ఆకాంక్షలవెంట ఎవరున్నారు, వ్యతిరేకంగా ఎవరున్నారనేదే ప్రజలే గమనిస్తారు. 'ఈ ఎన్నికలు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన వారికీ, వారి నమ్మకాన్ని వమ్ము చేసిన వారికీ మధ్య జరుగుతాయి. ఈ పోరులో జనం మావెంటే ఉంటారు" అని ధీమా వ్యక్తం చేశారు.

మాతోనే మిత్రులు...

2014కంటే ఎక్కువగా పార్టీలు ఎన్డీయేతో ఉన్నాయని ప్రధాని మోదీ తెలిపారు. మాయావతి ఎన్డీయే కూటమిలో చేరతారా అనే ప్రశ్నకు సూటిగా సమాధానం ఇవ్వలేదు. "ఎవరు వస్తారు, ఎవరు రారు అనేది టీవీల ముందు బహిరంగంగా నేను చెప్పలేను. కానీ... కూటమికి తిరస్కారం మాత్రం తథ్యం. నేతలు తమను తాము కాపాడుకోవడానికి పైస్థాయిలో కలిసినంత మాత్రాన... ప్రజలంతా మద్దతుగా నిలుస్తారని భావించవద్దు. అసలు కూటమి గురించి మాట్లాడటమే అనవసరం" అని తెలిపారు.

రుణ మాఫీలు.. రాజకీయ స్టంట్లు

- వాటితో మెజారిటీ రైతులకు లబ్ధి జరగదు
- బ్యాంకుల్లో అప్పులున్నది తక్కువ మందికే
- మెజారిటీ రైతుల రుణం అప్పులోళ్ల నుంచే
- అప్పు అవసరం లేని పరిస్థితి తేవాలి
- రుణ మాఫీ కాదు.. సాధికారతే లక్ష్యం: మోదీ



న్యూఢిల్లీ, జనవరి 1: మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌ల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇచ్చిన రుణ మాఫీ హామీలను 'పొలిటికల్ స్టంట్లు'గా ప్రధాన మంత్రి మోదీ అభివర్ణించారు. 'తప్పుదోవ' పట్టించే ఇటువంటి ప్రకటనలతో మెజారిటీ రైతులకు లబ్ధి జరగదని చెప్పారు. ఎందుకంటే, వాళ్ల రుణాలు తీసుకునేది బ్యాంకుల నుంచి కాదని, అప్పులోళ్ల నుంచని తెలిపారు. "అబద్ధాలు చెప్పడం.. తప్పుదోవ పట్టించడాన్నే నేను లాలీపాప్‌లు అని అన్నాను. 'వ్యవసాయ రుణాలన్నీ మేం మాఫీ చేసేశాం' అని చెబుతున్నారు. కానీ, వాస్తవానికి అలా జరగడం లేదు. ఇందుకు, వాళ్ల జారీ చేసిన ఉత్తర్వులనే చూడండి. వాళ్ల తప్పుదోవ పట్టించకూడదు. మరీ ముఖ్యంగా, బాధ్యతాయుతమైన రాజకీయ పార్టీ ఇటువంటి పని చేయకూడదు" అని హితవు పలికారు. రైతుల సమస్యలకు ఒకే ఒక్క పరిష్కారం వారికి సాధికారత కల్పించడమని, విత్తనాల నుంచి మార్కెట్ వరకూ అన్ని సౌకర్యాలనూ వారికి అందించడమని అన్నారు. అందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కట్టుబడి ఉందన్నారు. "రుణ మాఫీ ఆదుకుంటుందని అనుకుంటే, దానిని చేసి తీరాల్సిందే. కానీ, గతంలో చాలా ప్రభుత్వాలు రుణ మాఫీ చేశాయి. దేవీలాల్ ప్రధానిగా ఉన్న కాలం నుంచే రుణాలు మాఫీ చేస్తున్నారు. 2009లో ఎన్నికల విజయమూ దాని ఫలితమే. మన వ్యవస్థలో లోపం ఏమిటంటే.. రైతులు అప్పుల ఊబిల్లో కూరుకుపోతున్నారు. 'ఎన్నికలు-రుణ మాఫీలు' అనే విష వలయాన్ని పార్టీలు మళ్లీ మళ్లీ హామీ ఇస్తున్నాయి" అని తప్పుబట్టారు. రైతులకు ఉద్దేశించిన వంద పథకాలను కోల్డ్ స్టోరేజీలో పెట్టారని, తాము వాటిని మళ్లీ ప్రారంభించామని తెలిపారు. "రైతులకు అప్పులు ఎందుకు ఉండాలి. అసలు రైతుకు అప్పు అవసరం లేని పరిస్థితిని మనం తీసుకు రావాలి. స్వామినాథన్ కమిటీ నివేదికను 2007లోనే అమలు చేసి ఉంటే.. రైతులకు ఇప్పుడు అప్పులే అవసరం ఉండేది కాదు. దాని బదులు, ఎన్నికల్లో గెలుపు మార్గాలను వాళ్లు అన్వేషించారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే రైతులు పరిమితమే. మెజారిటీ రైతులు అప్పులోళ్ల నుంచే తీసుకుంటారు. రుణ మాఫీ ప్రకటిస్తే.. ఈ రైతులు లబ్ధిదారులు కాబోరు. ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులంతా ఈ పరిధికి బయట ఉన్న వారే" అని వివరించారు. అయినా, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు రుణ మాఫీని అమలు చేస్తుంటే.. తామేమీ వాటిని అడ్డుకోవడం లేదని చెప్పారు. బ్యాంకులను లూటీ చేసిన వాళ్ల ఆ సొమ్మును తిరిగి చెల్లించేలా కేంద్రం చట్టాలు చేసిందని, ఇప్పటికే 3 లక్షల కోట్లు తిరిగి వచ్చాయని తెలిపారు.

మోదీ ఇంటర్వ్యూపై ఎవరేమన్నారంటే

- నోట్ల రద్దు, జీఎస్టీ, బ్యాంకుల్లో కుంభకోణాలు, రైతుల కష్టాల గురించి వదిలేసి ఇంటర్వ్యూ మొత్తం 'నేను, నాది, నేనే' ఈ పదాలతోనే సాగింది. మోదీ బూటకపు హామీలతో దేశం కష్టాలు పడుతోంది. -కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సూర్జేవాలా
- ముందుగానే అనుకుని చేసిన ఒక బూటకపు ఇంటర్వ్యూ ద్వారా ప్రజలను మోసం చేయలేరు. దేశ అభివృద్ధి, సమస్యలపై ప్రధాని పార్లమెంటులో, ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాలి -కాంగ్రెస్ సీనియర్ నేత ఆనంద్ శర్మ
- ప్రతిపక్షాల ఉద్దేశపూర్వక దుష్ప్రచారాన్ని ప్రధాని మోదీ ఒకే ఇంటర్వ్యూతో తిప్పికొట్టారు. దేశంలోని అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలపై ప్రధాని సమగ్రంగా మాట్లాడారు. -బీజేపీ అధికార ప్రతినిధి నళిన్ కోహ్లీ
- ప్రస్తుత బీజేపీ ప్రభుత్వమే రామాలయాన్ని నిర్మిస్తుందని ప్రజలు భావిస్తున్నారు -ఆరెస్సెస్
- నరేంద్ర మోదీ దృష్టిలో రాముడు చట్టం కంటే గొప్పవాడు కాదు. -సంజయ్ రౌత్, శివసేన
- కొద్ది రోజుల్లో దిగిపోయే ప్రధాని మాటలు ఏమంత ప్రభావం చూపవు. ఇంటర్వ్యూలో సోనియాను విమర్శించడానికి బదులు ప్రజలకు ఇచ్చిన హామీల గురించి మాట్లాడితే బాగుండేది. రైతుల సమస్యలను ప్రస్తావిస్తే బాగుండేది. -సంజయ్ సింగ్, ఆప్ నేత

ఫెడరల్ ఫ్రంట్ ఎక్కడ?

మమత, నవీన్ చేరారని బీజేపీకెవరు చెప్పారు?.. ప్రధానిపై చంద్రబాబు ఫైర్

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ వల్ల దేశానికి ఏం లాభం జరిగిందని ఏపీ సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. మహాకూటమి విఫలమయ్యిందని, చంద్రబాబు ఆక్రోశంతో మాట్లాడుతున్నారని మోదీ ఏఎన్ఐ ఇంటర్వ్యూలో అనడంపై తీవ్రంగా స్పందిస్తూ- 'మోదీ వల్ల దేశానికి ఒరిగేందేమిటి? ఈడీ, సీబీఐ, ఐటీ, ఆర్‌బీఐ సహా సమస్త వ్యవస్థల్నీ భ్రష్టుపట్టించారు. చివరకు సుప్రీం కోర్టుకూ తప్పుడు సమాచారం ఇస్తున్నారు. వృద్ధి రేటు ఏముంది? పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీలతో మీరు ఏం ఆర్థికాభివృద్ధి సాధించారు? దేశంలో అవినీతిని ఏం తగ్గించారు? ఢిల్లీలో కూర్చుని ఏదంటే అది మాట్లాడడం కాదు. నేను లేవనెత్తిన అంశాలపై చర్చకు సిద్ధమేనా?" అని చంద్రబాబు సవాల్ విసిరారు. 'రాఫెల్ ఒప్పందంలో అవకతవకలపై ఏం చెబుతారు? బ్యాంకులను ముంచిన అవినీతిపరులు దేశాన్ని వీడి దర్జాగా వెళ్లిపోతున్నారు. దేశంలో ప్రగతి రేటు పడిపోయింది. ప్రజల ఆదాయం క్షీణించిపోయింది. వీటిపై చర్చకు వస్తారా?' అని నిలదీశారు. 'ప్రతిపక్ష కూటమి విఫలం కాలేదు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చి వారి నమ్మకం నిలుపుకోవడంలో మోదీ, ఎన్డీఏ కూటమే విఫలమయ్యాయి' అని ఆయన అన్నారు. కేసీఆర్ ప్రస్తావిస్తున్న ఫెడరల్ ఫ్రంట్ మోదీ గూటి చిలకేనని చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'ప్రతిపక్షాలు రెండు కూటములుగా చీలిపోయాయని, ఫెడరల్ ఫ్రంట్‌లో బెంగాల్ సీఎం మమతా బెనర్జీ చేరారని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఆ ఫ్రంట్‌లో చేరామని మమత, నవీన్ పట్నాయక్ ఎక్కడైనా చెప్పారా? వాళ్లు చెప్పకుండానే ఫెడరల్ ఫ్రంట్‌కు వీళ్లెందుకు ప్రచారం చేస్తున్నారు? దీనినిబట్టే ఆ ఫ్రంట్ ఎవరిదో తెలిసిపోతోంది. ఉనికిలోనే లేని ఫ్రంట్‌కు ప్రచారం కల్పించాలని మోదీ, జైట్లీ తాపత్రయపడుతున్నారు. ప్రతిపక్షాలు చీలిపోయాయని ప్రజలను నమ్మించగలిగితే తమకు లాభం వస్తుందని లెక్కలు వేసుకుని ఆ ఫ్రంట్‌ను ప్రోత్సహిస్తున్నారు. ఉన్నవి రెండే కూటములు. ఒకటి బీజేపీ అనుకూల కూటమి.. రెండోది బీజేపీ వ్యతిరేక కూటమి. మమత బీజేపీకి వ్యతిరేకంగానే ఉన్నారు' అని చంద్రబాబు తేల్చిచెప్పారు.

అంతమంది ప్రచారం చేస్తే ఒక్కటేనా?

తెలంగాణలో టీఆర్ఎస్ గెలిస్తే బీజేపీ నేతలకు ఆనందం ఎందుకని చంద్రబాబు ప్రశ్నించారు. 'ప్రధాని రెండుసార్లు, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఏడు సార్లు తెలంగాణలో పర్యటించారు. వారితో పాటు 17 మంది కేంద్ర మంత్రులు, ఏడుగురు సీఎంలు ప్రచారం చేస్తే బీజేపీకి కేవలం ఒకటే సీటు వచ్చింది. ప్రధానిని సన్నాసి, ఫాసిస్ట్, గాడు అని కేసీఆర్ విమర్శించినా బీజేపీ నేతలు మాట్లాడడం లేదు. దీనినిబట్టే వారి మధ్య లాలూచీ తెలిసిపోతోంది. ప్రజలను అన్నిసార్లూ మోసం చేయలేరు' అని తేల్చిచెప్పారు. పది పార్టీలు కలిసి తనపై పోరాడుతున్నాయని మోదీ చేస్తున్న వ్యాఖ్యల్లో ఏ మాత్రం నిజం లేదని చంద్రబాబు అన్నారు. పైగా కేంద్రంలోని పది సంస్థలతో ఆయనే అన్ని ప్రతిపక్షాలపై.. ఆ పార్టీల నేతలపై దాడులు చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. 'ఎంతమందిపై దాడులు చేస్తారు? మీకెవరిచ్చారీ అధికారం? ఇంత దుర్మార్గం ఇదివరకెవరైనా చేశారా? దాడులతో బలహీనపరచాలనుకుంటున్నారా? భయభ్రాంతుల్ని చేస్తారా' అని విరుచుకుపడ్డారు.

కేసీఆర్‌కు సామంతులు కావాలి

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో బలహీన సామంత రాజులు ఉండాలన్నది కేసీఆర్ కోరిక అని చంద్రబాబు అన్నారు. 'విభజనలో 48 శాతం జనాభా.. 54 శాతం ఆదాయం తెలంగాణకు వెళ్లాయి. మనకు ఎక్కువ జనాభా, తక్కువ ఆదాయం వచ్చాయి. అయినా మన తెలివితేటలు, శ్రమతో పరిస్థితిని మెరుగుపరచుకుంటున్నాం. ఇదే ఊపు కొనసాగితే వచ్చే పదేళ్లలో దేశంలోనే మొదటి స్థానంలో నిలబడతాం. కష్టపడలేని వాళ్లకు ఇది నచ్చట్లేదు. ఇక్కడ పనిచేయలేని బలహీన ప్రభుత్వం ఉంటే వాళ్లకు ఇబ్బంది ఉండదు. పనిచేసే మన లాంటి వాళ్లు ఉంటే వాళ్లకు ఇబ్బంది. అందుకే ఆంధ్ర రాజకీయాల్లో తలదూర్చాలని చూస్తున్నారు. ఏపీ పత్రికల్లో ఫుల్ పేజీ ప్రకటనలు ఇచ్చి రెచ్చగొట్టాలని చూస్తున్నారు. మనం సరఫరా చేసిన విద్యుత్ బకాయిల కింద ఇవ్వాల్సిన రూ.5 వేల కోట్లు ఇవ్వరు. పత్రికల్లో ప్రకటనలు మాత్రం ఇస్తారు. ప్రజల దృష్టిని మరల్చే కుట్ర ఇది' అని చంద్రబాబు దుయ్యబట్టారు.

పవన్ రాకూడదన్నది జగన్ బాధ..

మీరూ... పవన్ భాగస్వాములని, కలుస్తారని జగన్ చెబుతున్నారు. మీరేమంటారన్న ప్రశ్నకు- "ఒకవేళ పోటీచేస్తే ఆయనకు బాధేంటి? ముందు జగన్ తన సంగతి చెప్పాలి. ఆయన బీజేపీతో కలుస్తాడా లేదా? పవన్ రాకూడదన్నది ఆయన బాధ. ఈ మధ్య నేను కూడా చూస్తున్నా. పవన్ కల్యాణ్‌ను తిడుతున్నాడు. ముందు జగన్ తన సంగతి చెప్పాలి" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. పవన్ మీవైపు వస్తే స్వాగతిస్తారా? అన్న ప్రశ్నకు -ఊహాజనిత ప్రశ్నలకు తాను సమాధానం చెప్పనన్నారు.

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
నిజామాబాద్ • బుధవారం 2 జనవరి 2019

భారత టెన్నిస్‌కు ఏఐటీఏ చేసిందేమిటి?

పుణె: భారత్‌లో టెన్నిస్ పురోగతికి గత మూడు దశాబ్దాలుగా చేసిందేమిటో చెప్పాలని మాజీ ఆటగాడు సోమ్‌దేవ్ దేవ్‌వర్మన్ ఏఐటీఏని ప్రశ్నించాడు. రూ. 20 కోట్ల వ్యయంతో నిర్మించదలచిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు కేవలం రూ. 10 కోట్లే కేటాయిస్తామని ఇప్పుడు చెప్పడాన్ని సోమ్‌దేవ్ తప్పుపట్టాడు. రూ. 10 కోట్లు ఏ మాత్రం సరిపోవని చెప్పిన సోమ్‌దేవ్ ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పుకొన్నాడు. ప్రాజెక్ట్ పూర్తయితే దానికి సోమ్‌దేవ్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించాల్సివుంది.


సోమ్‌దేవ్



ఈ ఏడాది అద్భుతంగా సాగాలి

న్యూఢిల్లీ: నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ సోషల్ మీడియా ద్వారా అభిమానులకు శుభాకాంక్షలు తెలిపాడు. 'భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక్కరికీ ఆస్ట్రేలియా నుంచి న్యూ ఇయర్ విషెస్ చెబుతున్నాం. ఈ ఏడాది మీకు మరింత అద్భుతంగా సాగాలని కోరుకుంటున్నాం' అని ట్వీట్ చేశాడు కోహ్లీ. అలాగే.. సిడ్నీ వీధుల్లో భార్య అనుష్క శర్మతో కలిసి దిగిన ఫొటోను విరాట్ పోస్ట్ చేశాడు. విరాట్‌తో పాటు మహిళల వన్డే కెప్టెన్ మిథాలీ రాజ్, మాజీలు వీరేంద్ర సెహ్వాగ్, వీవీఎస్ లక్ష్మణ్ సహా మరికొందరు క్రీడా ప్రముఖులు అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

'క్రికెట్ ఆస్ట్రేలియా' వన్డే కెప్టెన్ విరాట్

మెల్‌బోర్న్: గతేడాది అన్ని ఫార్మాట్లలోనూ అద్భుతంగా రాణించిన టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీకి క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) అరుదైన గౌరవాన్ని అందించింది. 2018కి గాను తాము ప్రకటించిన వన్డే అత్యుత్తమ జట్టుకు కెప్టెన్‌గా విరాట్‌ను ఆసీస్ క్రికెట్ బోర్డు ఎంపిక చేసింది. ఈ జట్టులో భారత ఓపెనర్ రోహిత్ శర్మకు కూడా చోటు కల్పించింది. మరో ఓపెనర్‌గా ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్ జానీ బెయిర్‌స్టోకు స్థానం దక్కింది. ఇక, బౌలింగ్ పరంగా భారత్ నుంచి కుల్దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రాను సీఏ తీసుకుంది. వీరితో పాటు జో రూట్, హెట్‌మయెర్, జోస్ బట్లర్, తిసార పెరీరా, రషీద్ ఖాన్, ముస్తాఫిజుర్ రెహ్మాన్ జట్టులో ఉన్నారు. కాగా, ఈ జట్టులో ఆస్ట్రేలియా నుంచి ఒక్క క్రికెటర్‌కు కూడా చోటు దక్కకపోవడం గమనార్హం.

మెల్‌బోర్న్ పిచ్ 'సాదాసీదా'!

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా, భారత్ మధ్య మూడో టెస్టు జరిగిన మెల్‌బోర్న్ పిచ్‌కు ఐసీసీ 'సాదాసీదా' రేటింగ్ ఇచ్చింది. దీం తో ఆ స్టేడియానికి ఎటువంటి డీమెరి ట్ పాయింట్ లభించదు. ఈ టెస్టు లో టీమిండియా 137 పరుగుల తేడాతో నెగ్గింది. గతేడాది ఇక్కడ యాషెస్ టెస్టు డ్రాగా ముగియడంతో పిచ్ పై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఐసీసీ కూడా పేలవ రేటింగ్‌తోపా టు మూడు డీమెరిట్ పాయింట్లు ఇచ్చింది. ఐదేళ్లలో ఐదు డీమెరిట్ పాయింట్లు చేరితే ఆ స్టేడియం టెస్టు హోదాను కోల్పోతుంది.

టీ20 వరల్డ్‌కప్ అర్హతలో శ్రీలంక, బంగ్లా విఫలం

దుబాయ్: మాజీ చాంపియన్ శ్రీలంక, బంగ్లాదేశ్.. 2020లో జరిగే టీ20 వరల్డ్‌కప్ సూపర్-12కు నేరుగా అర్హత సాధించడంలో విఫలమయ్యాయి. దీంతో ఈ రెండు జట్లు క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ర్యాంకింగ్స్‌లో టాప్-8లో ఉన్న పాకిస్థాన్, భా రత్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాం డ్, వెస్టిండీస్ తోపాటు అఫ్ఘానిస్థాన్‌లకు వరల్డ్‌కప్‌లో నేరుగా ఎంట్రీ లభించిందని ఐసీసీ ప్రకటించింది.

'టెస్టుల్లో నేనైతే బుమ్రా బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు ఇష్టపడను'...
ప్రపంచం మెచ్చే అద్భుత క్రికెటర్ విరాట్ కోహ్లీ కామెంట్ ఇది.
'బుమ్రా బౌలింగ్ శైలిని గమనిస్తే నాకు జెఫ్ థామ్సన్ గుర్తుకొస్తున్నాడు' ..
ఆసీస్ దిగ్గజ పేసర్ డెన్నిస్ లిల్లీ పొగడ్త ఇది.
అరంగేట్రం చేసిన ఏడాదిలోనే భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఎదుగుదల ఎలా ఉందో పై కామెంట్స్ చూస్తేనే అర్థమవుతుంది. కేవలం తొమ్మిది టెస్టుల అనుభవంతోనే అతడు జట్టుకు వెన్నెముకలా మారిన తీరు అపూర్వం. భారత్ అంటే బ్యాటింగే కాదు.. ఆ జట్టు పేస్ బౌలింగ్‌ను కూడా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలనే హెచ్చరికను అతడు ప్రత్యర్థి జట్లకు పంపగలిగాడు. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో మెరుపులు మెరిపించి ఏడాది క్రితం టెస్టుల్లో చోటు దక్కించుకున్న ఈ గుజరాతీ.. తాజాగా ప్రపంచ మేటి పేసర్‌గా పేరు తెచ్చుకోగలిగాడు. అలాగే సెలెక్టర్లు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా భారత్‌ను చూసి ఇతర జట్లు వణికేలా చేస్తున్నాడు.





బుమ్రా విషయంలో నా అంచనా తప్పింది!

న్యూఢిల్లీ: భారత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా విషయంలో తన అంచనా తప్పిందని దిగ్గజ ఆటగాడు కపిల్‌దేవ్ అన్నాడు. అతడు ఎంతో వైవిధ్యమైన బౌలర్ అని కొనియాడాడు. 'తొలిసారి బుమ్రా బౌలింగ్ యాక్షన్ చూసినప్పుడు ఎక్కువ కాలం క్రికెట్‌లో మనలేడనిపించింది. కానీ నా అంచనా తప్పింది. ఆస్ట్రేలియాలో అతడి ప్రదర్శనను ప్రశంసించకుండా ఉండలేన'ని కపిల్ తెలిపాడు. 'కొత్త, పాతబడిన బంతితో జస్‌ప్రీత్ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడు. చక్కని బౌన్సర్‌తో ప్రత్యర్థిని ఆశ్చర్యపరచగలడు. కచ్చితత్వంతో పాటు తెలివిగా బంతులు వేయడం బుమ్రాకు ప్లస్. అందుకే నేడు అగ్రశ్రేణి బౌలర్లలో ఒకడిగా ఎదిగాడ'ని కపిల్ విశ్లేషించాడు.

అతని బౌలింగ్.. బ్యాట్స్‌మెన్‌కు పీడకలే!


హాడ్జ్

సిడ్నీ: టీమిండియా పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాపై ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ బ్రాడ్ హాడ్జ్ ప్రశంసలు కురిపించాడు. అతడిని ఎదుర్కోవడం బ్యాట్స్‌మెన్‌కు పీడకలలాంటిదన్నాడు. బౌలింగ్‌లో సమంగా కనిపిస్తున్నా.. వన్‌డౌన్‌లో చటేశ్వర్ పుజారా భారీ స్కోర్లు చేయడం ఇరుజట్ల మధ్య ప్రధాన వ్యత్యాసమని విశ్లేషించాడు. టెస్టు మ్యాచ్ బౌలర్ల నుంచి ఏది కోరుకుంటామో.. అవన్నీ బుమ్రాలో పుష్కలంగా ఉన్నాయని చెప్పాడు. 'అతడి బంతులను ఎదుర్కోవడమంటేనే పీడకల లాంటిది. ఏ బ్యాట్స్‌మన్‌ను అడిగినా.. వామ్మో అనే అంటారు. వేగం, కచ్చితత్వంతోపాటు వికెట్‌కు ఇరువైపులా బంతిని తిప్పగలడ'ని అన్నాడు. కేవలం 12 నెలల్లోనే దిగ్గజం కపిల్‌దేవ్‌తో పోల్చగలిగేలా బుమ్రా ఎదగడం అద్భుతమని బ్రాడ్ చెప్పాడు. ఎన్నడూలేనంతగా భారత బౌలింగ్ విభాగం ఎంతో బలంగా కనిపిస్తోందని వివరించాడు. టీమిండియా సిరీస్ నెగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని హాడ్జ్ చెప్పాడు.

భారత పేస్ దళపతి

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

గతంలో భారత క్రికెట్ అంటే బ్యాట్స్‌మెన్ హవా.. స్పిన్నర్ల మాయాజాలం గురించే చర్చించుకునేవారు. కానీ ఫాస్ట్ బౌలర్ల నుంచి మాత్రం ఆశించిన సహకారం అందేది కాదు. అప్పుడప్పుడూ కపిల్ దేవ్, జవగల్ శ్రీనాథ్, జహీర్ ఖాన్ రూపంలో అలా మెరుపులు కనిపించేవి. కానీ ఈ పరిస్థితిని 2018 సమూలంగా మార్చింది. జస్‌ప్రీత్ బుమ్రా, ఇషాంత్ శర్మ, మహ్మద్ షమి, భువనేశ్వర్, ఉమేశ్ యాదవ్ రూపంలో ఇప్పుడు భారత పేస్ దళం బలంగానే ఉంది. మరీ ముఖ్యంగా 25 ఏళ్ల బుమ్రా తన వైవిధ్యమైన బంతులతో భారత్‌కు అద్భుత విజయాలను అందిస్తున్నాడు. చాలా వేగంగా జట్టుకు ప్రధాన పేసర్‌గా మారిపోయాడు. కొత్త, పాత బంతితో మెరుపులు మెరిపిస్తూ అవతలి బ్యాట్స్‌మెన్‌కు బౌన్సర్లతో షాక్ ఇవ్వగలుగుతున్నాడు.

ఎంపికే అనూహ్యం..: గతేడాది జనవరిలో దక్షిణాఫ్రికా పర్యటనకు బుమ్రాను ఎంపిక చేయడం చాలా మందిని ఆశ్చర్యపరిచింది. ఈ ఎంపికకు ముందు ఏడాది వరకు అతడు ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడింది లేదు. అందుకే సంప్రదాయక టెస్ట్ ఫార్మాట్‌లో అతడిని తీసుకుని సాహసం చేస్తున్నారని మాజీలు వ్యాఖ్యానించారు. కానీ మూడు టెస్టుల ఆ సిరీస్‌లో అతను 25.21 సగటుతో 14 వికెట్లు తీసి విమర్శకుల నోళ్లు మూయించాడు. ఇందులో భారత్ గెలిచిన చివరి టెస్టులో కెరీర్‌లో తొలిసారిగా ఐదు వికెట్లతో చెలరేగాడు. ఆ తర్వాత ఇంగ్లండ్‌తో ఆడిన ఐదు టెస్టుల్లోనూ 25.91 సగటుతో మరో 14 వికెట్లు పడగొట్టాడు. గత 12 నెలల కాలంలో అతడు 9 టెస్టులు ఆడగా 21.02 సగటుతో 48 వికెట్లు తీసి భారత్ తరపున రికార్డు నెలకొల్పాడు.

మరింత ఎత్తుకు ఎదిగాడు..: ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగు టెస్టుల సిరీస్ బుమ్రా కెరీర్‌లో ఎప్పటికీ గుర్తుండిపోయేదే. తన నైపుణ్యానికి పదును పెడుతూ ఇప్పటిదాకా ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనే 20 వికెట్లు తీసి విశ్లేషకులను సైతం అబ్బురపరిచాడు. ఈ ఫార్మాట్‌లో అనుభవం గడించిన కొద్దీ రాటుదేలుతున్నాడు. ప్రస్తుత సిరీస్‌ను గమనిస్తే ఈ విషయం బోధపడుతుంది. అడిలైడ్, మెల్‌బోర్న్ పిచ్‌లు ఫాస్ట్ బౌలర్లకు అంతగా సహకరించలేదు. అయినా బుమ్రా కచ్చితత్వంతో కూడిన బౌలింగ్‌తో వికెట్లను రాబట్టాడు. ఆసీస్ బ్యాటింగ్ లైనప్‌ను అతడు వణికిస్తున్న తీరు నిజంగా అభిమానులకు కనువిందు చేస్తోంది. ముఖ్యంగా మెల్‌బోర్న్ పిచ్‌పై కెరీర్‌లోనే ఉత్తమ గణాంకాల (6/33)తో భారత్‌కు 292 పరుగుల భారీ ఆధిక్యం లభించేలా చేశాడు. అలాగే ఆ మ్యాచ్ మూడో రోజు తొలి సెషన్ ఆఖరి బంతి క్రికెట్ అభిమానులకు చాలాకాలం గుర్తుండిపోతుంది. స్లో యార్కర్‌తో షాన్ మార్ష్‌ను అవాక్కయ్యేలా చేసిన తీరు అతడిలోని ప్రతిభను చాటింది.

సెహ్వాగ్ తరహాలో..: టెస్టు క్రికెట్ అంటే నత్తనడకన సాగే ఆట అనే అభిప్రాయానికి వీరేంద్ర సెహ్వాగ్ రాకతో చెక్ పడింది. టెక్నిక్ అనవసరం.. బాదడమే లక్ష్యంగా అతడు ఈ ఫార్మాట్‌ను కొత్త పుంతలు తొక్కించాడు. బౌన్సీ ట్రాక్‌లపై అతడు సాహసంగా అప్పర్ కట్‌తో బంతులను బౌండరీలకు పంపేవాడు. అందుకే ఎవరికీ సాధ్యంకానీ రీతిలో భారత్ నుంచి రెండు ట్రిపుల్ సెంచరీలు సాధించగలిగాడు. ఇప్పుడు బౌలింగ్‌లో బుమ్రా అదే శైలిని కనబరుస్తున్నాడు. దూకుడుగా బౌలింగ్ చేస్తూ ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచి వికెట్లు రాబడుతున్నాడు. అంతేకాకుండా పరిస్థితులకు తగ్గట్టుగా తన బౌలింగ్ రనప్‌ను మార్చుకుంటాడు. ఇది అతడి సహజ శైలిలో బౌలింగ్ చేసేందుకు తోడ్పడుతుంది. అందుకే స్లో బంతులు, యార్కర్లు, రివర్స్ స్వింగ్‌లతో బ్యాట్స్‌మెన్‌ను బెంబేలెత్తిస్తున్నాడు. మూడో టెస్టులో ఇలాగే హ్యారిస్‌ను బౌన్సర్‌తో, షాన్ మార్ష్‌ను స్లో యార్కర్‌తో, హెడ్‌ను స్వింగ్‌తో, లియాన్‌ను 146.1 కి.మీ వేగంతో అవుట్ చేశాడు. అతి తక్కువ రనప్‌తోనే 140కి.మీ వేగానికి మించి బంతులు విసరడం బుమ్రాపై గౌరవం పెంచుతోందని దిగ్గజ ఆల్‌రౌండర్ కపిల్‌దేవ్ సైతం కొనియాడాడు.

కోహ్లీకి కొండంత భరోసాగా..: గత ఏడాది విదేశాల్లో భారత జట్టు నాలుగు టెస్టుల్లో నెగ్గింది. ఇందులో ప్రతీ మ్యాచ్‌లోనూ బుమ్రానే ఎక్కువ వికెట్లు పడగొట్టడం విశేషం. జొహన్నెస్‌బర్గ్, ట్రెంట్‌బ్రిడ్జ్‌లో ఏడు వికెట్లు తీయగా అడిలైడ్‌లో ఆరు, మెల్‌బోర్న్‌లో తొమ్మిది వికెట్లతో కీలక పాత్ర పోషించాడు. అంతేకాకుండా అడిలైడ్‌లో మినహా మిగతా మూడు విజయాల్లో ఒక్కో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్ల ఘనత సాధించాడు. అందుకే ప్రత్యర్థిని దెబ్బతీయాలంటే ఇప్పుడు కెప్టెన్ కోహ్లీ చూపు బుమ్రాపైనే ఉంటోంది. దీనికి తగ్గట్టుగానే అతడు తన సహచరులకన్నా ఎక్కువగా ఐదుసార్లు అర్ధ సెంచరీ భాగస్వామ్యాన్ని, 3 సార్లు సెంచరీ భాగస్వామ్యాన్ని విడదీశాడు. అలాగే ఇప్పుడు మూడు ఫార్మాట్లలోనూ బుమ్రా జట్టు ప్రధాన బౌలర్‌గా ఎదిగాడు. వన్డేలను గమనిస్తే 44 మ్యాచ్‌ల్లో 21.01 సగటుతో 78 వికెట్లు తీశాడు. ఇక పొట్టి ఫార్మాట్‌లోనూ 40 మ్యాచ్‌ల్లో 6.77 ఎకానమీ రేట్‌తో 48 వికెట్లు తీసి శభాష్ అనిపించుకున్నాడు. అందుకే బ్యాటింగ్‌లో విరాట్ కోహ్లీ ఎలాగో బౌలింగ్‌లో భారత్‌కు బుమ్రా కూడా అంతే ముఖ్యంగా మారాడు. ఈనేపథ్యంలో రానున్న ప్రపంచకప్ కోసం అతడిని తమ తురుపుముక్కగా వాడుకోవాలని జట్టు చూస్తోంది. ఇందుకోసం అతడిని తాజాగా ఉంచేందుకు ఐపీఎల్‌కు దూరంగా ఉంచాలనే ఆలోచనలో కూడా టీమ్ మేనేజ్‌మెంట్ ఉంది.

పెయిన్ సరదా తీర్చేశాడు



సిడ్నీ: 'నా భార్యతో సినిమాకు వెళతా.. నీవు మా పిల్లల్ని ఆడిస్తావా..' అంటూ మూడో టెస్టులో ఆస్ట్రేలియా కెప్టెన్ టిమ్ పెయిన్, భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్‌ను రెచ్చగొట్టిన విధానం గుర్తుందిగా! ఇప్పుడు నిజంగానే పంత్ అతడి చిన్నారిని ఎత్తుకొని అందరినీ ఆకట్టుకున్నాడు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మారిసన్ ఇచ్చిన విందులో రెండు జట్ల ఆటగాళ్లు పాల్గొన్నారు. ఇందులో పెయిన్ భార్యా పిల్లలతో సహా హాజరయ్యాడు. దీంతో అక్కడే ఉన్న పంత్.. పెయి న్ కొడుకును ఎత్తుకుని సరదాగా ఆడించాడు. ఈ ఫొటోను పెయిన్ భార్య బొన్నీ.. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసి 'ఉత్తమ బేబీ సిట్టర్'గా క్యాప్షన్ పెట్టింది. అటు ఐసీసీ కూడా ఇదే ఫొటోను 'పెయిన్ సవాల్‌ను స్వీకరించిన పంత్' అనే కామెంట్‌తో ట్విటర్‌లో పోస్ట్ చేసింది.

పీబీఎల్‌లో నేడు
ఢిల్లీ x బెంగళూరు (రా. 7 గం.)
స్టార్ స్పోర్ట్స్-1లో


సైనాపై సింధు పైచేయి

● టేబుల్ టాపర్‌గా హంటర్స్



టాస్ సందర్భంగా సైనా, సింధు

పుణె: కొత్త ఏడాదిని స్టార్ షట్లర్ పీవీ సింధు గ్రాండ్‌గా ఆరంభించింది. ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో ఏస్ షట్లర్ సైనా నెహ్వాల్‌పై తన ఆధిపత్యాన్ని మరోసారి చాటింది. గత రెండు మ్యాచ్‌ల్లో ఓటమిని చవి చూసిన సింధు మళ్లీ గెలుపు బాట పట్టడంతో.. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ హంటర్స్ 5-0తో నార్త్ ఈస్ట్రన్ వారియర్స్‌ను చిత్తుచేసి టేబుల్ టాపర్‌గా నిలిచింది. ఈరోజు పోరులో ఇరుజట్ల కెప్టెన్లు సింధు, సైనా మధ్య మ్యాచ్ హైలైట్. హంటర్స్ ప్లేయర్ సింధు 11-15, 15-9, 15-5తో సైనాపై నెగ్గి హైదరాబాద్‌ను 3-1 ఆధిక్యంలో నిలిపింది. గాయం కారణంగా గత మూడు మ్యాచ్‌లకు దూరంగా ఉన్న సైనా.. పూర్తి ఫిట్‌నెస్‌తో కనిపించలేదు. ముఖ్యంగా సుదీర్ఘర్యాలీలు ఆడలేకపోయింది. కానీ, తొలి గేమ్‌లో 7-10తో వెనుకబడినా.. పుంజుకున్న నెహ్వాల్ 15-11 గేమ్‌ను కైవసం చేసుకుంది. అయితే, రెండోగేమ్‌లో విరుచుకుపడిన సింధు 8-3తో పైచేయి సాధించింది. అదే జోరులో 15-9తో గేమ్‌న నెగ్గి 1-1తో సమం చేసింది. నిర్ణాయక మూడో గేమ్‌లో సింధు ముందు సైనా నిలవలేక పోయింది. 15-5తో నెగ్గిన సింధు మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. పీబీఎల్‌లో సైనాపై సింధుకు ఇది మూడో విజయం. అంతకుముందు మిక్స్‌డ్ డబుల్స్‌గా జరిగిన తొలి మ్యాచ్‌లో హంటర్స్ ఓడినా.. మిగిలిన మ్యాచ్‌లు నెగ్గి సత్తా చాటింది. మిక్స్‌డ్‌లో హైదరాబాద్ జోడీ కిమ్-ఎమ్‌ఒన్ 8-15, 14-15తో లియో -కిహ్ చేతిలో ఓడింది. అయితే, ట్రంప్‌గా ఎంచుకున్న పురుషుల సింగిల్స్‌లో లి హయున్ 10-15, 15-13, 15-9తో సయేన్‌సమ్‌బూన్‌సక్‌పై నెగ్గడంతో హంటర్స్ 2-1తో ఆధిక్యం సాధించింది. పురుషుల సింగిల్స్ రెండోమ్యాచ్‌లో మార్క్ కల్‌ఝౌ 15-11, 15-14తో టియాన్‌పై నెగ్గి 4-0తో హంటర్స్ గెలుపును ఖరారు చేశాడు. వారియర్స్ ట్రంప్‌గా ఎంచుకున్న ఈ మ్యాచ్‌లో ఓడడంతో గెలుచుకున్న ఒక్క పాయింట్‌ను కూడా చేజార్చుకుంది. చివరగా పురుషుల డబుల్స్‌లో కిమ్ -బోడిన్ ఇసారా జోడీ 15-10, 12-15, 15-14తో సియాంగ్-లియోపై గెలిచింది.


శ్రీకర్ భరత్ (178 నాటౌట్)

భరత్, భుయ్ సెంచరీలు

● ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ 502/7 డిక్లేర్డ్
● హైదరాబాద్‌తో రంజీ పోరు


రికీ భుయ్ (129)

విజయనగరం (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌తో గ్రూప్- బి రంజీలో ఆతిథ్య ఆం ధ్ర జట్టు భారీ స్కోరు నమోదు చేసింది. శ్రీకర్ భరత్ (277 బంతుల్లో 22 ఫోర్లు, 2 సిక్సర్లతో 178 నాటౌట్), రికీ భుయ్ (248 బంతుల్లో 14 ఫోర్లు, 2 సిక్సర్లతో 129) సెంచరీలతో రాణించగా.. ఓవర్‌నైట్ స్కోరు 207/3తో మూడో రోజైన మంగళవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 502/7 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. భరత్-రికీ భుయ్ నాలుగో వికెట్‌కు ఏకంగా 234 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. మెహ్దీ హసన్ 3, రవితేజ 2 వికెట్లు సాధించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ఆట చివరకు హైదరాబాద్ వికెట్ నష్టపోకుండా 33 రన్స్ చేసింది. ప్రస్తుతం అక్షత్‌రెడ్డి సేన 198 పరుగుల వెనుకంజలో ఉంది. ఓపెనర్లు ఠాకూర్ తిలక్‌వర్మ (20), తన్మయ్ అగర్వాల్ (13) క్రీజులో ఉన్నారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 271 స్కోరు చేసింది. అయితే ఆటకు బుధవారమే చివరి రోజు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.